
# సైన్స్ ఫిక్షన్ కథలు

కస్తూరి మురళీ కృష్ణ



# సైన్స్ ఫిక్షన్ కథలు

కస్తూరి మురళీకృష్ణ

కస్తూరి ప్రచురణలు

సైన్స్ ఫిక్షన్ కథలు
*(Science Fiction Stories)*
*Serialised in Andhra Bhoomi Monthly*
*by* **Kasturi Muralikrishna**

© Author

First Edition - November, 2010

Price: Rs. 50/-

*Published by:*
**K. Padma**
Kasturi Prachuranalu
Plot No. 32, Dammaiguda,
Raghuram Nagar Colony,
Nagaram Post Office,
Hyderabad-83.
Cell: 98496 17392

*Sole Distribution:*
**Navodaya Book House**
Opp. Arya Samaj Mandir,
Kachiguda 'X' Roads,
Hyderabad-27.
Ph: 040-24652387

*Cover Design, DTP & Printing::*
**Himalaya Graphics,**
Chikkadpally, Hyderabad-20.
Ph: 66100227

# ముందుమాట

**ఈ** సైన్స్ ఫిక్షన్ కథల సంకలనంలోని కథలు డాక్టర్ పూర్ణచంద్‌గారి మాటల్లో చెప్పాలంటే 'హార్డ్‌కోర్ సైన్స్ ఫిక్షన్' కథలు. సైన్స్ ఫిక్షన్ కథలకూ సైన్స్ ఫాంటసీ కథలకూ తేడాను ప్రఖ్యాత సైన్స్ ఫిక్షన్ రచయిత ఆర్థర్ సి క్లార్క్ బహుసుందరంగా నిర్వచించాడు. సైన్స్ ఫాంటసీ కథలు నిజమైతే బాగుండుననిపిస్తుంది. వీటిల్లో సైన్స్‌కన్నా 'ఊహ' అధికంగా ఉంటుంది. కాబట్టి ఇవి నిజమయితే బాగుండుననిపించినా అవి ఎన్నటికీ నిజం కావు. సైన్స్ ఫిక్షన్ కథలలో ఊహ ఉన్నా ఆ ఊహకు ఆధారం విజ్ఞానశాస్త్రాంశాలు. అందువల్ల ఇవి నిజం కాకపోతే బాగుండుననిపిస్తుంది. కానీ సైన్స్ ఫిక్షన్ కథలు నిజమయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయి.

నేను రచించిన ఈ పది కథలు ప్రధానంగా వైజ్ఞానిక శాస్త్రాంశాల ఆధారంగా సృజించినవే. 'ప్రయోగం' కథ బుధగ్రహ వాతావరణాన్ని వర్ణిస్తుంది. ఇలాంటి సిమ్యూలేటెడ్ పరిశోధనలు జరుగుతున్నాయి. 'వైరస్‌తో యుద్ధం' కథ ఇప్పుడు మనం అనుభవిస్తున్న సైబర్ వార్‌ఫేర్‌ను చూపిస్తుంది. 'టైటన్‌తో కరచాలనం' రాసినప్పుడు సైన్స్ ఫాంటసీకి దగ్గరగా ఉందనుకున్నాను. కానీ, ఇటీవలె శాస్త్రవేత్తలు టైటన్‌లో జీవజాడలున్నాయని కనుగొన్నారు. అలాగే ఆన్‌లైన్ పి.కె. ఆధారంగా రచించిన కథ 'మాయా ప్రపంచం'. ఇప్పటికే 'ఫేస్‌బుక్'తో పరిచయం ఉన్నవారికి, ఇంటరాక్టివ్ ఆటల గురించి తెలుసు. నెట్ ద్వారా ఎలా తప్పుదారి పట్టించవచ్చో తెలుసు. ఈ నెట్ వ్యసనాన్ని వ్యాపారులు ఎలా వాడుకుంటారో ఈ కథలో చూపించే ప్రయత్నం చేశాను. ఇదీ ఇపుడు జరుగుతున్నదే. ఏదో ఓ దాన్ని ప్రజలకు అలవాటు చేయటం, ప్రజలకు జరిగే నష్టంతో సంబంధం లేకుండా లాభాల కోసం పోటీలు పడటం మనకు తెలుసు. 'క్వీక్... క్వీక్... క్వీక్' కథ అర్థం కాలేదన్న పాఠకులున్నారు. ఇది యాంత్రిక వ్యవస్థను ప్రతీకాత్మకంగా సూచిస్తుంది. 'మనిషీ ఓ రకమైన రోబోటే' అన్న సిద్ధాంతం ఈ రచనకు ప్రాతిపదిక. మిగతా కథలలో సామాన్య పాఠకులకు పరిచయం ఉండవనిపించిన విజ్ఞాన శాస్త్రాంశాలను బాక్స్‌లలో ఇచ్చి పరిచయం చేశాను.

ఇలాంటి కథలు రాస్తాననగానే ప్రోత్సహించి వరుసగా పది కథలను ప్రచురించి ప్రోత్సహించిన ఆంధ్రభూమి మాసపత్రిక న్యూస్ ఎడిటర్ శ్రీమతి ఎ.ఎస్. లక్ష్మిగారికి బహు కృతజ్ఞతలు. రచనలలో నాకు సంపూర్ణంగా సహకరిస్తున్న భార్య పద్మకు, సోదరి మాలినికి, అమ్మకు ధన్యవాదాలు. అందంగా డిటిపి చేసిన శ్రీమతి రవిప్రభగారికి, కవర్ రూపొందించిన కృష్ణంరాజుకు, అచ్చువేసిన హిమాలయా గ్రాఫిక్స్‌కు, మిత్రుడు సూరికి, సోల్ డిస్ట్రిబ్యూషన్ స్వీకరించిన నవోదయ బుక్‌హౌస్‌కు, ప్రచురిస్తున్న కస్తూరి ప్రచురణలకు కృతజ్ఞతలు.

రచయితగా ఒక ఇమేజ్‌కి బద్ధుడిని కాకూడదని, మూస రచనల ఊబిలో చిక్కుకోకూడదని విభిన్న ప్రక్రియలతో ప్రయోగాత్మకంగా రచనలు చేస్తున్న నాకు పాఠకుల అభిప్రాయం శిరోధార్యం. పాఠకుల ప్రోత్సాహం ఊపిరి. ఈ కథలకు పాఠకుల నిర్మొహమాటమయిన అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నాను.

# విషయసూచిక


| | |
|---|---|
| ప్రయోగం | 5 |
| టైటన్లతో కరచాలనం | 11 |
| నేనెవరిని? | 19 |
| షాడో యూనివర్స్ నీడ | 27 |
| పునఃసృష్టికి పురిటినొప్పులు | 34 |
| కీక్... కీక్... కీక్... | 42 |
| మాయా ప్రపంచం | 49 |
| వైరస్ యుద్ధం | 57 |
| కాలం చూసిన సత్యం | 65 |
| బెంటెల్గీస్‌లో బాలుడు | 74 |


---

**సైన్స్ ఫిక్షన్ కథల రచనలో ఆర్థర్ సి క్లార్క్, ఇజాన్ అసిమోల్, జెజి బాల్లార్డ్, ఇయాన్ ఎం బాంక్స్ వంటి రచయితల ప్రభావం, ప్రేరణల నుంచి తప్పించుకోవటం కష్టం. కాబట్టి నా కథలలో వారి ఛాయలు కనిపిస్తాయి. అలాగని ఈ కథలు ఏ ఇతర కథలకు అనుకరణలు కావు**

---

# ప్రయోగం

**తా**ను చేసిన పొరపాటు వెంటనే అర్థమైంది అవినాష్‌కు. కానీ అంతరిక్షంలో అందులో అస్సలు పరిచయం లేని గ్రహంలో, ఒక్క చిన్న పొరపాటయినా అతిపెద్ద శిక్షను అనుభవించక తప్పదు. ఆ శిక్ష మరణమేనని అవినాష్‌కు తెలుసు.

తప్పు చేసేటప్పుడు ఇదీ తప్పు అని స్పష్టంగా తెలియకున్నా ఏదో తప్పు జరుగుతోందని మనసు గ్రహిస్తుంది. పరిశోధక నౌక 'ప్రోబ్ ఎక్స్ ఎక్స్-1' బుధగ్రహంలోని 'హేమ' ప్రాంతాన్ని తాకేందుకు సిద్ధమవుతోంది. ఎంతో నైపుణ్యంతో 'ప్రోబ్ ఎక్స్ ఎక్స్-1' నేలను, బుధగ్రహం నేలను తాకేందుకు సిద్ధం చేయసాగాడు అవినాష్.

అవినాష్‌కు ఎంతో ఉద్విగ్నంగా ఉంది. ఆనందంగా ఉంది.

వైజ్ఞానిక పురోభివృద్ధిలో మానవజాతి మరో అడుగు ముందుకేస్తోంది. ఆ అడుగు తన ద్వారా పడుతోంది. బుధగ్రహంపై అడుగిడుతున్న తొలి మానవుడు తానే!

'ప్రోబ్ ఎక్స్ ఎక్స్ - 1' కిటికీలోంచి బయట కనపడుతున్న దృశ్యాలను ఆత్రంగా చూస్తున్నాడు అవినాష్. ఎప్పుడు బుధగ్రహంపై కాలిడతానా, తన పేరు చరిత్ర పుటల్లో చిరస్థాయిగా ఉంటుందా అని ఆత్రంగా ఉంది అతనికి.

ఇంతలో దూరంగా ఏదో చటుక్కున మెరిసింది. బుధగ్రహ ఆకర్షణ శక్తి ఎంత బలహీనమైనదంటే కనీసం వాతావరణాన్ని కూడా పట్టి బంధించలేదు.

కాబట్టి అందమైన సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు, గాలులు వీచడం వంటివేవీ ఇక్కడ ఉండవు.

పైగా బుధగ్రహంపై జీవరాశులు లేకపోవడంతో అటు, ఇటూ కదిలేవీ ఏవీ ఉండవు. అందుకే ఏదో మెరిసినట్టయి కదులుతున్నట్టు అనిపించడంతో అవినాష్

దృష్టి చెదిరింది. ఆవైపు దృష్టి మళ్లడంతో నౌక నిలబడేందుకు కాళ్లను విడుదల చేసే మీటను నొక్కే బదులు, కాళ్లు ముడుచుకునేట్టు చేసే మీటను నొక్కాడు.

పొరపాటు గ్రహించి సరిదిద్దుకునేలోగా 'ప్రోబ్ ఎక్స్ ఎక్స్ -1' బుధగ్రహం నేలను తాకింది. నేలను తాకుతూనే కాస్త పైకి ఎగిరింది. అయితే దాన్ని క్రిందకు ఆకర్షించేంత ఆకర్షణ శక్తి బుధగ్రహానికి లేకపోవడంతో 'ప్రోబ్ ఎక్స్ ఎక్స్-1' పైపైకి ఎగరసాగింది.

అవినాష్ తన తప్పును గ్రహించాడు. త్వరలో తను నౌకపై పట్టు సాధించకపోతే అది అలాగే అంతరిక్షంలోకి ఎగిరిపోతుంది.

ఎందుకంటే గ్రహానికి అంతరిక్షం నుంచి వేరుచేసే వాతావరణం లేకపోవడం వల్ల గ్రహ ఉపరితలంపైకి ఎగరడం అంటే అంతరిక్షంలోకి ఎగరడమే. పైగా సూర్యుడికి అతిదగ్గరగా కేవలం 36 మిలియన్ల మైళ్ల దూరంలో మాత్రమే ఉన్న గ్రహం కావడంతో ఈ గ్రహంపై సూర్యుడి ఆకర్షణశక్తి ప్రభావం అధికంగా ఉంటుంది. దాంతో ఏ మాత్రం పొరపాటు చేసినా తన నౌక సూర్యుడివైపు ఆకర్షితమవుతుంది.

అవినాష్ కళ్లముందు తన నౌక మండే అగ్నిగోళంలోకి దూసుకుపోతున్న దృశ్యం కనిపించింది. అతని ఒళ్లు జలదరించింది. తన నౌక, నిజానికి సూర్యగోళం దరిదాపులకు కూడా పోలేదు. తన నౌక సూర్యుడి వేడిని తట్టుకునేట్టు నిర్మించినా అది బుధగ్రహానికే పరిమితం. సూర్యుడి వేడిని తట్టుకోలేదు. సగం దూరంలోనే తాను ఆవిరైపోతాడు. తన నౌక ఆవిరైపోతుంది.

అతనికి తాము బుధగ్రహం వేడిపై చేసిన పరిశోధన గుర్తుకువచ్చింది. వాతావరణం లేని గ్రహంపై సూర్యకాంతి ప్రభావం ఎలా ఉంటుందో చూడాలని, తమ మదర్‌షిప్ 'విశ్వం-3003' కెప్టెన్ కరాళ్ బుధగ్రహంపై తమ రోబో ద్వారా ఓ పెద్ద చెక్కముక్కనుంచాడు.

తెల్లవారి సూర్యకిరణం పడడంతోటే అది నల్లగా మారింది. క్షణంలో బూడిదయింది. అదే వాతావరణం ఉన్న గ్రహంలో అయితే భగ్గుమని విస్ఫోటనం చెందేది. వాతావరణం లేకపోవడంతో బొగ్గయి ఆవిరైపోయింది.

అయితే సూర్యుడికి దగ్గరగా ఉంది కాబట్టి బుధగ్రహం అన్నింటికన్నా వేడిగా ఉంటుందనుకుంటే పొరపాటు. బుధగ్రహం కన్నా శుక్రగ్రహం ఉష్ణోగ్రత ఎక్కువ ఉంటుంది. ఆ గ్రహ వాతావరణం వేడిని పట్టి బంధిస్తుంది. బుధగ్రహంలో వాతావరణం లేకపోవడం వల్ల తొంభై శాతం వేడి అంతరిక్షంలోకి పరావర్తనం చెందుతుంది. అయినా సరే బుధగ్రహంలో వేడికి సీసం కూడా కరిగిపోతుంది.

ఇది గుర్తుకువచ్చి అవినాష్ ఒళ్లు జలదరించింది. తానూ విశ్వంలో బూడిదై ఆవిరైపోతాడా?

ఒడుపుగా తన నౌకను క్రిందకు దింపసాగాడు. పైకి లాగుతున్న ఆకర్షణశక్తికి, క్రిందికి లాగుతున్న యాంత్రికశక్తికీ నడుమ ఊగిసలాడుతున్నట్టు ఒక్క క్షణం ఆగింది

నౌక. నెమ్మదిగా దిగనారంభించింది.

నౌక నేలను తాకేందుకు సిద్ధమవుతుండగా కాళ్ళు తెరుచుకునే మీట నొక్కాడు.

కానీ ఇందాక జరిగిన ప్రమాదంలో ఒక కాలు దెబ్బతిన్నట్టుంది. నౌక ఒకే కాలితో నేలను తాకి స్థిరంగా ఉండలేక ఒకవైపు పడి, పల్టీలు కొట్టసాగింది. సాధారణంగా పైన, క్రింద అనే భావనలు ఆకర్షణశక్తి లేని గ్రహంమీద అర్థంలేని భావాలు. దాంతో ఇది అర్థం చేసుకోలేని అవినాష్ ప్రపంచం తల్లక్రిందులైంది. తాను పైకి లేస్తున్నాడో, క్రింద పడుతున్నాడో అర్థం కాలేదు.

ఒక్కక్షణం కొండపైకి ఎక్కుతున్న భావన కలిగితే, మరోక్షణం లోయలోకి జారుతున్న అనుభూతి కలుగుతోంది.

అంతరిక్షంలో, భావరహిత స్థితిలో వ్యోమగాములకు తరచు కలిగే భ్రమ ఇది అని అవినాష్‌కు తెలుసు. కానీ ఆ భ్రమ ఎంత బలంగా ఉందంటే అదే నిజం అనిపిస్తోంది.

తనపై తాను పట్టు సాధించి, నౌక కదలికలను నియంత్రించే మీటను నొక్కాడు. ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఎక్విప్‌మెంట్ పనివల్ల నౌక కదలికలను ఆపి స్థిరంగా ఉంది.

ఒక్క క్షణం ఇంకా ఏం చేయాలో తోచలేదు అవినాష్‌కు. తన ఈ పల్టీల వల్ల అనుకున్న స్థలాన్ని దాటి ఎంతో దూరం వచ్చేశాడు. తానున్న ప్రాంతాన్ని తెలిపే కంప్యూటర్ ముక్కలయింది. మదర్‌షిప్‌ను సహాయం కోరడం కన్నా వేరే ఏమీ చేయలేదు. సహాయం కోసం 'విశ్వం–3003' ట్రాన్స్‌మీటర్ మీట నొక్కాడు. ఏమీ కాలేదు.

అవినాష్ శరీరంలో వణుకు ప్రారంభమైంది. చుట్టూ అనంతమైన శూన్యం. ఆపై అంతులేని నిశ్శబ్దం. ఆకాశంలో తారలు స్థిరంగా, తెల్లగా వెలుగుతున్నాయి.

తనను రక్షించగలిగే మదర్‌షిప్‌తో సంబంధం తెగిపోయింది. అంటే... ఈ విశాల విశ్వంలో తనకు అస్సలు పరిచయం లేని 4878 కిలోమీటర్ల వృత్తవ్యాసంగల గ్రహంలో తాను ఒంటరి!

ముందు అంతరిక్షంలోకి ఎగిరితే మదర్‌షిప్ దృష్టిని ఆకర్షించవచ్చు అనుకున్నాడు.

కానీ 'ఇంజన్ ఫెయిల్యూర్' అంది కంప్యూటర్.

'ఎమర్జెన్సీ' మీట నొక్కాడు.

నౌక చివర్నించి ఏదో దూసుకుంటూ అంతరిక్షంలోకి వెళ్లింది. నల్లగా చిక్కగా ఉన్న అంతరిక్షంలో మెరుపులు మెరిశాయి.

తాను ప్రమాదంలో ఉన్నానని మదర్‌షిప్‌కు అర్థమవుతుంది.

కానీ వారు తానెక్కడున్నానో గ్రహించి తనని వెతుక్కుని వచ్చేందుకు ఎంత సమయం పడుతుంది?

వారెప్పుడు వస్తారో అవి ఈ శూన్యంలో ఎదురుచూస్తుండడం ఎంత భయంకరం?

వ్యోమ ప్రయాణానికి ముఖ్యంగా గ్రహాల్లో అడుగిడేవారికి ఇచ్చే శిక్షణలో ఇలా ఒంటరిగా అపరిచిత గ్రహాల్లో చిక్కుబడ్డప్పుడు మనస్సులో కలిగే భయాలను అధిగమించడంలో శిక్షణనిస్తారు.

కానీ ఎంతయినా శిక్షణ వేరు, నిజం వేరు. నిజంగా అటువంటి పరిస్థితి ఎదురయినప్పుడు తన భయాలను అదుపులో పెట్టుకోలేకపోతున్నాడు అవినాష్.

తాను బుధగ్రహానికి వచ్చిన ప్రయోగం విఫలమైంది. ఇప్పుడు తాను ప్రాణాలతో బయటపడగలడా, లేదా అన్నది ప్రశ్న అయింది. తనకేదో జరుగుతుందని నిరాశావాదం వైపు మొగ్గడం జంతువుల నుంచి మనిషికి వారసత్వంగా లభించిన లక్షణం. దాన్ని దాటి ఎదగాలి మనిషి.

'నాకేం కాదు, నన్ను సమయానికి రక్షిస్తారు' తన మనసుకి తాను చెప్పుకోసాగాడు అవినాష్. కానీ తన మాటలపై తనకే నమ్మకం లేదు. ఇక మనసునెలా ఒప్పిస్తాడు?

ఎందుకంటే అన్నిటికన్నా పెద్ద ప్రమాదం బుధగ్రహపు అంచులలో పొంచి ఉంది. అది సూర్యుడు.

భూమి కొలత ప్రకారం తన చుట్టూ తాను తిరిగేందుకు బుధగ్రహానికి 59 రోజులు పడుతుంది. అదే సూర్యుడి చుట్టూ తిరిగేందుకు 88 రోజులు పడుతుంది.

అంటే బుధగ్రహంలోని ఏ ప్రాంతంలో అయినా సూర్యోదయానికి, సూర్యాస్తమయానికి నడుమ ఉండే సమయం 88 రోజులన్నమాట. ఉదయం పూట 450 డిగ్రీలున్న ఉష్ణోగ్రత రాత్రిళ్లు మైనస్ 185 డిగ్రీలకు పడిపోతుంది.

ఉదయం పూట వేడికి బుధగ్రహ ఉపరితలం మొత్తం కరిగి, కుతకుత ఉడికే ద్రవమైతే, రాత్రి చలికి గట్టిపడుతుంది. అందుకే తాము రాత్రి సమయంలో నౌకను చీకటి ప్రాంతంలో దింపారు. కానీ గంటలో సూర్యోదయమవుతుంది.

త్వరగా వచ్చేయాలని చెప్పాడు కెప్టెన్. అంటే ఇంకాస్సేపటిలో ఇప్పుడు ఘనంగా ఉన్నదంతా 88 రోజుల పాటు కుతకుత ఉడికే ద్రవంలా మారుతుంది. ఈలోగా తనను రక్షించకపోతే తాను...

అవినాష్ ఒళ్లు జలదరించింది. తన నౌకకు వేడినిరోధక పలకలున్నాయి. కానీ అవి ఈ నిరంతర వేడి తాకిడిని ఎక్కువకాలం తట్టుకునేందుకు సరిపోవు. పైగా తన శరీరంలో వాతావరణం ఉంది. బయట అంతా శూన్యం. తన నౌకకు రంధ్రం పడితే తనలోని వాతావరణం శూన్యంలోకి పరుగెత్తుకుపోతుంది. ఆ పరుగెత్తడంలో తన లోపలి భాగాలన్నిటినీ వెంట తీసుకువెళుతుంది. అయితే వేడికి తాను ముందు ఉడుకుతాడా? ముందు తన శరీరంలోని భాగాలు విశ్వంలో వెదజల్లబడతాయా?

తనకు ఎటువంటి మరణం రాసిపెట్టి ఉంది?

అంతలో అతని దృష్టి ఆకాశంపై పడింది. అతని ఒళ్లు జలదరించింది. నోరు తెరచుకుని ఉండిపోయింది.

అంతవరకూ తెల్లగా ఉన్న ఆకాశతెరపై వెండిమల్లెల్లా మెరుస్తూ కనిపిస్తున్నాయి

నక్షత్రాలు (వాతావరణం లేకపోవడంతో తారలు మిణుకు మిణుకుమనవు. రంగులు మారవు). అంతలో క్షణంలో ఒక వెలుగురేఖ కనిపించింది. ఆపై భళ్లున సూర్యోదయమైంది. ఒక్కక్షణం పాటు సూర్యుడి 'కరోనా' కనిపించింది.

ఇది భూగ్రహంలో కేవలం గ్రహణం సమయంలో కనిపిస్తుంది. ఇక్కడ మాత్రం రోజూ కనిపిస్తుంది. వెంటనే చండప్రచండంగా సూర్యుడు ఆకాశంలోకి వచ్చేశాడు.

తెల్లటి వెలుగులో కళ్లు చెదిరేట్టు మెరుస్తున్న సూర్యుడు తన లక్షల కోట్ల కిరణాల సుత్తులతో బుధగ్రహం ఉపరితలాన్ని మోదసాగాడు, కోపంగా, వేగంగా, ఆవేశంగా!

తొలి సూర్యకిరణంతోనే వేడి తెలిసింది అవినాష్‌కు. నౌక చుట్టూ ఎన్ని ఫిల్టర్లున్నా అది తన మరణాన్ని కొద్దికాలం వెనక్కి నెడుతుంది తప్ప ఆపలేదని అర్థమైంది.

అతని కళ్లముందే అతని చుట్టూ ఉన్న బుధగ్రహం నేల అంతా వెలుగు విస్ఫోటనం చెందినట్టు వెలిగిపోతోంది. కళ్లు మిరుమిట్లు గొలిపే లక్షలాది సూర్యుల మెరుపు అది.

అవినాష్ తల తిరగసాగింది. ఆ వెలుతురు భరించలేని అతని మెదడు భ్రమలోకి వెళ్లిపోయింది.

అతని కళ్లముందు వెన్నెల కనిపిస్తోంది. అనంతమైన సముద్రకెరటాలపై నృత్యం చేస్తున్న వెన్నెల కిరణాల కన్యలు అతడిని చుట్టుముడుతున్నారు.

నౌకలో వేడి అధికమైంది. చుట్టూ అంత వెలుతురులోనూ ఏమీ కనబడడం లేదు. భయంకరమైన వెలుతురులో ఏదో అందం ఉంది. ఇది చూస్తూ మరణించడం ఎంత అద్భుతం.

తన నౌక క్రింద నేల కరిగిపోవడం తెలుస్తోంది. సముద్రం ఒడ్డున, అలల తాకిడికి కాళ్ల క్రింద ఇసుక జారిపోతూంటే కలిగే అనుభూతి గుర్తుకువచ్చింది అవినాష్‌కు. నెమ్మదిగా నౌక ఫిల్టర్లు కరగడం తెలుస్తోంది.

ఇక తనకు విముక్తి లభిస్తోంది. బహుశా భవిష్యత్తులో ఈ ప్రాంతానికి తన పేరు పెడతారేమో!

అతని శరీరం కొలిమిలో పెట్టినట్టు మండసాగింది. స్పృహ తప్పే ముందు సూర్యుడికి అడ్డుగా ఏదో పక్షి వచ్చినట్టనిపించింది. తనపై నీడ పడ్డట్టనిపించింది.

నవ్వుకున్నాడు అవినాష్.

ఎండవేడికి అడ్డులేని చోట నీడను ఊహించడం మనిషి మనస్తత్వం. ఆశాభావానికి నిదర్శనం అనుకున్నాడు.

అవినాష్ శరీరంలోని నీరంతా ఆవిరైపోయింది. అతను గాలిలో తేలసాగాడు. చిత్రం... పైన ఎగుర్తూంటే వేడి ఎక్కువ అయ్యే బదులు శీతలంగా అనిపిస్తోంది. మరణం చల్లగా ఉంటుంది కాబోలు.

❄ ❄ ❄ ❄ ❄

"గుడ్... మన పరిశోధన విజయవంతమైనట్టే. బుధగ్రహంపై నాలుగు గంటలు

ఉండగలగడం సాధ్యమని తేలింది. ఇంకా కొంత ప్రయత్నిస్తే బుధగ్రహంలో మనం నివాసాలు ఏర్పరచుకోవడం సాధ్యమౌతుంది" అన్నాడు శాస్త్రవేత్త విలియం వీరసేన.

"అది సాధ్యమవడానికి ఎంతకాలం పట్టవచ్చు?" అడిగాడు భూగ్రహ అధ్యక్షుడు అరవింద్ అళ్వర్.

"అది చెప్పలేం."

"అదేదో త్వరగా కానీయాలి. ఇప్పటికే ఖండాల్లో మంచు కరిగిపోయింది. వేసవికాలం ఉష్ణోగ్రత వంద డిగ్రీలు దాటుతోంది. ఇక కొన్నాళ్లలో భూగ్రహం నివాసయోగ్యం కాదు. ముఖ్యంగా వాతావరణం పూర్తిగా విషవాయువులమయమై పోయింది. భూమికి ప్రత్యామ్నాయం త్వరలో వెతుక్కోవాలి. అది సాధ్యమేనని మన ప్రయోగం నిరూపిస్తోంది. దీని ఆధారంగా భూమిపై కూడా కొన్ని ప్రయోగాలు చేసి చూస్తాం."

"కానీయండి" అంటూ వెళ్లిపోబోతూ ఆగాడు అధ్యక్షుడు అరవింద్.

"ఇంతకీ అవినాష్‌కి ఎలా ఉంది? ఆ అనుభవం నుంచి తేరుకున్నాడా?"

"అతనికి తన అనుభవం మనం ల్యాబ్‌లో కల్పించిన భ్రమ అని ఇంకా తెలియదు" నవ్వాడు అరవింద్.

"భ్రమలో ఉన్న ఆనందం నిజంలో లేదు" అంటూ వెళ్లిపోయాడు.

❋ ❋ ❋

# టైటన్లతో కరచాలనం

"మిథేన్ వర్షం కురుస్తోంది. వర్షం తగ్గిన తరువాత పంటల పరిస్థితిని పరిశీలించి సమాచారం అందజేస్తాను" మెసేజ్ పంపించాడు మృదుల్.

'టైటన్ కంట్రోల్ సెంటర్'కు సమాచారం పంపించి ఆకాశం నుంచి ధారగా కురుస్తున్న మిథేన్ వర్షంలో మారుతున్న రంగులను చూడసాగాడు మృదుల్.

మిథేన్ చినుకులు నేలను తాకకముందే నేలపై గడ్డ కట్టి పొరలా ఏర్పడిన వాయువులు వివిధ రంగులలో ఆవిరవుతూ మిథేన్‌ను ఆప్యాయంగా తమలో కలుపుకుంటున్నాయి. ఎటు చూసినా రంగురంగుల పొగలు. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల కలయికలతో ఎంతో అందంగా ఉంది టైటన్ దృశ్యం.

కలలో కూడా తాను ఇటువంటి రంగుల విన్యాసాలను చూస్తానని అనుకోలేదు మృదుల్. 'ఇక్కడ కనబడే కొన్ని రంగులకు కొత్తగా పేర్లు పెట్టాలి' అనుకున్నాడు.

అంతరిక్ష వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్ తనను పిలిచినప్పుడు కూడా తనను టైటన్‌కు పంపుతారని అనుకోలేదు మృదుల్.

టైటన్‌లో రకరకాల పరిశోధనలు జరుగుతున్నాయని మృదుల్ విన్నాడు. ముఖ్యంగా భారతదేశ శాస్త్రవేత్తలు 'గ్రహవాయువు'ని కనుక్కోవడంతో అంతరిక్ష పరిశోధనలకు ఊపు వచ్చింది. ఈ వండర్ గ్యాస్‌లోని గొప్ప గుణం ఏమిటంటే ఇది మిథేన్, హైడ్రోజన్ వంటి వాయువులను పీల్చుకుని వాటిని అణువులుగా విడగొట్టి ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది.

మూలకాలన్నీ ఎలక్ట్రాన్, ప్రోటాన్ల సంఖ్య అమరికపై ఆధారపడి ఉంటాయి. ఒకే ఎలక్ట్రాన్ ఉంటే అది హైడ్రోజన్ అవుతుంది. గ్రహ గ్యాస్ అన్ని మూలకాలను ఎలక్ట్రాన్, ప్రోటాన్లుగా విడగొట్టి వివిధ రకాలుగా కలవడం వల్ల ఆక్సిజన్ ఏర్పడుతుంది.

అయితే గ్రహ వాయువువల్ల వాతావరణం వేడెక్కుతుంది. ఆరంభంలో ఇది శాస్త్రవేత్తలను కలవరపరచింది. కానీ ఆక్సిజన్‌తో పాటు అంతవరకూ ఎవరూ కనుగొనని మూలకం 'బుద్ధ' వెలువడుతుందని, దీనివల్ల వాతావరణం వేడెక్కుతుందని తెలిసింది. (బుద్ధ మూలకం కనుగొనడంతో రసాయనశాస్త్రం మొత్తం విప్లవాత్మకమైన మార్పులు చెందింది. రసాయనశాస్త్రానికి మూలం వంటి పీరియాడిక్ టేబుల్ మొత్తం 111వ మూలకంవల్ల అతలాకుతలమైపోయింది.)

దాంతో ఇతర గ్రహాలపై, వాటి ఉపగ్రహాలపై నివాసాలు ఏర్పాటుచేయాలని శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయత్నాలకు ఊపు వచ్చింది. ముఖ్యంగా భూమి జనాభా త్రిగుణీకృతమైపోవడంతో ప్రపంచమంతా పట్టణాలై పల్లెలు అదృశ్యమైపోయాయి.

భూమిమీద పంటలు పండించే స్థలం తగ్గిపోయి అరుదైపోవడంతో ఆహారపు కరువు ప్రపంచాన్ని పట్టి పీడించసాగింది. దాంతో ప్రపంచ ప్రజలంతా ఏకమై ఉన్నదాన్ని సమానంగా పంచుకునే వ్యవస్థను ఏర్పరచుకున్నారు. కానీ ఇది తాత్కాలిక పరిష్కారమే తప్ప శాశ్వతం కాదని అందరికీ తెలుసు. దాంతో వ్యవసాయానికి అనుకూలంగా ఉండే గ్రహాల వేటలో పడ్డారు శాస్త్రవేత్తలు. ఫలితంగా అంతరిక్ష వ్యవసాయ పరిశోధన సంస్థ ఏర్పడింది. ఒకవైపు వ్యవసాయానుకూలమైన గ్రహాల వేట జరుపుతూనే గ్రహాల వాతావరణాన్ని వ్యవసాయానికి అనుకూలంగా మార్పు చేసే ప్రయోగాలు ఆరంభించింది ఈ సంస్థ. శనిగ్రహానికి ఉపగ్రహమైన టైటన్ అన్ని రకాలుగా వ్యవసాయానికి అనుకూలంగా కనిపించింది. కానీ మిథేన్ వాతావరణం, ఉష్ణోగ్రత రెండూ ప్రతిబంధకాలుగా నిలిచాయి.

ఈ సమయంలో గ్రహగ్యాస్‌ను కనుగొనడం జరిగింది. దాంతో టైటన్ మీద వ్యవసాయం సాధ్యమేనన్న ఆశాభావం శాస్త్రవేత్తలలో కలిగింది. ఫలితంగా అంతరిక్ష పరిశోధన సంస్థ టైటన్‌లో ఓ ప్రయోగశాలను ఆరంభించింది. ఇదంతా మృదుల్‌కి తెలుసు. కానీ ఆ ప్రయోగశాలలో పనిచేసే అవకాశం తనకి వస్తుందని కలలో కూడా అతను ఊహించలేదు.

మిథేన్ వర్షం ఆగింది. కానీ గాలులు వేగంగా వీయడం ఆరంభమయింది. గాలిని ఎవరూ చూడలేరంటారు. కానీ ఇక్కడ టైటన్‌లో గాలులు వేగంగా, దట్టంగా వీయడాన్ని స్పష్టంగా చూడవచ్చు. నేలపై నుంచి ఆవిరవుతున్న వాయువులు, వీస్తున్న వాయువులతో కలిసి రంగురంగుల విన్యాసాలు చేస్తుంటాయి. ఎరుపు గాలి, పసుపుగాలి ఢీకొంటాయి. వయలెట్ గోడ ఏర్పడుతుంది. పరుగెత్తుకు వెళ్లి ఆ రంగులతో ఆడుకోవాలని అనిపించింది మృదుల్‌కి. కానీ తాను సురక్షిత స్థలం వదిలి బయటకు వెళ్తే మరణం తప్పదని మృదుల్‌కి తెలుసు. అదీ అతి భయంకరమైన మరణం.

బయట అడుగుపెడుతూనే మిథేన్ తన శరీరంలోకి ప్రవేశిస్తుంది. రక్తం గడ్డ కడుతుంది. చల్లదనానికి తన శరీరంలో కదలికలు ఆగిపోతాయి. ఒకప్పుడు హిమాలయాల్లో పర్వతారోహకులు ఇలాగే మరణించేవారట. కానీ వారు దాన్ని గొప్ప

సాహసంగా భావించేవారు. ఇక్కడ మాత్రం అటువంటి మరణం మూర్ఖత్వంవల్ల సంభవిస్తుంది. 'పంటలను పరిశీలించాలి' ఆలోచనల్లో పడి కర్తవ్యం మరచిన మృదుల్‌ను హెచ్చరించింది షెడ్యూల్ రోబో.

మృదుల్‌కి కదలాలని లేదు. ఎదురుగా కనిపిస్తున్న సుందరదృశ్యాలను చూస్తూ గడిపేయాలని ఉంది. టైటన్ రోబో గాల్లో ప్రయాణం చేస్తుంది. కానీ దట్టమైన వాయువుల గోడ ఉండడంతో ఎదురుగా ఏముందో కనబడదు. కాబట్టి ఎదురుగా ఉన్న వాయువుల గోడను ఛేదించేంత వేగంతో వాయువులను వదుల్తూ వెళ్తోంది రోబో.

వాయువులు పక్కకు తొలగడంతో ఒక్క క్షణంసేపే కనిపించే కొండలు, లోయలు ఊపిరిని స్తంభింపజేస్తుంటాయి. మళ్లీ మళ్లీ ఆ దృశ్యాలను చూడాలనిపిస్తుంది. క్షణంలో రోబో ముందుకు వెళ్లిపోతుంది. వెనక్కు తిరిగి చూసేసరికి మళ్లీ దట్టమైన గాలిగోడలు దృష్టికి అడ్డువస్తాయి.

రోబో గమ్యం చేరింది.

'కామధేను పొలం'లోకి వెళ్లేముందు రోబో, మృదుల్‌లు ఓ పరిశుభ్రమైన గదిలోంచి వెళ్లాల్సి ఉంటుంది. ఆ గదిలో రోబోకు, మృదుల్‌కు ఏమైనా సూక్ష్మక్రిములు ఉంటాయన్న పరిశీలన జరుగుతుంది. వారిని పరిశుభ్ర వాయువులతో స్నానం చేయించడం ద్వారా శుభ్రపరచడం జరుగుతుంది. టైటన్‌లో జీవాలున్న దాఖలాలు లేవుకానీ టైటన్‌లో ఆర్గానిక్ కెమికల్ సరస్సులున్నాయి. గడ్డ కట్టి ఉన్న ఈ సరస్సుల్లో ఉన్న ఆర్గానిక్ రసాయన పదార్థాలు కరిగితే జీవం ఆవిర్భవిస్తుంది. భూమిలో జీవం ఆవిర్భవించే ముందు కూడా ఇలాంటి పరిస్థితి ఉండేది. అయితే ఇక్కడి ఉష్ణోగ్రత మరీ తక్కువ కావడంతో జీవులు ఏర్పడే అవకాశం లేదు. కానీ ముందు జాగ్రత్తగా పొలంలో అడుగుపెట్టేవారిని జీవుల కోసం పరిశీలించడం జరుగుతుంది.

అంగారక, శుక్రగ్రహాలకన్నా పెద్దదయిన ఉపగ్రహం టైటన్. టైటన్‌లో ఓ పెద్ద విశాలమైన మైదానంలో ఎటువంటి వత్తిడినయినా తట్టుకునే గాజుభవనం నిర్మించారు. ఆ భవనానికి అవసరమైన వాయువులు, శక్తి సర్వం లోపలే తయారవుతాయి. అంటే టైటన్‌లో ఓ గాజుభవనంలో భూమిలో లాంటి వాతావరణాన్ని శాస్త్రవేత్తలు సృష్టించారన్న మాట. ఈ సృష్టిలో గ్రహగ్యాస్ ఎంతో ఉపయోగపడింది. వాతావరణంలోని మిథేన్, హైడ్రోజన్‌లను పీల్చుకుని కామధేనులోకి ఆక్సిజన్‌ను విడుదల చేయడమే కాక ఉష్ణోగ్రతను పెంచడం కూడా గ్రహగ్యాస్‌వల్ల సాధ్యమయింది. దాంతో ఆరంభంలో చిన్న చిన్న మొక్కలు వేయడం ఆరంభించారు.

అవి వదిలే కార్బన్ డయాక్సైడ్‌ను వాతావరణంలోకి వదిలేవారు. ఆ వాయువు నల్లరంగుతో ఒక్కసారిగా ఎగిరి శనిగ్రహం చుట్టూ ఉన్న వాయురంగుల్లో కలసిపోవడం చూడడం ఓ మరపురాని అనుభవం. చిన్న చిన్న మొక్కలతో ఆరంభమయిన కామధేనులో ఇప్పుడు ఆహారధాన్యాలను పెద్దఎత్తున పండిస్తున్నారు. మొట్ట

మొదటిసారిగా పెద్ద పంట వేశారు. అప్పుడే భూమికి ఈ సమాచారం అందింది. సరిగ్గా పంట కోతకు వచ్చేసరికి భూమినుండి రవాణా నౌక వచ్చి చేరుతుంది. అది ఇప్పటికే బయలుదేరింది.

ఆ పండిన పంటను చూస్తుంటే మృదుల్ హృదయం గర్వంతో ఉప్పొంగుతుంది. ప్రపంచంలో మరే జీవీ ప్రకృతిని నిర్దేశించలేదు. ఆ శక్తి ఒక్క మనిషికే ఉంది. గ్రహం కాని గ్రహంలో, వాతావరణం కాని వాతావరణంలో, భూమి వాతావరణాన్ని సృష్టించి పంటలు పండించి ఆహారసమస్యను పరిష్కరించాలనుకోవడం సృష్టికి ప్రతి సృష్టి కాకపోతే మరేమిటి? ఆ ప్రతిసృష్టిలో తానూ భాగం పంచుకుంటున్నాడు.

టైటన్‌పై ఉన్నది మృదుల్ ఒక్కడే. మిగతా అన్ని పనులు రోబోలే చేస్తుంటాయి. మదర్‌షిప్ శనిగ్రహం చుట్టూ కక్ష్యలో తిరుగుతుంటుంది. అక్కడనుంచి వాళ్లు మృదుల్‌కు అవసరమైనప్పుడు సలహాలిస్తుంటారు. మరీ అవసరమైతే టైటన్‌పై దిగి అవసరమైన రిపేర్లు చేసిపోతుంటారు.

రోబోల రిపోర్టులను పరిశీలిస్తున్న మృదుల్ కళ్లు చిన్నవయ్యాయి. రోబో 2736 రిపోర్టు విచిత్రంగా ఉంది. రోబోను పిలిచాడు మృదుల్.

"నువ్వు చెప్పిన మొక్కల సంఖ్య నిన్నటి రిపోర్టు కన్నా తక్కువ ఉంది" అడిగాడు.

"అక్కడ అన్నే చెట్లున్నాయి" యాంత్రికంగా సమాధానం ఇచ్చింది రోబో.

"అన్నే ఎలా ఉంటాయి. నీ వంతుకి 1116 చెట్లుండాలి. కానీ నువ్వు ఇచ్చిన రిపోర్టులో 972 మాత్రమే ఉన్నాయి."

"అక్కడ అన్నే ఉన్నాయి" మళ్లీ సమాధానం వచ్చింది.

మృదుల్ వెంటనే ఆ రోబో పనిచేసే ఏరియాను కంప్యూటర్‌లో పరిశీలించాడు. నిజమే. రోబో అబద్ధం చెప్పడం లేదు. చెట్లు తక్కువ ఉన్నాయి. అయినా రోబో అబద్ధం చెప్పడం ఏమిటి?

కానీ చెట్ల సంఖ్య ఎలా తగ్గుతుంది? ఈ మొత్తం గ్రహంపై ఉన్న ఏకైక ప్రాణి తాను. వెంటనే వాహన రోబోలో ఆ ప్రాంతానికి బయలుదేరాడు మృదుల్.

* * * * *

"కెప్టెన్... ఎవరో కామధేనులోకి ప్రవేశించారు" కెప్టెన్‌కి రిపోర్టు ఇచ్చాడు మృదుల్.

"ఇంపాజిబుల్" అరిచాడు కెప్టెన్. "ఎక్కడో ఏదో పొరపాటు జరిగి ఉంటుంది. రోబోలు ఒక మందు బదులు మరో మందు చల్లి ఉంటాయి."

"అది కూడా కారణం కాదు. మీ దగ్గర పదహారు గంటలూ పంటను పరిశీలించిన వీడియో ఫిల్మ్ ఉంటాయి కదా. ఓసారి వాటిని పరిశీలించండి" చెప్పాడు మృదుల్.

శనిగ్రహం చుట్టూ ఓసారి తిరిగేందుకు టైటన్‌కు 15 రోజుల 22 గంటల నలభై ఒకటిన్నర నిముషాలు పడుతుంది.

* * * * *

మదర్‌షిప్ పంపిన వీడియోను పరిశీలిస్తున్న మృదుల్ స్వరం నుండి అప్రయత్నంగా కేక వెలువడింది.

అతని కళ్లముందే ఏదో అదృశ్యజీవి మొక్కలను తినివేస్తోంది. కెప్టెన్‌కు సమాచారం అందజేయాలనుకున్నాడు. అంతలో కెప్టెన్ తెరపై కనిపించాడు.

“మృదుల్! నిజంగా ఇది నమ్మలేని నిజం. ఏదో అదృశ్యజీవి కామధేను పొలంలోకి ప్రవేశించింది. నేను మన శాస్త్రవేత్తల్ని పంపుతున్నాను. జాగ్రత్తగా ఉండు” హెచ్చరించాడు కెప్టెన్.

❄ ❄ ❄ ❄ ❄

లేజర్ ఆయుధం దగ్గర పెట్టుకున్న మృదుల్‌కు నిద్ర పట్టడం లేదు. బయట రోబోలు కాపలా ఉన్నాయి. కానీ ఎందుకో భయంగా ఉంది మృదుల్‌కి. ఇంతలో బయట ఎవరో కరకర నములుతున్న శబ్దం వినిపించింది. రోబోలను అలర్టు చేశాడు మృదుల్. లేజర్ గన్ తీసుకుని నెమ్మదిగా బయటకు నడిచాడు. ఎదురుగా కనిపిస్తున్న దృశ్యం చూసి ఆగిపోయాడు. ఒక్కక్షణం జరుగుతున్నది ఏమిటో అతనికి అర్థం కాలేదు. అర్థం అయినదాన్ని ఒప్పుకునేందుకు అతని మెదడు ఇష్టపడడం లేదు.

అంతవరకూ అంటెన్నాలతో మొక్కలను వొంచి వొలుచుకుని కరకర తింటున్న చిన్న బొద్దింకలాంటి జీవి అలికిడి అవడంతో మృదుల్‌వైపు చూసి జరజర నడుస్తూ వెళ్లిపోయింది. చేష్టలుడిగి నిలుచుండిపోయాడు మృదుల్. జరిగింది అర్థమయ్యేసరికి అతని శరీరం మొత్తం వణకసాగింది. కాళ్లపై నిలబడలేకపోయాడు. అతికష్టంమీద ఇన్‌ఫర్మేషన్ పంపించే గదిని చేరాడు. వెంటనే తెరపై కెప్టెన్ ప్రత్యక్షమయ్యాడు.

“జరిగింది చూశాను. ఆ జీవి ఎక్కడనుంచి వచ్చిందో, ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు. అది బొద్దింకే అయితే మనం చచ్చినట్లే. ఎందుకంటే చావులేని జీవి బొద్దింక. ప్రపంచంలో న్యూక్లియర్ యుద్ధం వచ్చి అన్ని జీవాలు మరణించినా బొద్దింక చావదు. అది కాసేపు ముడుచుకుని యోగనిద్రలోకి పోతుంది. లేచిన తరువాత తిరిగి బతుకుతుంది. డైనోసర్ల కన్నా ముందు పుట్టి ఇంకా బతుకుతున్న జీవి అది” చెప్పాడు కెప్టెన్.

“కానీ నిన్న అదృశ్యంగా ఉన్న జీవి ఇవాల్టికల్లా బొద్దింకలా ఎలా అయింది?”

“వొస్తున్నారుగా మన అపరాధ పరిశోధకులు. తొందరపడకు, కంగారుపడకు” ధైర్యం చెప్పాడు కెప్టెన్.

కానీ మృదుల్‌కి భయం తగ్గలేదు.

సాయంత్రం కనబడని జీవి రాత్రికల్లా బొద్దింకలా ఎదిగింది. తెల్లారేసరికి ఏమౌతుందో? ఆ ప్రశ్నకు సమాధానం అరగంటలో వచ్చింది.

మళ్ళీ కటకట శబ్దాలు వినిపించడంతో బయటకు వచ్చిన మృదుల్‌ని చూసి గబగబా చెట్లలోకి పారిపోయాయి రెండు ఎలకలు. మరో గంటలో ఉడతలు కనిపించాయి. ఇంకో అరగంటలో కుందేళ్ళు పరుగెత్తాయి. మరో గంటలో

కామధేనుపొలం ఒకవేపు పక్షుల కలకలతో కళకళలాడితే మరో వైపు పులులు, సింహాల గర్జనలతో గజగజలాడసాగింది. మృదుల్‌కి పిచ్చెక్కేట్టుంది. జీవుల ఉనికిని తెలిపే యంత్రం పాడైపోయింది. ఎందుకంటే హఠాత్తుగా ఒకేసారి ఇన్ని రకాల జీవులు ఉద్భవిస్తుండడంతో ఆ యంత్రం ఏ జీవిని పరిశీలించాలో తెలియక ఆగిపోయింది. మృదుల్ తన గది వదిలి బయటకు రావాలంటే భయపడసాగాడు. ఇంతలో మదర్‌షిప్ పంపిన నలుగురు శాస్త్రవేత్తలు వచ్చి చేరారు. వారిని చూస్తూనే మృదుల్‌కి ప్రాణం లేచి వచ్చింది.

"ఇదెలా జరిగిందో అర్థం కావడంలేదు" అయోమయంగా అన్నాడు మృదుల్.

వారిలో జీవ శాస్త్రవేత్త జగన్ నవ్వాడు. "నా అనుమానం..... మనం ఇక్కడ టైటన్‌లో ఓ జీవ విప్లవాన్ని ఆరంభించామనిపిస్తోంది."

"కానీ అదెలా సాధ్యం?"

"అదే ఆలోచిస్తున్నాను. నేను మన రోబోతో వెళ్ళి ఓసారి బయట రాళ్ళను పరిశీలించి వస్తాను" లేచాడు రాళ్ళ శాస్త్రవేత్త రజాక్.

"నేను రసాయనాలను పరిశీలిస్తాను" లేచాడు స్పేన్ బయోకెమిస్ట్ సూరజ్.

వాళ్ళు ముగ్గురూ పరిశోధనలమీద వెళ్ళారు. నాలుగో శాస్త్రవేత్త కంట్రోల్ సెంటర్‌లో కూర్చొని వారి కదలికలను గమనించసాగాడు.

అక్కడ తాను చేసేదేంలేదని గ్రహించిన మృదుల్ బయటకు వచ్చాడు. ఒక వేపు తోట ఏపుగా ఎదుగుతోంది. మరోవైపు రకరకాల జీవులు ఎదుగుతున్నాయి. కొన్నివేల ఎకరాల ఆ పొలం జీవులతో నిండిన మరోభూమిలా ఉంది. ఇంతలో మృదుల్ దృష్టి ఓ మొక్క మీంచి మరో మొక్క మీదకు దూకుతున్న కోతిపై పడింది. ఎందుకో మృదుల్ శరీరం వణకసాగింది. అతను నిలువలేక లోపలికెళ్ళాడు. అప్పటికే నలుగురు శాస్త్రవేత్తలు సమావేశమై తమ పరిశోధన ఫలితాలను చర్చిస్తున్నారు.

"నేను ఇక్కడి రాళ్ళను గమనించాను. ఆశ్చర్యకరమైన విషయాలు తెలిసాయి. మన భూమి మీద భౌగోళిక కాలాన్ని ఇయాన్లు, ఎరాలుగా విభజిస్తాం. అంటే పరిణామక్రమంలో ఒక ప్రముఖ సంఘటన నుండి మరో ప్రధాన సంఘటన జరిగే కాలాన్ని విభజిస్తామన్నమాట. ఈ సంఘటనలు జరిగేందుకు కొన్ని మిలియన్ సంవత్సరాలు పడుతుంది. దీన్ని జియాలజికల్ టైమ్‌లైన్ అంటారు. కేవలం కణాల ఆధారంగా జీవం వున్న కాలాన్ని ప్రికాంబ్రియన్ అంటాము. 570 మిలియన్ సంవత్సరాల తరువాత సముద్రాల్లో మొలస్కాల లాంటి జీవులు ఉద్భవించిన కాలాన్ని కాంబ్రియన్ ఎరా అంటారు. ఇలా జీవులు సముద్రాన్ని వదిలి భూమిపైకి రావడం మరో ఎరా. చేపలు ఉద్భవించడం ఓ ఎరా. ఇలాగన్నమాట. ఇక్కడ మనం గమనించవలసిందేమంటే టైటన్‌లో రాళ్ళ రకాల మార్పిడి మిలియన్ సంవత్సరాలు... వంద సంవత్సరాలలోకాదు గంటల్లో జరుగుతుంది."

శాస్త్రవేత్తలు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"కానీ గ్రహంలో బయో రసాయనాలను పరిశీలించాను. గతంలో జీవం లేక గడ్డ కట్టి ఉన్న రసాయనాలు ఇప్పుడు జీవంతో తొణికిసలాడుతున్నాయి. నా అనుమానం ఇక్కడ ఆవిర్భవించిన జీవం మిథేన్ నదుల్లో ఈదుతూ మిథేన్ గాలిలో ఎగురుతూ మన పొలంలోకి చేరుతుంది. ఇక్కడ అనుకూల వాతావరణం లభించడంతో రకరకాల జీవులుగా ఎదుగుతోంది."

చాలాసేపు గదిలో నిశ్శబ్దం తాండవించింది. అందరూ జీవశాస్త్రవేత్త వైపు తిరిగారు.

"ఇక్కడ జీవ ఆవిర్భావికి రెండు కారణాలు ఊపునిచ్చాయి. ఒకటి మనం పంటలు పండించడం. ఇందువల్ల గాలిలోవున్న సూక్ష్మక్రిములకు ఆహారం లభించింది. రెండు మన గ్రహగ్యాస్. అది వాతావరణాన్ని వేడెక్కిస్తుండడంతో బయట గడ్డకట్టి వున్న జీవ రసాయన సముద్రాలు కరగడం ఆరంభమయింది. ఫలితంగా సూరజ్ చెప్పినట్టు జీవం ఆవిర్భవించింది" చెప్పాడు జగన్.

కాస్సేపు గదిలో నిశ్శబ్దం తాండవించింది.

"కానీ ఇక్కడ గాలిలో సూక్ష్మక్రిములు లేవుగా? పంటలవల్ల అవి ఎలా ఎదగగలవు?" అడిగాడు మృదుల్ అనుమానంగా.

నవ్వాడు జగన్."ఇక్కడికి సూక్ష్మక్రిములను మనమే తెచ్చాం."

"మనమా? ఎలా?" ముగ్గురూ అడిగారు.

"మనం శరీరాన్ని ఎంతగా సూక్ష్మక్రిముల రహితంగా చేసుకున్నా మన శరీరాన్ని అంటిపెట్టుకుని కొన్ని వేల క్రిములు బతుకుతుంటాయి. అవి లేకపోతే మనం బతకలేం. మన శరీరంలో కడుపులో, ప్రేగుల్లో, మీసాల్లో, కనురెప్పల్లో ఇలా మనం ఓ కదిలే జీవ వలయం లాంటి వాళ్ళం. అటువంటి సూక్ష్మజీవి ఏదైనా వాతావరణంలోకి ప్రవేశించి వుంటుంది. ఫలితం మనం చూస్తున్నాం."

"అంటే ఈ జీవులు మార్పు చెందుతూ త్వరలో మనిషి ఆవిర్భవిస్తాడు టైటన్‌లో" అనుమానంగా అడిగాడు సూరజ్.

"చెప్పలేం. జీవపరిణామం ఏ రూపంలో ఎలా జరుగుతుందో చెప్పడం కష్టం" అన్నాడు జగన్.

"అంటే త్వరలో మనం టైటన్ మనిషితో చేతులు కలుపుతామన్నమాట" అని పెద్దగా నవ్వసాగాడు రజాక్. సూరజ్, జగన్‌లు అతనికి వంత పాడారు.

ఇంతలో బయట ఏవో విచిత్రమైన శబ్దాలు వినిపించసాగాయి. జీవులు ఏదో తమలో తాము కలహించుకుంటున్న కేకల్లాంటివి అవి. నలుగురు శాస్త్రవేత్తలు ఆయుధాలు పుచ్చుకుని బయటకు పరుగెత్తి శిలా విగ్రహాల్లా అయిపోయారు. అక్కడ నాలుగు జీవులు తిండి ధాన్యాల కోసం కొట్టుకుంటున్నాయి. వీళ్ళ అలికిడి వింటూనే వృక్షాల చాటున దాక్కున్నాయి.

మృదుల్ గుప్పెట్లు చాచి నెమ్మదిగా ముందుకు నడిచాడు. అతని రెండు గుప్పెట్ల

నిండుగా తిండి ధాన్యాలున్నాయి. మృదుల్ మృదువుగా వాటిని పిలిచాడు.

నెమ్మదిగా, భయం భయంగా చెట్టు చాటునుంచి ఒక జీవి తొంగి చూసింది. మరో జీవి భయంగా చెట్టు చాటునుంచి బయటకు వచ్చి నెమ్మదిగా అడుగులేస్తూ మృదుల్ వైపు రాసాగింది. శరీరం మొత్తం కంపిస్తున్నా ధైర్యంగా నిలబడ్డాడు మృదుల్ తన భయాన్ని కనబడనీయకుండా.

ఆ జీవి మృదుల్ గుప్పెట్లోని తిండిగింజలను తీసుకుని గబగబా చెట్టుచాటుకు పరుగెత్తింది. కాస్సేపటికి నాలుగు జీవులు ధైర్యంగా చెట్టు చాటునుంచి బయటకు వచ్చాయి. వాటిని చూసి మృదుల్ భయంలేదన్నట్లు నవ్వాడు.

ప్రతిగా ఆ నాలుగు జీవులూ నవ్వాయి. నగ్నంగా ఉన్నందుకు సిగ్గుపడుతూ ముందుకు వచ్చాయి.

మృదుల్ చేయి సాచాడు.

మానవ చరిత్రలో ప్రథమంగా గ్రహాంతర వాసులు టైటన్ మానవులతో కరచాలనం చేసిన వ్యక్తిగా మృదుల్ పేరు చరిత్రలో సుస్థిరంగా నిలిచింది. పైగా అతను కరచాలనం చేసింది ఒకరితో మాత్రమేకాదు, నలుగురు టైటన్ మానవులతో!

❋ ❋ ❋

# నేనెవరిని?

'**సూ**ర్యుడు పశ్చిమాన ఉదయిస్తున్నాడు' అద్భుతమైన, అసంభవమైన ఆ దృశ్యం చూస్తుంటే అనిర్వచనీయమైన ఆనందం కలుగుతోంది. అసలు ఆ చూస్తున్నది 'నేనేనా' అన్న భావన మనస్సులో కలుగుతుంటే ఇంత అద్భుతాన్ని చూసిన తరువాత మళ్ళీ మామూలు దృశ్యాలను చూడాల్సి వస్తుందన్న ఆలోచన దీన్ని మరింత అపురూపం చేస్తోంది. మరపురానంతగా కళ్ళనిండా, మెదడు నిండా నింపుకోవాలని అనిపిస్తోంది.

పశ్చిమం నుండి ఉదయిస్తున్న సూర్యుడు కాస్త పైకి వచ్చి ఏదో ఆలోచిస్తున్నట్లు ఆగి మళ్ళీ నెమ్మదిగా క్రిందకి దిగిపోసాగాడు. క్షణాల్లో ఆకాశం చీకటిగా అయిపోయింది.

జీవితంలో ఆనందాలన్నీ క్షణికమే. కానీ ఆ క్షణికమైన ఆనందానుభూతి కోసం జీవితాంతం కష్టాలుపడేందుకు సిద్ధం అవుతాము. ఆనందంలో అంత ఆనందం వుంది మరి!

"ఇదెలా సాధ్యం?"

కన్నార్పకుండా ఆవైపే చూస్తూ అడిగాడు వికృత్. అతడు బుధగ్రహం నుంచి వచ్చాడు. అతడికి భూలోకంలోని వింతలు చూపడం నా బాధ్యత.

"భూమి పడమటి నుంచి తూర్పువైపు తన చుట్టూ తాను తిరుగుతుంది. కాబట్టి సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు. పశ్చిమాన అస్తమిస్తాడు. ఇందుకు వ్యతిరేకంగా సూర్యుడు పశ్చిమాన ఉదయించాలంటే భూమి తూర్పు నుంచి పశ్చిమంవైపు తిరగాలి" డైరీలో చూస్తూ అడిగాడు.

నవ్వాను.

"నీకు ఎస్కలేటర్ చూపించాను కదా. అది పైకి వెళ్తుంటే మనం క్రిందకు

వెళ్ళాలనుకో.... ఎస్కలేటర్ పైకి వెళ్ళే వేగం కన్నా వేగంగా క్రిందకు దిగాలి. లేకపోతే ఎస్కలేటర్‌తోపాటు మనమూ పైకి వెళ్తాం"

"అవును"

"ఇప్పుడు మనం భూమి పశ్చిమం నుంచి తూర్పువైపు తిరిగే వేగంకన్నా ఎక్కువ వేగంతో తూర్పునుంచి పశ్చిమానికి ప్రయాణించామనుకో మనం పశ్చిమాన ఉదయించే సూర్యుడిని చూడవచ్చు. ఇలా వేగంగా ప్రయాణించగలగడం భూమధ్యరేఖ దగ్గర కన్నా ధృవ ప్రాంతాలలో వీలుగా వుంటుంది"

"నాకు అర్థమయింది. భూమధ్యరేఖ దగ్గర చుట్టు కొలత దాదాపుగా 40,000 కి.మీ వుంటుంది. అంటే భూమధ్యరేఖ మీద వున్న ఒక చుక్క 24 గంటలకు 40,000 కి.మీ ప్రయాణిస్తుందన్నమాట. అదే ధృవప్రాంతాలలో భూమి చుట్టుకొలత తక్కువగా ఉంటుంది కాబట్టి, 24 గంటలలో అక్కడి చుక్క ప్రయాణించే దూరం తక్కువే ఉంటుంది. అంటే వేగం తగ్గినట్టే కదా. ఈ వేగాన్ని అధిగమించడం సులువు" గొప్ప సమస్య చిక్కుముడి విప్పినట్లు గర్వంగా నవ్వాడు వికృత్.

"ఇప్పుడు నీకు మరో వింత చూపిస్తాను. అర్ధరాత్రి మధ్యాహ్నపు సూర్యుడిని చూపిస్తాను" అంటూ మా జెట్ నడిపే రోబోకి ఆదేశాలివ్వబోయాను. ఇంతలో ప్లాస్మా ఫోన్ మోగింది. తెరపై చీఫ్ కనిపించాడు.

"చంద్రకాలనీలో ఏదో సమస్య వచ్చింది. నువ్వు వెంటనే బయలుదేరు. వికృత్ బాధ్యత నేను వేరే వారికి అప్పగిస్తాను" ప్రక్కన వున్న వికృత్‌కి అర్థం కాకూడదని కోడ్ భాషలో చెప్పాడు చీఫ్.

'అంటే నిజంగా ఏదో తీవ్ర ప్రమాదమే అన్నమాట' అనుకున్నాను.వెంటనే జెట్‌ను క్రిందకు దిగమని ఆదేశాలిచ్చాను. వికృత్ ప్రశ్నార్థకంగా నావైపు చూసాడు.

"నాకు వేరే పని వచ్చింది"

అర్థమైనట్లు తల ఊపాడు వికృత్. కానీ అప్పటికే నా మనసు చంద్రమండలం వైపు వెళ్ళిపోయింది.

ఇరవై రెండవ శతాబ్ది ఆరంభానికల్లా శాస్త్రవేత్తలు చంద్రమండలంలో కాలనీలు నిర్మించడం ఆరంభించారు. భూగ్రహ పరిస్థితులలో ఇమడని వారిని ఈ కాలనీలకు పంపేవారు. సరదాకని వెళ్ళినట్లు వెళ్ళిన వారు అక్కడి పరిస్థితులకు తట్టుకోలేక వారాల్లో తిరిగి రావడం జరిగింది.

మళ్ళీ వాళ్ళు చెప్పినట్లు వినకపోతే చంద్రమండలం పంపుతామని బెదిరించేవారు. ఇలా చంద్రమండలం వెళ్ళినవారు కొందరు అక్కడే స్థిరపడి భూమితో విడిపోవాలని అప్పుడప్పుడు ప్రయత్నించడం, నేను వెళ్ళి వాళ్ళని సముదాయించడం, ఆపై నెమ్మదిగా, వ్యతిరేకంగా మాట్లాడినవాళ్ళ మెదడుని ట్యూన్ చేసుకుని వచ్చిన నేను వాళ్ళని ఆలోచనలేని వాళ్ళని చేయడం జరుగుతూ వస్తోంది. అందుకే నాకు 'చంద్రమండలం స్పెషలిస్టు'గా ముద్ర వేశారు. అక్కడ ఏ సమస్య వచ్చినా నన్నే పిలుస్తారు.

జెట్ భూమిని తాకగానే బయటపడ్డాను. ఎదురువచ్చిన అసిస్టెంట్ చేతిలో వికృత్ మెదడులోని ఆలోచనల విశ్లేషణకు సంబంధించిన చిప్ ఉంచాను. ఒకప్పుడు మానసికవైద్యులుండేవారు. కానీ నేను కొత్త పద్ధతి కనుక్కున్నప్పటి నుంచీ ఆ అవసరం లేకుండా పోయింది. నానో, ('నానో' అన్న పదం అతి 'చిన్న'ను సూచిస్తుంది. ఒక నానోమీటర్ అంటే మీటర్‌లో బిలియన్ వంతు. అంటే ఒకటిలో 1000000000వ వంతు. దీన్ని 10–9గా సూచిస్తారు) నానో ఎలక్ట్రాడ్లను ఎదుటివారి మెదడుకు అతికిస్తారు. వారి మెదళ్ళలో జరిగే ప్రతి స్పందన నాకు తెలుస్తుంది. దాంతో వారి ఆలోచనలు చేసే కన్నా ముందుగానే పసిగడతాను.

నేను ఎలక్ట్రాడ్లను ఎదుటివాడి మెదడులో వారికి తెలియకుండా ఎలా ప్రవేశపెడతానో ఎవరికి అర్థం కాదు. అదే నా గొప్పతనం. నేను నా గదిలోకి వెళ్ళి చంద్రమండలానికి తగ్గ దుస్తులు వేసుకుని నా కిట్‌బ్యాగ్ తీసుకుని బయటకు వచ్చేసరికి రాకెట్ సిద్ధంగా ఉంది. దారిలో వికృత్ మెదడును ట్యూన్ చేసుకుంటున్నవాళ్ళు కనిపించారు. 'గుడ్ ఇక వికృత్ మెదడు తమకు తెరిచిన కిటికీ వంటిది' అనుకుంటూ రాకెట్ చేరుకున్నాను. క్షణాల్లో భూమి వదిలి అంతరిక్షంలోకి ఎగిరింది రాకెట్.

❄ ❄ ❄ ❄ ❄

ఎన్నిసార్లు చంద్రమండలంలోకి అడుగుపెట్టినా కొత్తగానే వుంటుంది. నీలి ఆకాశానికి అలవాటుపడినవాళ్ళు నల్లటి ఆకాశానికి అలవాటు పడడానికి మానసికంగా సమయం పడుతుంది. ఆపై ఆకర్షణశక్తి, భూఆకర్షణ శక్తిలో మూడవవంతు ఉండడంతో బరువు తక్కువ ఉండే స్థితికి అలవాటు పడాల్సి వస్తుంది. భూమిలోలాగా చేతులు కాళ్ళు, వేగంగా కదిల్చే వీలుండదు.

అలవాటు ప్రకారం వేగంగా కాళ్ళెత్తి అడుగులు వేస్తే ఇక్కడ క్రింద పడే ప్రమాదం లేదు. కానీ అందరి హేళనకు గురి కావాల్సి వస్తుంది. జాగ్రత్తగా అడుగులు వేస్తున్న నా దగ్గరకు చంద్రమండల వ్యవహారాల ఇన్‌ఛార్జ్ వినోద్ గెంతుకుంటూ వచ్చాడు. నిజానికి చంద్రమండలంలో మామూలుగా నడవడంకన్నా అలా గెంతుకుంటూ వెళ్ళడమే హాయి. వినోద్ ముఖం చూడగానే సమస్య గంభీరమైనదని అర్థమయింది.

"కొన్ని వింత అనారోగ్య సమస్యలు వస్తున్నాయి" ఉపోద్ఘాతం లాంటివేవీ లేకుండా సూటిగా ఆరంభించాడు వినోద్.

" ఏమిటీ సమస్య?" అడిగాను.

"అదే అర్థం కావడంలేదు. వ్యక్తులు విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. హఠాత్తుగా స్పృహ కోల్పోతారు. కానీ వారిలో ఎటువంటి లోపం కనబడదు. మనతోటే ఉంటారు. కానీ మన లోకంలో ఉన్నట్లు కనబడరు"

"అంటే మానసిక..."

నా మాటలకు మధ్యలోనే అడ్డువచ్చాడు వినోద్.

"శరీరం కూడా విచిత్రంగా ఎదుగుతోంది"

"అంటే?"

"ఎదుగుదలలో ఓ పద్ధతి లేదు. నిజానికి ఆకర్షణ శక్తి తక్కువ వున్నచోట ఎదుగుదల ఎక్కువే వుంటుందన్నది నిజమే అయినా (అంతరిక్షంలో ఎక్కువ కాలం భారరహిత స్థితిలో ఉన్న వ్యోమగాములు పొడవు పెరుగుతారు) ఈ ఎదుగుదల మాత్రం విచిత్రంగా ఉంది" తాను చూసినదాన్ని వివరించలేకపోతున్నాడు వినోద్ అని అర్థం అయింది నాకు.

"ఇలా ఎంతమంది ఉన్నారు?" ప్రశ్నించాను.

"ప్రస్తుతానికి ఐదుగురు"

"వాళ్ళకు సంబంధించిన వివరాలన్నీ ఇవ్వండి. ముందు ఆ ఐదుగురిని చూపించండి" విచిత్రమైన ఎదుగుదల ఏమిటో తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది నాకు. చంద్రమండలం వంటి కొత్తగా కాలనీలు ఏర్పరస్తున్న ప్రాంతంలో ఏదైనా లక్షణం ఇద్దరు ముగ్గురిలో కనబడినా దాన్ని తీవ్ర ప్రమాదంగా పరిగణిస్తారు. ఎందుకంటే ఇంకా పూర్తిగా పరిచయం కాని వాతావరణంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా తక్కువే. ఏ వ్యాధి ప్రమాదకరంగా పరిణమిస్తుందో ఊహించలేం. 'చిన్న పామునైనా పెద్దకర్రతో కొట్టాలి' అన్న సామెతను అనుసరించడం క్షేమకరం. అప్పుడప్పుడు ఇటువంటి పాతసామెతలు చెప్తూ అందరినీ భయపెడుతూంటాను నేను.

నన్ను ఆ ఐదుగురిని ప్రత్యేకంగా ఉంచిన గదిలోకి తీసుకెళ్ళాడు వినోద్. గాజు అద్దాలలోంచి వాళ్ళని జాగ్రత్తగా పరిశీలించాను. మామూలుగానే ఉన్నారు. వింత ఎదుగుదల ఏమీ లేదు. వినోద్‌వైపు తిరిగి అదే అడగబోయాను.

అంతలో ఆగిపోయాను. టీవీలో భూమి నుంచి ప్రసారమవుతున్న కార్యక్రమాన్ని చూస్తున్న ఆ వ్యక్తి, తనవైపు పాకుతూ వస్తున్న ఆ జీవిని తెరమీద నుంచి దృష్టి మరల్చకుండా చేతిని వెనక్కు తిప్పి దూరంగా తోసేశాడు. అతని దృష్టి టీవీ మీదనుంచి కదలలేదు. మరి వెనుకనుంచి వస్తున్న ఆ జీవిని ఎలా చూశాడు? నేను వినోద్ వైపు చూశాను. వినోద్ తల ఊపాడు.

"నిద్రలో ఉన్న వ్యక్తి గాఢనిద్రపోతూనే, గదిలోకి ప్రమాదం ప్రవేశించగానే పసికట్టగలుగుతున్నాడు. ఇంద్రియాల శక్తిలో మార్పులేదు. అటుచూడు."

వినోద్ చూపకపోయి ఉంటే నేను గమనించవాడినే కాను. కంప్యూటర్ మీద సీరియస్‌గా పనిచేస్తున్నాయి అతని రెండుచేతులు. కానీ ప్రక్కనున్న ప్లేట్‌లోంచి అతను తీసుకుని తింటున్నాడు. మూడో చెయ్యి ఉన్న దాఖలాలు లేవు. నేను ఆలోచిస్తూ గదిలోకి వచ్చాను.

"ఐదుగురి రికార్డులు రెడీ" నేను గదిలోకి అడుగుపెడుతూంటేనే చెప్పింది రోబో. వారందరి పేర్లు, పుట్టినతేదీలు వంటి మామూలు వివరాలు దాటేశాను. ఐదుగురి మధ్య కామన్ పాయింట్స్ ఏమైనా ఉన్నాయా అని వెతకసాగాను.

ఏమీ కనబడలేదు. వాళ్ళ మెడికల్ రికార్డులు వెతికాను. అన్నీ మామూలుగానే ఉన్నాయి. కుర్చీలో వెనక్కి వాలాను ఆలోచిస్తూ. నేను చంద్రమండలంలో ఉన్నానని మరచిపోయాను. స్లోమోషన్‌లో నా వీపు కుర్చీని తాకేసరికి కాస్త సమయం పట్టింది. చంద్రమండలంలోని ఏదైనా అదృశ్యశక్తి ఇందుకు కారణమా? మనిషి తన అజ్ఞానాన్ని దాచుకునేందుకు అదృశ్యశక్తిని సృష్టిస్తాడు. కారణం తెలిసేంతవరకూ ఆ అదృశ్యశక్తి మనిషిని ఆడిస్తుంది.

ఇప్పుడు వీళ్ళ విచిత్ర ప్రవర్తనకి కారణం ఏమిటి?

"నేను వాళ్ళని వ్యక్తిగతంగా ఓసారి పరిశీలించాలి" చెప్పాను వినోద్‌తో. చంద్రమండలానికి నా రాక రహస్యంగా ఉంచాల్సి వస్తుంది. లేకపోతే ఇక్కడ ఏదో జరుగుతోందని పుకార్లతో విశ్వం దద్దరిల్లుతుంది. అందుకనే వినోద్ ఒక్కడే నా అవసరాలు చూస్తున్నాడు. నన్ను ఓ ప్రత్యేక గదిలోకి తీసుకువెళ్ళాడు వినోద్. వినోద్ ఓ రోగిని పట్టుకువచ్చేలోగా నేను నాకు అవసరమైన పరికరాలు గదిలో అమర్చుకున్నాను. అతడిని తీసుకువచ్చి నా ఎదురుగా కూర్చోబెట్టాడు వినోద్.

" నీ పేరు?" అడిగాను.

"యశ్పాల్" గంభీరంగా ఉంది అతని స్వరం.

అతడి తలకు ఎలక్ట్రోడ్లు అమర్చాను. వాటిని కంప్యూటర్‌తో కలిపాను. అవి అమరుస్తున్నప్పుడే నెమ్మదిగా నానో ఎలక్ట్రోడ్లను అతడి మెదడులోకి దూర్చాను. అతను మామూలుగా మాట్లాడుతున్నాడు. నేను పంపిన కాట్‌సెల్స్ అతని నరనరాల ప్రవేశించి రక్తంలో ప్రవహించసాగాయి.

అతనితో మాట్లాడుతూ మీట నొక్కాను. కాట్‌సెల్స్ కదలికను గమనిస్తున్న నాకు ఒక్క నిముషం ఏం జరుగుతుందో అర్థంకాలేదు. జరుగుతున్నది అర్థమయ్యేసరికి నా రక్తం గడ్డకట్టినట్టయింది.

సాధారణంగా ప్రతి మనిషి శరీరంలో తెల్లరక్తకణాలు, ఎర్రరక్తకణాలు ఉంటాయి. ఎర్రరక్తకణాలు శక్తినిస్తాయి. తెల్లరక్తకణాలు రక్షణనిస్తాయి. శరీరంలో సైనికులవంటివి ఇవి. శరీరంలోకి ప్రమాదకరమైనదేది ప్రవేశించినా ఇవి వెంటనే యుద్ధానికి బయలుదేరతాయి.

ఇవి గెలిస్తే రోగం రాదు. తెల్లరక్తకణాలు ఓడిపోతే వ్యాధులు, రోగాలు వస్తాయి. కానీ ఈ వ్యక్తి శరీరంలో తెల్లరక్తకణాలతో పాటూ ఇంకేవో ఉన్నాయి. అవి తెల్లరక్తకణాలకన్నా వెయ్యివ వంతు వేగంతో పనిచేస్తున్నాయి. క్షణంలో కాట్‌సెల్స్ అదృశ్యమైపోయాయి. ఎలక్ట్రోడ్లు తుత్తునియలయ్యాయి. నానో ఎలక్ట్రోడ్లును సైతం పసికట్టేశాయవి!

❄ ❄ ❄ ❄ ❄

మిగతా ఐదుగురిలోనూ ఆ విపరీతకణాలేవో ఉన్నాయి. నేను కనుగొన్న విషయం వినోద్‌కి చెప్పాను.

“చంద్రమండలం వాతావరణం వల్ల వచ్చిన మార్పులా ఇవి?” భయంగా అడిగాడు.

తల అడ్డంగా ఊపాను. “మరి?” అడిగాడు వినోద్.

“ఇంకొన్ని పరిశోధనలు చేయాలి!” ముక్తసరిగా అన్నాను. నన్ను ఒంటరిగా వదిలి వెళ్ళిపోయాడు వినోద్.

నేను వాళ్ళ ఐదుగురినీ గమనిస్తూ కూర్చున్నాను. ప్రతివ్యక్తిలో రోగనిరోధక శక్తి ఉంటుంది. ఈ రోగనిరోధక వ్యవస్థను ఇమ్యూన్ సిస్టం అంటారు. ఈ ఐదుగురిలో ఈ ఇమ్యూన్ సిస్టం వెయ్యిరెట్లు అధికంగా అభివృద్ధి చెందింది. శరీరంలోకి మత్తుపదార్థాన్ని పంపితే క్షణాల్లో విరుగుడు తయారుచేస్తోంది వీళ్ళ ఇమ్యూన్‌సిస్టం. ఇది వీళ్ళ శరీరం ప్రాకృతికంగా అభివృద్ధి చేసిందా? లేక కృత్రిమంగా ఎవరైనా... నాకో అనుమానం వచ్చింది. వెంటనే కంప్యూటర్‌ని ‘ఇమ్యూన్‌సిస్టం’పై పరిశోధనల గురించి అడిగాను. సమాధానాలు సంతృప్తికరంగా లేవు.

“ఇమ్యూన్ సిస్టంపై నిషేధిత పరిశోధనలు” గురించి అడిగాను.

సమాధానాలు చూస్తున్న నా కళ్ళు ‘ష్వార్జ్ చైల్డ్’ అన్న పేరు వద్ద ఆగిపోయాయి. ఎలా మర్చిపోయాను ఇతనిని. డాక్టర్ ష్వార్జ్ చైల్డ్‌ను జీనియస్ అనవచ్చు. వైద్యం విషయంలో ఆయన ఎవరి ఊహకూ అందనిరీతిలో పరిశోధనలు చేసేవాడు. ఒకరకంగా చెప్పాలంటే ఆయన వల్లే నేను వంద ఏళ్లకు పైగా బ్రతకగలుగుతున్నాను. నాకు నలభై ఏళ్ల వయసులో క్యాన్సర్ వస్తే ష్వార్జ్ చైల్డ్ చికిత్స చేశాడు. ‘ఇంతవరకూ ఎవ్వరికీ ఇవ్వని మందు ఇచ్చాను. నీకు చావు లేదు ఫో’ అన్నాడు.

ఆ తరువాత కొన్నాళ్లకి అతను ప్రభుత్వ వ్యతిరేక పరిశోధనలు చేస్తున్నాడని, భూమినుంచి వెళ్లగొట్టారు. చంద్రమండలంపైకి వచ్చాడు. కానీ ఇక్కడ కూడా వివాదాల్లో ఇరుక్కుంటే పరిశోధనకని నన్ను పంపారు. డాక్టర్ మెదడులో విప్లవాత్మకమైన ఆలోచన బీజాలున్నాయని గ్రహించిన నేను ప్రభుత్వాన్ని హెచ్చరించాను. ఇప్పుడు డాక్టర్ ఎక్కడ ఉన్నాడో తెలియదు. అదృశ్యమయ్యే ముందు డాక్టర్ ఇమ్యూన్‌సిస్టంపై పరిశోధనలు చేస్తున్నాడు. నాకు అర్థమయింది. మళ్లీ అయిదుగురి మెడికల్ రికార్డులు పరిశీలించాను. ఐదుగురూ ఏదో ఒక వయసులో క్యాన్సర్‌తో బాధపడ్డవాళ్లే. కానీ ఇప్పుడు వాళ్లలో క్యాన్సర్ కణాలు మచ్చుకి కూడా లేవు.

ఎలా ఉంటాయి? క్యాన్సర్ కణాలు పుడుతూనే ఛస్తుంటే. ఇప్పుడు వాళ్ల శరీరాల్లో దేనికోసం వెతకాలో నాకు తెలుసు. సెర్చ్ రోబోను ఒకరి శరీరంలోకి ప్రవేశపెట్టాను. శరీరంలో దాని కదలికలను గమనించసాగాను. ఎటువంటి ప్రతిక్రియ లేదు.

కానీ సెర్చ్ రోబో పంపే సంకేతాలు నాకు విలువైన సమాచారాన్ని అందిస్తున్నాయి. డాక్టర్ ష్వార్జ్ చైల్డ్ పరిశోధనలు ప్రమాదకరమైనవి. ఆయన రోబో వైద్యులను సృష్టించాలని ప్రయత్నించాడు. ఈ రోబో వైద్యులు కళ్లకు కనబడరు. నానో రోబో వైద్యులన్నమాట. ఈ రోబోల్లో నానోకన్నా వందరెట్లు చిన్నగా ఉండే

బ్యాటరీలుంటాయి. ఈ బ్యాటరీలు శక్తిని తెల్లరక్తకణాల నుంచి గ్రహిస్తాయి. ఈ రోబోలకు శక్తివంతమైన సెన్సార్లుంటాయి.

ఆ సెన్సార్ల ద్వారా వీరు అణువులను, కణాలను గుర్తిస్తారు. శరీరంలో ప్రవేశించేవి మంచివా, చెడ్డవా అని నిర్ణయించి మంచివైతే వదిలేస్తారు. చెడ్డవైతే నాశనం చేసి ఆ శక్తిని గ్రహించి మరింత శక్తివంతులవుతారు.

ఇది 'ష్వార్జ్ చైల్డ్' ప్రతిపాదన. తెల్లరక్తకణాల వంటి వాళ్ళన్నమాట ఈ నానో రోబోలు. ఈ రోబోలన్నిటి కంట్రోల్ సెంటర్ మెదడులో ఉంటుంది. మెదడు వీళ్ళు చెప్పినట్టు నడుస్తుందా, వీళ్ళు మెదడు చెప్పినట్టు వింటారా అన్నది కొంతకాలానికి ఒకటే అయిపోతుంది. రోబోలు మనిషిని నడిపిస్తాయి. మనిషి రోబోలను నియంత్రిస్తాడు. మనుషులు రోబోలు అవుతారు. రోబోలు మనుషులవుతాయి. గుండె ఆగిపోతే గుండెను మళ్ళీ నడిపిస్తాయి. ప్రమాదం ఉందని గ్రహిస్తే దాన్ని ఎదుర్కొనే చర్యలు చేపడతాయి. అందుకే టీవీ చూస్తూ కూడా పాకుతూ వస్తున్న జీవిని గుర్తించగలిగాడు ఓ వ్యక్తి. ఆకలి వేస్తున్న సమాచారం అందగానే ఆహారం అందే ఏర్పాట్లు చేశాయి రోబోలు. నాకు అసూయగా అనిపించింది. 'ష్వార్జ్‌చైల్డ్' ని చంద్రమండలం పంపడం కాదు. భూమిలోనే చంపేసి ఉండాల్సింది. భూమిలోనే ఎంతో అభివృద్ధి చెందిన నానో రోబో వైద్యులను తయారుచేశాడు డాక్టర్ ష్వార్జ్‌చైల్డ్. ఇక్కడ చంద్రమండలం చేరి వాటిని మరింతగా అభివృద్ధిపరచాడు.

నాలో ఉన్న నానో రోబోకన్నా వీళ్ళలో ఉన్న రోబోలు మరింత శక్తివంతమైనవి. నాలో రోబోలకు సంవత్సరానికి ఓసారి బ్యాటరీలు ఛార్జి చేయాలి. వీళ్ళలో రోబోలు తమంతట తాము శక్తిని సృష్టించుకుంటాయి. నా మనసు కుతకుత ఉడకసాగింది. నా క్యాన్సర్‌కి చికిత్స చేసేముందే డాక్టర్ నాకు అన్నీ వివరించాడు.

"ఈ రోబోలు జీవులలో, జంతువులలోబాగానే పనిచేశాయి. కానీ మనుషులలో ఇంతవరకూ ప్రవేశపెట్టలేదు. నీ మీదే ప్రయోగం చేస్తున్నాను. విఫలమైతే మరణం లభిస్తుంది. ప్రయోగం విజయవంతం అయితే అందరికన్నా ఎక్కువ కాలం బతుకుతావు. ఆరోగ్యంగా బతుకుతావు" అన్నాడు.

"క్యాన్సర్‌తో ఎలాగూ చావు తప్పదు. మీ ప్రయోగం విజయవంతం అయితే బతుకుతాను" అన్నాను.

డాక్టర్ ప్రయోగం విజయవంతమైంది. నాలో క్యాన్సర్ నశించింది. కానీ డాక్టర్ తన ప్రయోగ ఫలితాలను ప్రపంచానికి వెల్లడించడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే డాక్టర్ చేసే నానో రోబోల చికిత్స ప్రాచుర్యానికి వస్తే ఇక డాక్టర్ల అవసరం ఉండదు. మందుల అవసరం ఉండదు. రోగాలుండవు. చావులు ఉండవు. (అదీగాక నాలా అంత చక్కటి ఆరోగ్యం మరొకరికి ఉండకూడదు.)

ప్రపంచం అల్లకల్లోలం అవుతుంది. మందుల తయారీ కంపెనీలు దెబ్బ తింటాయి. డాక్టర్లంతా దిక్కులేనివాళ్ళవుతారు. ఆపై మరణాలుండవు. అదీగాక మరణం

నావైపు ఎంతో ఆలస్యంగా వస్తుంది. నేను బతికినంత దీర్ఘకాలం మరెవ్వరూ బతకడానికి వీల్లేదు. మరొకరికి డాక్టర్ రోబో వైద్యం చేయకూడదు. అందుకే డాక్టర్ మీద నేరారోపణ చేసి చంద్రమండలం తరిమేశాను. ఇక్కడ ఏవో ప్రయోగాలు చేస్తున్నాడని తెలిసి అతడు ప్రమాదకారి అని రిపోర్ట్ ఇచ్చి అతడి మెదడును శూన్యం చేశాను. అంతలోగా ఈ ఐదుగురికి చికిత్స చేశాడన్నమాట. పళ్ళు పటపటకొరికాను.

"నేను వందేళ్ళు దాటి బతుకుతుంటేనే అందరూ ఆశ్చర్యపోతున్నారు. నన్ను దేవుడిని చూసినట్టు చూస్తున్నారు. ఇప్పుడు వీళ్ళు నాకన్నా ఎక్కువకాలం బతుకుతారు"

"వీళ్ళ శరీరాలలో ప్రమాదకరమైన పరిణామాలు జరుగుతున్నాయి. వీరిని తక్షణం చంపేయకపోతే మానవజాతికి తీవ్రమైన ప్రమాదం వాటిల్లితుంది. ఇటువంటి పరిణామాలు సంభవించడం విషయంలో ఓ పరిశోధన కమిటీ వేయాలి" రిపోర్ట్ ఇచ్చాను వినోద్‌కి.

ఓ కాపీ భూమికి పంపాను.

పరిశోధన కమిటీ బాధ్యత నాకే అప్పగిస్తారని నాకు తెలుసు. ఐదుగురిని దగ్గరుండి చంపించాను. ఇంకా ఇటువంటి ఎదుగుదల ఎవరిలోనైనా ఉందేమోనని పరిశీలించాను. లేదు. ఇప్పుడు సంతృప్తిగా ఉంది. ప్రపంచంలో అత్యధికకాలం జీవించగలిగేది నేనే. భూమికి తిరుగుముఖం పట్టాను. రాకెట్ భూమిని చేరుతూంటే డాక్టర్ నాతో అన్న మాటలు గుర్తుకొచ్చాయి. "నాకు రోబోలు నడిపే మనిషిని తయారు చేయాలని ఉంది. దాంతో మనిషలో చెడు ఆలోచనలను రోబోలు నియంత్రిస్తాయి. ఇక ప్రపంచంలో దుర్మార్గం అంతమైపోతుంది"

డాక్టర్ అంతా సరిగ్గానే ఆలోచించాడు. కానీ ఒక విషయంలో పొరపాటుపడ్డాడు. రోబోలు నిర్జీవమైనవి. వాటికి బాధ, సుఖాలు తెలియవు. ఇష్టాయిష్టాలుండవు. కానీ మనిషి శరీరంలో చిరకాలం ఉండడం వల్ల రోబోలు కూడా మనిషి నుంచి మౌలిక లక్షణాలు నేర్చుకుంటాయి. రోబోలకు కూడా అసూయపడడం వస్తుంది. లేకపోతే, నన్ను మించిన రోబో మనుషులుండకూడదని వాటిని చంపించేయడం ఏమిటి?

రాకెట్ భూమిని చేరింది. ఎప్పటినుంచో నన్ను వేధిస్తున్న ప్రశ్న మళ్ళీ తలెత్తింది. మనుషులు నన్ను మనిషి అంటున్నారు. నాలో ఉన్న నానోరోబోలు నన్ను రోబో అంటున్నాయి.

ఇంతకీ నేనెవరిని? మనిషినా? రోబోనా?

❋ ❋ ❋

# షాడో యూనివర్స్ నీడ

**భ**యం భయంగా గదిలోకి అడుగుపెడుతున్న సుభాష్‌ని చూడగానే నవ్వు వచ్చింది, ప్రొఫెసర్ పరమేశ్వర్‌కు. తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో– "ఏమిటి?" అని అడిగారు. ఓ కాగితాల దొంతరను ప్రొఫెసర్ ముందుపెట్టాడు సుభాష్.

"సార్.... నాకు రీడింగులు తీయడం రావడం లేదు" తలవంచుకుని చెప్పాడు సుభాష్.

"మరి కాస్మాలజీ నాకిష్టం అన్నావు. అస్ట్రానమీ నా ఫేవరేట్ అన్నావు. నాలుగు పుస్తకాలు చదివి వాటి గురించి ఊహించేయడం వేరు. నిజంగా రంగంలో దిగడం వేరు. విజ్ఞానశాస్త్ర పరిశోధన, కథల్లో చదివినంత హాయిగా ఉండదు. రాత్రింబగళ్ళు నిద్రాహారాలు మానుకుని అదే జీవితంగా బ్రతుకుతూ పరిశోధనలు చేస్తూ పోవాలి. నిన్ను నువ్వే మరచిపోవాలి. మిగతా ప్రపంచం అదృశ్యమైపోవాలి"

తలవంచుకున్నాడు. సుభాష్.

"ప్రొఫెసర్... నేను చిత్తశుద్ధితోనే పనిచేశాను" అంటూ ఏమేమో చెప్పబోతున్న సుభాష్ మాటలకు అడ్డొచ్చాడు ప్రొఫెసర్.

"విజ్ఞానశాస్త్రం ఖచ్చితమైన శాస్త్రం. ప్రయోగంలో ఏమాత్రం పొరపాటు జరిగినా మొత్తం ఫలితం తారుమారవుతుంది. కోతిబదులు సింహం దొరుకుతుంది" అంటూ ఆ కాగితాలు లాక్కుని పరిశీలించసాగాడు. అతడి భ్రుకుటి ముడిపడింది.

"సుభాష్... మిగతా టెలిస్కోపుల రీడింగులేవి?" అడిగాడు. తూనీగలా పరుగెత్తాడు సుభాష్. అతడు వెళ్ళగానే ప్లాస్మా తెరను తాకాడు ప్రొఫెసర్. తెరపై అస్ట్రానమీ అసోసియేషన్ అధికారి హెండ్రిక్ కనిపించాడు.

"హెండ్రీ... మీ ల్యాబ్‌లో పరికరాలు రేడియో వేవ్స్‌ను అందుకుంటున్నాయా?" అడిగాడు ప్రొఫెసర్.

"నేను ఇప్పుడే నీతో మాట్లాడాలనుకున్నాను. ఇంతలో నువ్వు పిలిచావు. నాకు రేడియో వేవ్స్‌తో సమస్యలేదు. కానీ ఎక్స్‌రేలే సరిగ్గా అందడం లేదు. నాకే కాదు మన ఆస్ట్రేలియా, రష్యాలో పరిశోధనశాలలు కూడా ఇదే అంటున్నాయి" చెప్పాడు హెండ్రిక్.

హెండ్రిక్ మాటలు విన్న ప్రొఫెసర్ ఆలోచనలో పడ్డాడు.

ఇంతలో సుభాష్ గతనెల రోజులుగా అన్ని పరికరాలు సేకరించిన రీడింగ్స్‌ని ప్రొఫెసర్ ముందుపెట్టాడు.

ప్రొఫెసర్ వాటిని పరిశీలించడంలో మునిగిపోయాడు. ప్రొఫసర్ అంటే సుభాష్‌కి ఎంతో ఇష్టం. ఎందుకంటే సుభాష్‌కి అంతరిక్ష పరిశోధన పట్ల ఆసక్తి కలగడానికి ప్రొఫెసర్ కారణం. ఓ రోజు సుభాష్ కాలేజీ క్యాంటీన్లో మిత్రులతో కలిసి టిఫిన్ తింటున్నాడు.

వాళ్ళ పక్క టేబుల్ వద్ద ప్రొఫెసర్ నుంచున్నాడు. ప్రొఫెసర్‌ని ఏడ్పించాలని సుభాష్ ఫ్రెండ్ ఒకడు "ఆస్ట్రానమీ అంటే బోరు. కళ్ళప్పగించి ఏమీ కనబడని ఆకాశం వైపు చూస్తూ కూచోవాలి పిచ్చివాడిలా" అన్నాడు.

ఆ మాటలు విన్న ప్రొఫెసర్ వీళ్ళ టేబుల్ దగ్గరకు వచ్చాడు. ప్రొఫెసర్‌ని ఏడ్పించిన ఫ్రెండ్ నోట్లో పెట్టుకోబోతున్న స్పూన్‌ని అలాగే పట్టుకుని శిలలా ఉండిపోయాడు.

"నువ్వు ఉపయోగిస్తున్న ఆ స్టీల్ చెంచా దేనితో తయారుచేశారో తెలుసా?" అడిగాడు ప్రొఫెసర్.

"ఫ్యాక్టరీలో ఇనుమునుంచి స్టీలు తయారుచేస్తారు" చెప్పాడతడు భయంగా.

"ఇనుము ఎక్కడినించి వస్తుంది?"

"భూమిలోంచి... గనుల్లోంచి తవ్వి తీస్తారు" ఇంతేనా అన్నట్టు చెప్పాడతడు.

"ఆ గనుల్లోకి ఎక్కడినించి వస్తుంది?"

క్యాంటీన్‌లో ఉన్న వాళ్ళంతా ఈ వైపు చూడసాగారు.

"భూమిలోకి ఇనుము ఎలా వచ్చింది?" గద్దించాడు ప్రొఫెసర్.

"భూమి ఏర్పడినప్పుడు"

"భూమి ఏర్పడేందుకు పదార్థం ఎక్కడినించి వచ్చింది? అయినా ఇనుము తయారవ్వాలంటే బిలియన్ డిగ్రీల ఉష్ణోగ్రత అవసరం. అంతవేడి భూమిలో ఎప్పుడూ లేదు" కొట్టినట్టే అన్నాడు ప్రొఫెసర్.

విద్యార్థులెవరూ మాట్లాడలేదు.

ప్రొఫెసర్ నవ్వాడు. "సూపర్‌నోవా పేరు విన్నారా? విస్ఫోటనం చెందిన పెద్ద నక్షత్రాన్ని సూపర్‌నోవా అంటారు. సూపర్‌నోవాలో ఇనుము తయారవుతుంది. అలా తయారైన ఇనుము విస్ఫోటనం వల్ల అంతరిక్షంలోకి వెదజల్లబడుతుంది. ఇలా వెదజల్లబడిన పదార్థం కొన్ని వేల మిలియన్ మైళ్ళు అంతరిక్షంలో ప్రయాణించి వచ్చి భూమిని చేరుతుంది. అలా చేరిన ఇనుమును గనుల్లోంచి తవ్వుకుని మనం వాడుకుంటున్నాం"

అందరూ నోళ్ళు తెరచి వింటున్నారు.

"అర్థమయిందా! కొన్ని బిలియన్ సంవత్సరాల క్రితం తయారై, బిలియన్ మైళ్ళ దూరం ప్రయాణించి భూమిలో నిక్షిప్తమైన ఖనిజంతో తయారైన చెంచా నీ చేతిలో ఉంది" అందరూ తమ చేతుల్లోని చెంచాల వైపు చూసుకున్నారు.

"నీ శరీరం తయారైన కార్బన్, ఇతర మూలకాలు అంతరిక్షంలోవే. అర్థమయిందా? మన భూమి, మన విశ్వం ఎంత అపురూపమైనవో! ఇంత అపురూపమైన విజ్ఞానం తెలుసుకోవడం బోరా? నువ్వేమిటి, నీ జీవితానికి అర్థం ఏమిటి? ఈ విశ్వ ప్రణాళికలో నీ బాధ్యత ఏమిటి, తెలుపుతుంది ఖగోళశాస్త్రం" అంటూ విసవిసా వెళ్ళిపోయాడు ప్రొఫెసర్. ఆ మాటలు సుభాష్‌పై ప్రభావం చూపించాయి. అతడికి అడుగు తీసి అడుగువేస్తున్నా ప్రొఫెసర్ మాటలు గుర్తుకు రాసాగాయి. ఆకాశం వైపు చూసూంటే ఆ నక్షత్రాలలోకి దూసుకువెళ్ళి వాటి రహస్యాలు తెలుసుకోవాలన్న కోరిక బలంగా కలిగేది. అందుకే ఓ రోజు ప్రొఫెసర్‌ని కలిసి ఆస్ట్రానమీ చదవాలని ఉందని కోరిక వెల్లడించాడు.

"ఆస్ట్రానమీ చదివేముందు నక్షత్రాలను చూడడం నేర్చుకో" అని టెలిస్కోపు రీడింగ్‌లు తీసే అసిస్టెంట్ బాధ్యత అతడికి అప్పగించాడు ప్రొఫెసర్.

❄ ❄ ❄ ❄ ❄

"మనం చాలా పనిచేయాల్సి ఉంది" అని ప్రొఫెసర్ అనడంతో ఆలోచనల్లోంచి బయటకు వచ్చాడు సుభాష్.

"కానీ..." అని ఏదో అనబోయాడు. సుభాష్.

"నీ సెల్ఫ్‌పిటీతో నన్ను చంపకు. రీడింగ్‌లు తీయండంలో లోపంలేదు. కూర్చో" అన్నాడు. ప్రొఫెసర్.

కూర్చున్నాడు సుభాష్.

"మనకే కాదు ప్రపంచవ్యాప్తంగా అనేక పరిశోధనశాలల్లో ఈ పొరపాటు జరుగుతోంది"

"ఎందుకంటారు?" అడిగాడు సుభాష్.

“అదే ఆలోచిస్తున్నాను. మన పరికరాల పొరపాటు కాదు. మానవ తప్పిదం లేదు. అలాగని నక్షత్రాలు ఈ తరంగాలను వెదజల్లడం మానలేదు”

“ఈ కాస్మిక్ కిరణాలన్నీ విద్యుదయస్కాంత తరంగాల రూపంలో విశ్వంలో ప్రయాణిస్తాయి కదండీ. వీటికి అడ్డుతగిలి ఉండవచ్చు కదా?”

సుభాష్ వైపు ఆలోచనగా చూశాడు ప్రొఫెసర్. “విశ్వంలో అత్యధికభాగం శూన్యం. కాబట్టి కాస్మిక్ కిరణాలను అడ్డుకునేదేదీ లేదు. దారిలో ఎక్కడైనా విద్యుదయస్కాంత ఖజానాలుంటే తప్ప ఇవి దారితప్పవు. కానీ ఇటీవలి కాలంలో ఏ నక్షత్రంలో కూడా ఈ విద్యుదయస్కాంత తుఫానులు చెలరేగిన దాఖలాలు లేవు” అన్నాడు. ప్రొఫెసర్. సుభాష్ చాలాసేపు మౌనంగా ఉన్నాడు.

“కానీ ప్రొఫెసర్, ఏదో ఒకటి అడ్డుకోకపోతే మనల్ని చేరి ఉండేవి కదా? మనకీ సమస్య వచ్చేదే కాదు” అన్నాడు. సుభాష్.

సుభాష్ వెళ్ళిన చాలాసేపటివరకూ అతడు వెళ్ళినవైపే చూస్తూండిపోయాడు ప్రొఫెసర్. ప్రపంచవ్యాప్తంగా రేడియో ప్రసారాలు ఆగిపోయాయి. రేడియో తరంగాలు వాతావరణంలోంచి ప్రయాణించలేకపోతున్నాయి. అంతరిక్షం నుంచి రేడియో కిరణాలు అదృశ్యమయ్యాయి.

ఇందుకు సరైన కారణం తెలియక ప్రజలు అల్లల్లాడసాగారు. శాస్త్రవేత్తలు వివరణలు ఇవ్వలేక సతమతమవసాగారు. ఆరంభంలో అగ్రరాజ్యాల నేతలు ఒకరినొకరు దూషించుకున్నారు. కానీ రేడియో తరంగాలను విశ్వం నుంచి అదృశ్యం చేయగల సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏ దేశం కూడా సాధించలేదని గ్రహించి ఇందుకు కారణాలు కనుక్కునేందుకు కలసికట్టుగా పరిశోధనలు ప్రారంభించారు.

* * * * *

“ప్రొఫెసర్” భయం భయంగా పిలిచాడు సుభాష్.

తలెత్తి చూశాడు ప్రొఫెసర్. “ ప్రొఫెసర్. మళ్ళీ రీడింగులు తప్పుతున్నాయి. ఈసారి వేవ్‌లెంగ్త్ కిరణాలు అందడం లేదు” చెప్పాడు సుభాష్.

“కూర్చో” అన్నాడు ప్రొఫెసర్ శాంతంగా. సుభాష్ కూచున్నాడు.

“నీకు డార్క్ మేటర్ గురించి ఏం తెలుసు?” ప్రశ్నించాడు ప్రొఫెసర్.

“ఇది ఇంకా పూర్తిగా వేళ్ళూనుకోని సిద్ధాంతం. ‘బిగ్‌బ్యాంగ్’ వల్ల విశ్వవ్యాకోచం ఆరంభమయింది. అయితే శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం బిగ్‌బ్యాంగ్ వల్లనే విశ్వం ఆరంభమై ఉంటే విశ్వంలో పదార్థ సాంద్రత క్యూబిక్ మీటర్‌కు 5ి1027 కిలో గ్రాములుండాలి. కానీ మనకు కనబడే గ్రహాలు నక్షత్ర సమూహాలు, పాలపుంతలు అంతా కలిపితే ఈ సంఖ్యలో వందవవంతు మాత్రమే ఉంది. అంటే మనకు కనబడని పదార్థం ఎంతో ఉంది. కాబట్టి ఈ పదార్థాన్ని ‘డార్క్‌మేటర్’ అంటారు శాస్త్రవేత్తలు. ఎందుకంటే అది ఉందో లేదో తెలియదు కాబట్టి” గబగబా చెప్పాడు సుభాష్.

నవ్వాడు ప్రొఫెసర్. “డార్క్‌మేటర్ ఉంది. లేకపోతే నక్షత్రాలు పాలపుంతల పరిధిలో ఒదిగి ఉండేవి కావు. డార్క్‌మేటర్ ఆకర్షణశక్తి వాటిని పట్టి ఉంచుతోంది”

“అంటే డార్క్‌మేటర్ ఉన్నట్టేనా?” అడిగాడు సుభాష్.

“ఉన్నట్టే ఏమిటి? ఉంది. డార్క్‌మేటర్‌లో మాకోలు, వింప్‌ల వంటి కణాలున్నాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. మనకు కనిపించే పదార్ధంలో ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు ఎలాగో, డార్క్‌మేటర్‌లో మాకోలు, వింప్‌లు అలాగ. మళ్ళీ వీటిలో చల్లటికణాలు, వేడికణాలు మనకు కనిపించే పదార్థాన్ని ఒకచోట చేర్చి గేలాక్సీలు ఏర్పరుస్తాయి. ఈ డార్క్‌మేటర్ ఉనికిని నిరూపించే ప్రయోగాలు జరుగుతున్నాయి. కానీ ఈ డార్క్‌మేటర్ ఉందని ఒప్పుకోవాలంటే శాస్త్రవేత్తలకు ‘షాడో యూనివర్స్’ అడ్డం వస్తోంది” చెప్పాడు ప్రొఫెసర్.

“షాడో యూనివర్స్?” ప్రశ్నార్థకంగా చూశాడు సుభాష్.

ప్రొఫెసర్ లేచి అటూ ఇటూ పచార్లు చేయసాగాడు.

“ప్రపంచంలో మానవుడిమేథకు అందని నిజాలు అనేకం ఉన్నాయి. కానీ తన మేథ పరిధి పరిమితం అవడంతో వాటిని ఒప్పుకునేందుకు మనిషి ఇష్టపడడు. కానీ ఈ నిజాలు ఏదో ఒక రూపంలో తమ ఉనికిని ప్రకటిస్తూనే ఉంటాయి. ఇప్పుడు ‘షాడోయూనివర్స్’ అదే పనిచేస్తోంది”

అర్థంకానట్టు చూశాడు సుభాష్.

“మన విశ్వానికి నీడలాంటి విశ్వాలు ఇంకా అనేకం ఉన్నాయని ఓ సిద్ధాంతం ఉంది. మన విశ్వం ఏర్పడినప్పుడే అది ఏర్పడిందంటారు. ప్రోటాన్లకు నీడ ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లకు నీడ ఎలక్ట్రాన్లు ఉంటాయి”

“అనూహ్యంగా ఉంది” అన్నాడు సుభాష్.

“విశ్వంలో అనేక అంశాలు మన ఊహకు అందవు. సూక్ష్మక్రిమికి మనిషి పరిమాణం ఊహకు అందుతుందా? కానీ మనం ఉన్నామా? లేదా? అలాగే మన ఊహకు అందనిది లేవనడం సబబేనా?”

అయోమయంగా తల ఊపాడు సుభాష్.

“అంటే షాడో యూనివర్స్‌లో జీవులు ఉన్నా అవి మనల్ని పట్టించుకోవు. వాటి ప్రపంచం వాటిదే. మన ప్రపంచం మనదే”

“కానీ ఇప్పుడు ఆ నీడ విశ్వం తన ఉనికి....”

“అక్కడికే వస్తున్నాను. మనకు ఒకరితో ఒకరికి ఒక విషయంలో సంబంధం ఉంది. అదేమిటంటే మన ప్రపంచాలు ఆకర్షణశక్తి అనే భౌతికశక్తివల్ల ఒకదాన్ని మరొకటి ప్రభావితం చేసుకుంటాయి. నా అనుమానం ప్రకారం ఈ షాడో యూనివర్స్‌లో మార్పులు జరిగాయి. ఆ మార్పు తరంగాల రూపంలో విశ్వాన్ని ప్రభావితం చేస్తోంది. దానివల్ల విశ్వరూపంలో మార్పువస్తోంది”

“అయితే?”

"ఈ డార్క్‌మేటర్ ప్రభావం వల్ల ఇంతవరకూ ఖాళీగా ఉన్న విశ్వంలో విద్యుదయస్కాంత తరంగాల ప్రవాహానికి అడ్డు తగులుతోంది. అందుకే ఈ తరంగాలు మనల్ని చేరడం లేదు."

"కానీ ఇలాగైతే అన్ని తరంగాలు ఒకసారి ఆగిపోవాలి. కానీ ముందు రేడియోతరంగాలు ఆగిపోయాయి. ఆ తరువాత.."

"సుభాష్... విశ్వంలో ఏదీ హఠాత్తుగా జరగదు. హఠాత్తుగా జరిగినట్టు పైకి కనిపించినా ఆ చర్య జరిగేందుకు ముందు బోలెడన్ని పరిణామాలుంటాయి. ఈ డార్క్‌మేటర్ కూడా ఓ ప్రవాహంతో మన విశ్వాన్ని ముంచెత్తుతోంది. దాంతో పాటు షాడో యూనివర్స్ మన ప్రపంచంతో మిళితమవుతోంది"

"కానీ మనకు కనబడడం లేదేం?"

"దాని ఫలితాలు కనిపిస్తున్నాయి"

"ఏమిటవి?" సుభాష్ శరీరం వణికిపోసాగింది. ఏదో తెలియని భయం అతడి నరనరాన వ్యాపించసాగింది.

"ఈ డార్క్‌మేటర్ ఎంత దట్టంగా ఏర్పడుతుందంటే ఆ ఫ్రీక్వెన్సీకి చెందిన తరంగాలు మనకు అందడం మానేస్తాయి. మనిషి కన్ను చూడగలిగే కిరణాలు కొన్ని. మనదృష్టికి అందని తరంగాలు ఎన్నో ఉన్నాయి. రేడియో తరంగాలు, ఎక్స్‌రేలు, అల్ట్రావయొలెట్ కిరణాలు ఇలా. ముందు రేడియో తరంగాలు అందడం లేదు. అప్పుడే నాకు అనుమానం వచ్చింది. కానీ కొన్నాళ్ళు ఆగాను. నా అనుమానం ధృవపడింది. ఇంకా కొన్నాళ్ళు ఆగితే ఎక్స్‌రేలు ఆగిపోతాయి. ఆ తరువాత మన కళ్ళకు కనబడే రంగుల కిరణాలు అదృశ్యమౌతాయి" నిర్భావంగా చెప్పుకుపోతున్నాడు ప్రొఫెసర్.

"ఆగండి ..." అరిచాడు సుభాష్.

"మీరేం అంటున్నారో తెలుసా?"

"తెలుసు" నిశ్చింతగా చెప్పాడు ప్రొఫెసర్.

"మీరు చెప్పేదే నిజమయితే కొన్ని రోజులకు మన ప్రపంచంలోని ఎరుపు రంగు పోతుంది. అప్పుడు ప్రపంచం కనిపించే విధం మారుతుంది. ఆ తరువాత నీలి, పసుపు, ఆకుపచ్చ రంగులు అదృశ్యమౌతాయి. కొన్నాళ్ళకు అసలు వెలుతురే కనబడదు. అప్పుడు... అప్పుడు ఎలా ఉంటాం మనం? చీకట్లో గుడ్డివాళ్ళలాగా ఎన్నాళ్ళు బ్రతుకుతాం? ఏం చేస్తాం? ప్రొఫెసర్ మీరు చెప్పేది అబద్ధం అని చెప్పండి"

తల అడ్డంగా ఊపి ఏదో చెప్పబోతున్న ప్రొఫెసర్ గోడవైపు చూస్తూ ఆగిపోయాడు.

అతడి దృష్టిని అనుసరించిన సుభాష్ కళ్ళు పెద్దవయ్యాయి. తెల్లగా ఉండాల్సిన గోడ నారింజరంగులో కనిపించసాగింది. అంతలో దానిరంగు పచ్చగా మారింది. గదిలో దీపం రంగు కూడా మారసాగింది.

"నేను అనుకున్నదానికన్నా వేగంగా షాడోయూనివర్స్ నీడ మనల్ని ముంచెత్తుతోంది" గొణుక్కున్నాడు ప్రొఫెసర్.

"ఇది అబద్ధం" పిచ్చిగా అరుస్తూ బయటకు పరిగెత్తిన సుభాష్ ఆగిపోయాడు. బయట ప్రజలంతా ఆకాశం వైపు చూస్తున్నారు. ఆకాశంలో అద్భుతమైన రంగుల విన్యాసం జరుగుతోంది. ఆరిపోయే దీపం చివరిసారి దేదీప్యమానంగా వెలిగినట్టు, అదృశ్యమవబోయే ముందు ఆఖరిసారిగా ప్రపంచంలోని రంగులన్నీ ఆకాశంలో అత్యద్భుత ప్రదర్శననిస్తున్నాయి. ఇంతలో ప్రపంచం మొత్తం రంగులు మార్చసాగింది. నీలిరంగు నీరు నలుపులోకి మారింది. ప్రజలు ఆశ్చర్యంతో ఆగిపోయి చూడసాగారు. వాళ్ళకి జరుగుతున్నది అర్థంకావడం లేదు. అంతా చూస్తున్న సుభాష్ కళ్ళలోంచి నీళ్ళు కారసాగాయి. మనిషి చూడగలిగే రంగులు వయొలెట్ నుంచి ఎరుపు వరకూ ప్రత్యేక తరంగదైర్ఘ్యంలో ఉంటాయి. వాటిని 'విజిబుల్ స్పెక్ట్రమ్' అంటారు. ఆ తరంగాలు భూమిని చేరడం ఆగిపోతే మనిషికి కళ్ళున్నా చూడలేడు.

ప్రపంచం మొత్తం అంధకారమైపోతుంది.

ఇంతలో ల్యాబ్‌లోంచి ఏదో శబ్దం వినిపించింది.

"ప్రొఫెసర్?" లోపలకు పరుగెత్తబోయిన సుభాష్ ఆగిపోయాడు.

నెమ్మదిగా వెలుతురు తగ్గిపోతోంది. త...గ్గి...పో...యింది!!!

❊ ❊ ❊

# పునఃసృష్టికి పురిటినొప్పులు

**త**ను వేసుకున్న ప్రోటీన్ అణు దుస్తుల నుండి చుట్టూ చూసాడు అద్వయిత్. నిజానికి హఠాత్తుగా చూస్తే ఎటువంటి రక్షణ కవచాలు లేకుండా అపరిచిత గ్రహంలోని ప్రమాదకరమైన వాతావరణంలోకి అడుగుపెట్టాడు అద్వయిత్ అనిపిస్తుంది. కానీ అతని చుట్టూ కంటికి కనబడనంత సూక్ష్మమైన ప్రోటీన్ అణుకవచం వుంది.

అంతరిక్ష ప్రయాణాల్లో స్పేస్‌సూట్ వేసుకొని తిరగడం తప్పరిసరి. అయినా దాని బరువు వ్యోమగాములను అనేక ఇబ్బందులపాలు చేయసాగింది. దాంతో శాస్త్రవేత్తలు తమ దృష్టిని బరువులేని సులువైన స్పేస్‌సూట్‌ను తయారుచేయడం వైపు కేంద్రీకరించారు. ఫలితంగా ప్రోటీన్ సూట్ తయారయింది. ప్రపంచంలో జీవం ఉండీ లేనట్టు ఉంటూ జీవుల లక్షణాలన్నీ తనలో పొందుపరచుకుని జీవం ఉన్నదానిలా ప్రవర్తిస్తుంది ప్రోటీన్.

దాంతో తన చుట్టూ ఉన్న వాతావరణానికి స్పందించి అందుకు తగ్గట్టుగా తనంతట తాను మారే ప్రోటీన్ శక్తికి ఊపునిచ్చారు శాస్త్రవేత్తలు. దాన్ని పెద్దపొరలా లాగి ఇతర యాంత్రిక పరికరాలను అతిసూక్ష్మమైన రీతిలో పొందుపరిచారు.

ఫలితంగా దాదాపుగా ఎటువంటి పరిస్థితులనయినా తట్టుకుని అందుకు తగ్గ మార్పులను స్వయంగా చేసుకోగల ప్రోటీన్ సూట్ తయారయింది. దాంతో అంతరిక్ష ప్రయాణాలు మరింత సులువయ్యాయి.

"అంతా సవ్యంగా ఉంది కదా?" అడిగింది అఖిల.

'ఓకే' అన్నట్లు సౌంజ్ఞ చేశాడు అద్వయిత్.

* * * * *

మరుభూమిలా ఉంది గ్రహం. ఉండి ఉండి వీచే గాలికి ఎర్రటి మట్టి

ఎగురుతోంది. చూస్తుంటే గ్రహమంతా ఏదో కొలిమిలో పెట్టి తీసినట్లుగా ఉంది.

అద్వయిత్ కన్నా ముందు ఎగురుతున్న 'వైరస్ బబుల్' వివరాలను అద్వయిత్‌కు అందజేస్తోంది. అది అందిస్తున్న వివరాలను బట్టి చూస్తే గాలిలో జీవులుండే అవకాశం లేదు. దూరంగా కొండలున్నాయి. కానీ అవి కూడా జీవరహితంగానే ఉన్నాయి. గ్రహమంతా అగ్నిపర్వత విస్ఫోటనాల వల్ల వెలువడిన లావాతో కప్పి ఉంది. ఈ గ్రహంలో కూడా జీవం ఉండే అవకాశం లేదు. అద్వయిత్‌కు నిరాశగా అనిపించింది.

ఈ విశాల విశ్వంలో... కాదు...కాదు ఈ అనంత విశ్వాలలో తాము ఒంటరివాళ్లు. ప్రోటీన్ స్పేస్ సూట్‌ను అభివృద్ధిపరిచే సమయంలోనే శాస్త్రవేత్తలు అంతరిక్ష ప్రయాణాల్లో ఒక అద్భుతాన్ని కనుగొన్నారు. అది 'వార్మ్ హోల్' అనే 'అంతరిక్ష బొరియ'.

అంతరిక్షంలో అక్కడక్కడా అతి తక్కువ స్థలంలో నక్షత్రాలలో అధికమైన పదార్థం కేంద్రీకృతమవుతుంది. దానివల్ల నక్షత్రం అస్థిరమవుతుంది. కానీ దాని ఆకర్షణశక్తి విపరీతంగా పెరిగిపోతుంది.

ఆకర్షణశక్తి ఎంతగా పెరుగుతుందంటే అక్కడ భౌతికసూత్రాలు సైతం పనికిరాకుండా పోతాయి. ఆ ప్రాంతంలో పడిన వెలుతురు కిరణం కూడా ఆకర్షణ శక్తికి లోనై వెనక్కు తిరిగి రాలేదు.

దాంతో ఆ ప్రాంతం మిగతా విశ్వానికి అంతులేని నల్లటి లోయలు (బ్లాక్‌హోల్స్)గా కనిపిస్తాయి. అవి అడుగులేని అనంతమైన చీకటి లోయలు.

ఈ బ్లాక్‌హోల్స్‌కీ, అంతరిక్షానికీ నడుమ సరిహద్దులా ఉండే దిగంతపుటంచులను 'ఈవెంట్ హొరైజన్' అంటారు. ఇక్కడ మనకు పరిచయమైన భౌతికసూత్రాలన్నీ విచ్ఛిన్నమైపోతాయి. కాలం కొలమానం మారిపోతుంది.

శాస్త్రవేత్తల ఊహలను బ్లాక్‌హోల్స్ అమితంగా ఆకర్షించాయి. వాటికి ఆవల ఏముందో అన్న ఆలోచన వారిని వేధించసాగింది. బ్లాక్‌హోల్స్‌లో ప్రయాణం చేసి మరోవైపుకు వెళ్లగలిగితే ఎన్నో అద్భుతాల ఆవిష్కరణ చేయవచ్చునన్న ఆలోచన వారిని వదలడం లేదు. ఇదేసమయంలో బ్లాక్ హోల్స్ లాంటివే అయినా బ్లాక్‌హోల్స్‌కు భిన్నంగా లోయ అవతలివైపు ద్వారం ఉన్న బొరియలలాంటి వార్మ్‌హోల్స్‌పై శాస్త్రవేత్తల దృష్టిపడింది.

ఎలుకలు, ఇతర పురుగులు ఎలాగైతే నేలను తవ్వి ఒకచోటునుంచి మరో చోటుకు షార్ట్‌కట్‌లను ఏర్పరచుకుంటాయో అలాగే జీవులు అంతరిక్షంలో ఒక చోటునుంచి మరో చోటుకి తక్కువ సమయంలో వెళ్లేందుకు ఏర్పడ్డ షార్ట్‌కట్‌లు ఈ 'వార్మ్‌హోల్స్' అని శాస్త్రవేత్తలకు అర్థమయింది.

అంటే ఒక కాలంలో, ఒక స్థలంలో ఈ వార్మ్ హోల్స్‌లో అడుగుపెడితే మరో కాలంలో మరో స్థలంలో బయటకు వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గ్రహించారు. 'వార్మ్‌హోల్స్' గుండా ప్రయాణించడంవల్ల నూతన గ్రహాలు, నక్షత్రాలే కాక నూతన

విశ్వాలు కూడా కనుగొనవచ్చని వారికి అర్థమయింది. కొన్ని కాంతి సంవత్సరాల దూరాన్ని కొన్ని క్షణాల్లో ప్రయాణించవచ్చు. దీనికి 'ప్రోటీన్ సూట్' తోడయింది.

"అద్వయిత్" ఆ నిశ్శబ్దంలో పెద్దగా ధ్వనించింది. ఆధ్యాత్మిక గొంతు.

"యస్" అన్నాడు అద్వయిత్.

"నువ్వు పరిశీలిస్తున్న ప్రదేశం ఎలా వుంది?" అడిగాడు ఆధ్యాత్మిక్.

"నిర్జీవంగా ఉంది. జీవం ఉండే అవకాశం లేదు" నిరాశగా చెప్పాడు అద్వయిత్.

"నేను ఉన్నదేశం అందుకు భిన్నంగా ఉంది"

"ఏవైనా జీవాలున్నాయా?" ఆత్రంగా అడిగాడు అద్వయిత్.

"జీవాలులేవు. కానీ ఈ ప్రాంతంలో ఒకప్పుడు జీవాలున్నాయని ఖచ్చితంగా చెప్పే ఆధారాలు దొరికాయి" సంతోషంగా చెప్పాడు ఆధ్యాత్మిక్.

"నిజంగా?" పెద్దగా అరిచాడు అద్వయిత్.

"నిర్ధారణ కోసం రీడింగ్స్ అఖిలకు పంపాను. అంతేకాదు ఇక్కడ ఒకప్పుడు నీళ్ళు కూడా ఉండేవనేందుకు రుజువులున్నాయి"

ఎక్సయిట్‌మెంట్‌ను ఆపుకోలేకపోతున్నాడు.

"నేనూ అటే వస్తాను" చిన్న పిల్లవాడిలా మారాం చేసాడు అద్వయిత్.

"తొందరపడకు. ఈ గ్రహం పరిస్థితి నాకు విచిత్రంగా అనిపిస్తోంది. ఎందుకంటే ఇక్కడ నాగరికత చాలా అభివృద్ధి చెందినట్లు తోస్తోంది. ఇంత అభివృద్ధి చెందిన నాగరికత ఎలా నాశనమయిందో తెలుసుకుంటే మనం జాగ్రత్తపడవచ్చు"

"గుడ్.... ఇతరుల పొరపాట్లను గ్రహించి తెలివిగా మసలుకునేవాడు నిజమైన తెలివైనవాడు. రాత్రికి మన వ్యోమనౌకలో కలుసుకుందాం" అన్నాడు అద్వయిత్.

ఆధ్యాత్మిక్ ఉన్న ప్రాంతానికి వెళ్ళి ఆ జీవాల ఆనవాళ్ళు చూడాలని అద్వయిత్‌కు ఆత్రంగా ఉన్నా, ఆధ్యాత్మిక్ చెప్పినట్లు తనకు నిర్దేశించిన పనిని పూర్తిచేయడం మంచిది అని గ్రహించాడు. అందుకే మళ్ళీ తన దృష్టిని తన కర్తవ్యంవైపు మరల్చాడు.

కానీ ఈ గ్రహంలో ఒకప్పుడు జీవులు నివసించేవన్న ఆలోచన అతడిని వదలడలేదు. వాతావరణంలో ఉష్ణోగ్రత ఎంతో ఎక్కువగా ఉంది. ఎటువంటి జీవమైనా మాడిపోవాల్సిందే. పైగా కార్బన్‌డయాక్సైడ్, నైట్రోజన్, ఆక్సిజన్‌లతో గ్రహం నిండి వుంది. కాబట్టి జీవులు బ్రతకడం కష్టం. బతికినా ఆక్సిజన్ ధాటికి భగ్గుమంటాయి.

ఇక ఈ గ్రహానికి సూర్యుడు ఎంతో దగ్గరగా ఉన్నాడు. చూస్తుంటే రెడ్‌జెయింట్ దశలో ఉన్నట్టున్నాడు అనుకున్నాడు అద్వయిత్.

మధ్య తరగతి నక్షత్రాలలో ఇంధనం అయిపోతున్నకొద్దీ మరింత ఎక్కువకాలం జీవించాలన్న ఆశతో అవి వ్యాకోచిస్తాయి. అలా వ్యాకోచిస్తూ తనచుట్టూ తిరుగుతున్న గ్రహాలను ఒక్కొక్కటిగా మింగేస్తూంటాయి. ఈ దశను రెడ్ జెయింట్ దశ అంటారు.

బహుశా ఈ గ్రహం ఒకప్పుడు ఈ సూర్యుడికి దూరంగా ఉండేదేమో! రెడ్

జెయింట్ అయి సూర్యుడు దగ్గరగా ఉన్న గ్రహాలను మింగేశాడేమో. అందుకే వేడి ఎక్కువగా ఉంది. ఇంకొన్నాళ్ళకి ఈ గ్రహాన్ని కూడా మింగేస్తాడేమో!

"ప్రోటీన్ సూట్‌ని ఛార్జ్ చేసే సమయమయింది. తిరిగి వచ్చేయి" ఆజ్ఞాపించింది అఖిల.

అయిష్టంగా వెనక్కు తిరిగాడు అద్వయిత్. అతనికి ఈ గ్రహంలో ఇంకా తిరగాలని ఉంది. ఎందుకో ఆప్యాయంగా అనిపిస్తోంది గ్రహం.

ఒకప్పుడు ఈ నేలపై ఏవేవో వింతజీవులు సంచరించాయన్న ఆలోచన ఆనందాన్నిస్తే ఈ జీవులు అంతరించాయన్న ఆలోచన ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇంకా ఏయే రహస్యాలు ఈ గ్రహంలో దాగున్నాయో కనుక్కోవాలని ఆతృతగా ఉంది. కానీ వెనక్కు తిరగక తప్పలేదు.

* * * * *

"ఇంటినుంచి ఏమైనా సందేశాలొచ్చాయా?"

ప్రోటీన్ సూట్‌ను ఛార్జింగ్‌కి పెట్టి వైరస్ బబుల్ ప్రక్షాళనతో శరీరంలోకి ఏవైనా నూతన వైరస్‌లు ప్రవేశించాయో లేదోనని పరిశీలన పూర్తిచేసుకుని విశ్రాంతి తీసుకుంటూ అడిగాడు అద్వయిత్.

"లేదు. అదొక్కటే మన ప్రయోగంలో విజయవంతం కాని అంశం."

"ఏం? మన గ్రహం నుంచి స్పందనలేవీ అందడం లేదా?" అడిగాడు ఆధ్యాత్మిక్.

"మనం ఈ గ్రహం మీద దిగినప్పటినుంచీ కాన్‌టాక్ట్ చేయాలని ప్రయత్నిస్తూనే ఉన్నాను. కానీ లాభం లేదు" పెదవి విరిచింది అఖిల.

"మన రీడింగ్స్ ఫలితాలు తెలిశాయా?" ఆతృతగా అడిగాడు అద్వయిత్.

అఖిల రోబో మీట నొక్కింది.

రోబో గబగబా చెప్పడం ఆరంభించింది.

"ఈ గ్రహంలో ఒకప్పుడు అభివృద్ధి చెందిన నాగరికతలు ఉండేవి. ఈ గ్రహం వైజ్ఞానికశాస్త్రంలో ఎంతో అభివృద్ధిచెందింది. అంతరిక్షయానం చేసే వారీ జీవులు. కానీ వాతావరణం వేడెక్కడం వల్ల వృక్షాలు నాశనమైపోయి గ్రహం నివసించడానికి అననుకూలమైంది. జీవులు నశించాయి" నిర్భావంగా చెప్తూపోయింది రోబో.

కానీ అది వింటూంటే అఖిల, ఆధ్యాత్మిక్, అద్వయిత్‌ల మనసుల్లో అనేక వింతభావనలు సుళ్ళు తిరగసాగాయి.

"నువ్వు మా కోసం... ఇక్కడి జీవులు ఎలా ఉండేవారో చిత్రం గీయగలవా?" ఆశగా అడిగింది అఖిల.

"డాటా సంపూర్ణంగా లేదు. కానీ ప్రయత్నిస్తాను. కాస్త సమయం కావాలి" చెప్పింది రోబో.

రోబో మాటలు వింటూ వెనక్కు వాలాడు అద్వయిత్.

“నిజంగా... మనం ఎంత దూరం, ఎన్నో ప్రమాదాలను దాటుకుని వెతుకుతూ వస్తే జీవం ఉన్న ఒక్క గ్రహం దొరికింది. తీరా మనం వచ్చేసరికి జీవం అంతరించింది” అన్నాడు అద్వయిత్.

“బహుశా మనం ఇంకాస్త ముందు వచ్చి ఉంటే జీవాన్ని రక్షించేవాళ్లమేమో. మనం బ్లాక్‌హోల్స్, వార్మ్‌హోల్స్ ఒత్తిడిని తట్టుకునేంతగా సాంకేతిక అభివృద్ధి సాధించాం. వీళ్లని సులభంగా రక్షించగలిగేవాళ్లం” అన్నాడు ఆధ్యాత్మిక్.

“వాళ్లని రక్షించడం అటుంచు. ముందు మనం మన గ్రహానికి తిరిగి ఎలా వెళ్తామో ఆలోచించండి” అంది అఖిల.

“ఇంతకీ మనం ఎక్కడ ఉన్నామో తెలిసిందా?” అడిగాడు అద్వయిత్.

“కాలమే కాదు మనం విశ్వం కూడా మారినట్టున్నాం” లోగొంతుకతో చెప్పింది అఖిల. వాళ్లందరికీ తమ సాహసం గుర్తుకువచ్చింది.

“వార్మ్‌హోల్స్‌లోంచి ప్రోటీన్ సూట్ వేసుకుని ప్రయాణించవచ్చన్న ఆలోచన స్థిరపడడంతో శాస్త్రవేత్తలు తమ దృష్టిని కాంతివేగం సాధించడంవైపు మరల్చారు. వారికి మిల్లిసెకండ్ పల్సార్‌లు సమయానికి దొరికాయి.

‘పల్సార్’ అనేది వేగంగా భ్రమిస్తూ రేడియేషన్లను వెదజల్లే నాడీనక్షత్రం. క్రమం తప్పకుండా నాడి కొట్టుకునేట్టు ఈ పల్సార్లు క్రమం తప్పకుండా అంతరిక్షంలోకి రేడియేషన్లను వెదజల్లుతాయి.

ఈ మామూలు పల్సార్ల కన్నా వేగంగా సెకనుకు వెయ్యిమార్లు తనచుట్టూ తాను తిరుగుతూ రేడియేషన్లను వెదజల్లే పల్సార్లను ‘మిల్లి సెకండ్ పల్సార్లు’ అంటారు. ఈ పల్సార్ల వేగంతో తన వేగాన్ని జతపరచడం వల్ల మరింత వేగాన్ని సాధించిన హ్యోమనౌక కాంతివేగంతో వార్మ్‌హోల్స్‌లోకి దూసుకువెళ్లింది. ఈ ప్రయాణంలో వెళ్లటమే తప్ప తిరిగి రావడం ఉండదని తెలిసి కూడా అవకాశం వదులుకోవడం ఇష్టంలేక అఖిల, ఆధ్యాత్మిక్, అద్వయిత్‌లు ముందుకు వచ్చారు.

తమ ప్రయాణం ఒకవైపేనని వారికి తెలుసు. అసలు తమ ప్రయోగం విజయవంతమవుతుంది. తాము ప్రాణాలతో ఉంటామనీ వారు అనుకోలేదు. ఇప్పుడు ప్రాణాలు దక్కగానే వారి దృష్టి తమ గ్రహంవైపు మళ్లింది. తెరపై రకరకాల జీవుల బొమ్మలు చకచకా కనబడుతున్నాయి.

అవి చూస్తుంటే ఆశ్చర్యమనిపిస్తోంది వారికి.

‘ఇన్ని రకాల జీవులుండేవా ఈ గ్రహంలో? మరి ఈ గ్రహం నాశనం అవుతుంటే ఒక్క జీవి కూడా ఏమీ చేయలేకపోయిందా?’ ముగ్గురిలోనూ అదే ఆలోచన మెదులుతోంది. చివరగా రోబో తెరపై ప్రత్యక్షమైన జీవిని చూస్తూ ముగ్గురూ అప్రయత్నంగా హాహాకారాలు చేశారు. తెరపై తమలాంటి జీవి కనిపించింది. దానికీ రెండు చేతులు, రెండు కాళ్ళు, రెండు చెవులు, ఒక్క నోరు, ముక్కు ఉన్నాయి. ముగ్గురూ

మొహాలు చూసుకున్నారు. ఇంతలో హఠాత్తుగా సమాచార రోబో సకిలించడం ఆరంభించింది. ముగ్గురూ ఆ వైపు చూశారు.

"ఏదో సంకేతం అందుతోంది" అరిచింది అఖిల. రోబో నెమ్మదిగా సంకేతాన్ని అందించసాగింది. దాని కోఆర్డినేట్స్ చూస్తూ నిరాశగా చెప్పింది అఖిల. "మన గ్రహం నుంచి కాదు" హఠాత్తుగా రోబో నుంచి ఓ స్వరం వెలువడింది.

"రక్షించండి... రక్షించండి" ముగ్గురూ ఉలిక్కిపడి చుట్టూ చూశారు.

"ఇది శబ్దసంకేతం" అన్నాడు అద్వయిత్.

"రక్షించండి... రక్షించండి. ఇది విశ్వంలో ఏ మూల ఉన్న జీవులయినా విని సమయానికి వచ్చి మిమ్మల్ని రక్షిస్తారన్న ఆశతో ఇస్తున్న సంకేతం. మా గ్రహం నాశనమైపోతోంది. మా నాగరికత అంతరించిపోతోంది. ఉజ్జ్వల నాగరికత మాది. ఆకాశహర్మ్యాలు నిర్మించాం. అనంత అంతరిక్షాన్ని శోధించాం. చివరికి కాంతివేగంతో ప్రయాణించే నౌకలను నిర్మించాం. కానీ మా స్వభావంలోని ద్వేషం, కుళ్ళును అణచలేకపోయాం. స్వార్థంతో ఒకరినొకరు చంపుకున్నాం. ఆ యుద్ధాలవల్ల వాతావరణం కలుషితమయింది. జీవులన్నీ మరణించాయి. నేనూ మరణిస్తున్నాను. ఇది నా చివరి సందేశం. ఎవరైనా మా గ్రహంలో మళ్లీ జీవాన్ని నిలపండి..." సంకేతం సగంలో ఆగిపోయింది.

ముగ్గురూ మౌనంగా ఉన్నారు. వాళ్ల గుండెలు బరువెక్కాయి.

"ఇది మనం ఉన్న గ్రహం నుంచి వెలువడిన సంకేతం" అన్నాడు ఆధ్యాత్మిక్. కిటికీలోంచి బయటకు చూశాడు అద్వయిత్. గ్రహం నిశ్శబ్దంగా, నిర్జీవంగా ఉంది. పైన నక్షత్రాలు మిణుకుమిణుకుమంటున్నాయి.

"నాకు బయటకు వెళ్లాలని ఉంది" లేచాడు ఆధ్యాత్మిక్.

"ఒక్కడివి వెళ్లకు. నేనూ వస్తాను" అన్నాడు అద్వయిత్.

అఖిల కంట్రోల్ పానెల్ దగ్గర కూచుంది. ప్రోటీన్ సూట్లు వేసుకుని ఇద్దరూ గ్రహంపై అడుగిడారు. ఎందుకో వారిద్దరికీ ఉద్విగ్నంగా ఉంది. ఇంతకుముందు అనిపించలేదు కానీ ఇప్పుడెందుకో ఆ గ్రహం శ్వాస పీల్చుకుంటున్నట్టు, ఏదో సంఘటన జరగడం కోసం ఎదురుచూస్తున్నట్టు అనిపిస్తోంది.

చీకట్లో ఉండే ఉద్విగ్నత అని సర్దిచెప్పుకున్నారిద్దరూ.

"ప్రకృతి నిజంగా ఎంత దయాళువో అంత క్రూరమైనది. ఎటువంటి పొరపాటును క్షమించదు" అన్నాడు అద్వయిత్. ఎందుకో అతని హృదయంలోంచి ఏదో వేదన తన్నుకువస్తోంది.

"ప్రకృతి ప్రతీకారం తీవ్రంగా ఉంటుందంటారు. కానీ మనలాంటి జీవులు ఉచ్ఛనాగరికత ఇలా వ్యర్థంగా అంతరించిపోవడం...."

హఠాత్తుగా మాట మధ్యలో ఆగిపోయాడు ఆధ్యాత్మిక్.

ఇద్దరి మనస్సుల్లో ఒకే ఆలోచన.

"అఖిలా... ఇంతవరకూ మనం ఆలోచించింది తప్పు. మనం వార్మ్‌హోల్‌లో ప్రయాణించి కొత్త ప్రాంతం చేరుకున్నామని ఆలోచించాం. కానీ..." ఏదో అద్వయిత్ గొంతుకు అడ్డుపడింది. అతికష్టంమీద ఆధ్యాత్మిక్ వైపు చూశాడు. ఆధ్యాత్మిక్ కదలలేక నిలుచుండిపోయాడు. అతడి చుట్టూ ఉన్న ప్రోటీన్ పొర కరగడం ప్రారంభమైంది. కాదు.. ఆ ప్రోటీన్ పొరలో ఏవో మార్పులు జరుగుతున్నాయి. ఆధ్యాత్మిక్ నిస్సహాయంగా చూస్తున్నాడు అద్వయిత్ వైపు.

* * * * *

మరోసారి తమ గ్రహానికి సంకేతం పంపిన అఖిలకు ఏదో అనుమానం వచ్చింది. పంపిన ప్రతి సందేశం వెనక్కు వచ్చేస్తోంది అంటే అర్థం తమ గ్రహం వారు సందేశాన్ని అందుకునేందుకు ఇష్టపడడం లేనట్టుంది. లేకపోతే సమాచారాన్ని అందుకునేందుకు గ్రహంలో ఎవరూ లేరా? ఆ ఆలోచన రాగానే వణికిపోయింది అఖిల. ఈ గ్రహానికి పట్టిన దుర్గతి తమ గ్రహానికీ పట్టి ఉంటుందా? ఎందుకంటే వార్మ్‌హోల్‌లో ప్రయాణించడం టైమ్‌ట్రావెల్‌లాంటిది. తను ప్రయాణించిన దిశను బట్టి తాము ముందుకుగానీ, వెనక్కుగానీ వెళ్తారు. బహుశా తామూ తమ ప్రయాణంలో భవిష్యత్తులో ఎంత ముందుకు వచ్చేశారంటే... ఆ ఆలోచనను అణచివేసింది అఖిల.

ఇంతలో యథాలాపంగా ఇందాక నాశనమయ్యే గ్రహం నుంచి అందిన సంకేతం కోఆర్డినేట్స్ వైపు చూసిన అఖిల కళ్ళు పెద్దవయ్యాయి.

ఇంతకుముందు చూసినప్పుడు గమనించలేదు. తాను సమాచారం పంపుతున్న కోఆర్డినేట్స్‌కి వీటికి ఒక డిగ్రీ తేడా ఉంది. అంటే... అప్రయత్నంగా ఆమె గొంతులోంచి కేక వెలువడింది. అప్పుడే అద్వయిత్ ఇచ్చిన సమాధానం ఆమెకు అందింది. ఇక ఆగలేకపోయింది అఖిల. తానూ ప్రోటీన్ సూట్ వేసుకుని వ్యోమనౌక వదిలి బయటకు వచ్చింది. బయటకు వస్తూనే వాతావరణంలో మార్పును గమనించింది. ఏదో జరగబోతున్నట్టు ప్రకృతి ఊపిరి బిగబట్టింది.

"ఆధ్యాత్మిక్" పిల్చింది అఖిల.

సమాధానం లేదు. "అద్వయిత్" మళ్లీ పిలిచింది.

సమాధానం లేదు. ఆమెకు కంగారుగా అనిపించింది. అంతలో ఆమె ఆగిపోయింది. అంత చీకట్లోనూ స్పష్టంగా కనిపిస్తున్న వాటిని చూస్తూ ఆగిపోయింది. ఇంతవరకూ రాళ్లురప్పలు, కొండలు గుట్టలు తప్ప మరేమీ లేని నేలపై ఇంత పెద్ద వృక్షాలు ఎలా వచ్చాయి? ఎక్కడినించి వచ్చాయి?

ఆమెకు అర్థం కాలేదు. ఏదో తెలియని భయం ఆమెని ఆవహించింది. వెనక్కు తిరిగి వెళ్లిపోదామనుకుంది. కానీ కాలు కదల్చలేకపోయింది.

ఆమె కాళ్లవైపు చూసింది. ఆమె కాళ్లు నేలలో కూరుకుపోతున్నాయి.

ఎన్నో ఏళ్లు ఆకలిగొన్నట్టు నేల ఆమె కాళ్లను ఆప్యాయంగా ఆత్రంగా

లాగేసుకుంటోంది. అంతలో ఆమె నరనరాన ఏదో విద్యుత్తు పాకుతున్నట్టు తోచింది. ఆమె నరాలు వ్రేళ్లయి భూమిలోకి పోతున్నాయి. ఆమె శరీరం విచ్ఛిన్నమవుతోంది. కాదు... రూపాంతరం చెందుతోంది.

ఆమె మొండెం గట్టిపడుతోంది. ఆమె శరీరంలో ఏవేవో చర్యలు ఆమె ప్రమేయం లేకుండా జరిగిపోతున్నాయి. ఆమె శరీరం బెరడులా మారిపోయింది. అఖిలకు అర్థమయింది. వార్మ్‌హోల్స్ ద్వారా ప్రయాణించి తాము భవిష్యత్తులోకి ప్రయాణించారు.

కొన్ని మిలియన్ సంవత్సరాలు ప్రయాణించారు. నూతన విశ్వంలోకి చేరుకున్నారు. భూమినుంచి ప్రయాణించి విశ్వం చుట్టి వచ్చి మళ్లీ భూమికి చేరారు. తాము చేరేసరికి ప్రకృతి తమకోసం ఎదురుచూస్తోంది. ప్రకృతిని నాశనం చేసిన మనిషినుంచి ప్రతిసృష్టి చేసేందుకు ఎదురుచూస్తోంది. అఖిల మహావృక్షంలా మారి పోయింది. భూమిలో రసాయన చర్యలు ఆరంభమయ్యాయి. అఖిల జుట్టు ఆకులుగా, శాఖలుగా మారిపోయింది. ఒక సన్నని గాలి తరగ వాటిని ఆప్యాయంగా స్పృశించింది. ఆకులు గలగలలాడాయి. పునఃసృష్టికి పురిటినొప్పులు ఆరంభమయ్యాయి!

❊ ❊ ❊

# కీక్... కీక్... కీక్...

**కీ**క్... కీక్... కీక్...

ఒక్క క్షణం తాను ఎక్కడ ఉన్నాడో అర్థం కాలేదు ఓపల్‌కు.

అంతలో అతని ఎదురుగా ఉన్న తెరపై ఎర్రటి అక్షరాలు మిణుకు మిణుకు మనసాగాయి.

'మళ్లీ పనిచేయాల్సిన సమయంలో నీ మెదడు నిద్రకు జారుకుంటోంది. మొత్తం ఈ వారం నీకు కేటాయించిన డెబ్బయి రెండు పనిగంటల కాలంలో ఇంతవరకూ నిద్రవల్ల ఎనిమిది సెకన్లు వ్యర్థమయ్యాయి. మొత్తంగా ఈ వారం నీ అశ్రద్ధవల్ల 59 సెకన్లు వ్యర్థమయ్యాయి. ఏ కారణం చేతనైనా ఇంకో సెకను వ్యర్థమయిందంటే నీకు మళ్ళీ శిక్షణ శిక్ష తప్పదు. నీ మెదడును మళ్లీ ట్యూన్ చేయాల్సి ఉంటుంది."

తెరపై ఎర్రటి అక్షరాలు కనబడుతున్నాయంటే ఏదో ప్రమాదకరమైన హెచ్చరిక అని అర్థం. ఆ హెచ్చరిక చదవడంతోనే ఓపల్ అలర్టయిపోయాడు.

'మళ్లీ ఇంకో మెదడు ట్యూనింగ్ భరించలేడు. ఇంకోసారి మెదడు ట్యూనింగ్‌కి వచ్చిందంటే తన స్థాయిని తగ్గించేస్తారు.'

ఆ ఆలోచన రావడంతోటే వణుకు వచ్చింది ఓపల్‌కు.

అయితే తన మెదడు పని గురించి కాక వేరే ఏదో విషయం గురించి ఆలోచిస్తున్నదన్న విషయం కూడా రికార్డవుతుందన్న గ్రహింపు రావడంతోటే బలవంతంగా తన దృష్టిని 'పని'వైపు మళ్లించాడు.

కీక్.. కీక్... కీక్...

వెంటనే తెరవైపు చూశాడు.

ఒక్క క్షణం భయం విద్యుచ్ఛక్తిలా వెన్నుపూసగుండా ప్రవహించింది.

'కాళ్లు కదుల్చు. రక్తప్రసరణ దెబ్బతీసే స్థితి వస్తోంది.' తెర హెచ్చరించింది. వెంటనే కాళ్లను కదిపి వాటి పొజిషన్ మార్చాడు.

పనిచేసేవాళ్ల శరీరంలో జరిగే మార్పులను పసిగట్టి అవి ప్రమాదస్థాయిని చేరేలోగా హెచ్చరిస్తుంది యంత్రం.

నిజమే. కాళ్ల పొజిషన్ మార్చడం హాయిగా ఉంది.

మళ్లీ దృష్టిని 'పని'వైపు కేంద్రీకరించాడు.

క్వీక్... క్వీక్... క్వీక్...

'నీకు ఆకలి వేస్తోంది' చెప్పింది తెర.

వెంటనే లేచాడు ఓపల్.

గబగబా కాంటిన్‌వైపు అడుగులేయసాగాడు.

పది నిముషాల్లో స్థలం చేరుకోవాలి. తాను వెళ్లేసరికి తన కోసం ప్రత్యేకంగా తయారైన భోజనం సిద్ధంగా ఉంటుంది.

ప్రొద్దుటినుంచీ తన శరీరం ఎంత శక్తిని ఖర్చు చేసింది, ఎన్ని లవణాలు, ఎన్ని విటమిన్లు ఏయే పాళ్లల్లో అవసరం వంటి విషయాలన్నీ లెక్కగట్టి తన శరీరం ఆరోగ్యకరంగా ఉండేందుకు తగిన ఆహారం తయారై ఉంటుంది.

భోజనశాల చేరాడు ఓపల్.

అప్పటికే ఇతర పనివాళ్లు అక్కడ భోజనం ఆరంభించారు. ఒకప్పుడు భోజనశాలల్లో మాట్లాడుతూ, చర్చిస్తూ గోలగోలగా భోజనం చేసేవారట. కానీ ఆధునిక యాంత్రికయుగం' ఆరంభమైనప్పటినుంచీ భోజనం చేసేటప్పుడు నిశ్శబ్దంగా ఉండడం పద్ధతి అయింది.

మాటలవల్ల శక్తి ఖర్చవుతుంది. సమయం వ్యర్థమవుతుంది. అనవసరమైన మాటలవల్ల అనవసరమైన ఆలోచనలు వస్తాయి. కాబట్టి అవసరమైనప్పుడు అవసరమైనంతవరకే మాట్లాడే అనుమతి ఉంటుంది. అందుకే ఓపల్ గదిలోకి అడుగుపెట్టినప్పుడు ఎవరూ తలెత్తి అతనివైపు చూడలేదు. పలకరించలేదు.

కనీసం చేయి కూడా ఊపలేదు. ఎవరి తిండి వాళ్లు గబగబా తినేస్తున్నారు. ఎందుకంటే తినేందుకు నిర్ణీతమైన సమయం ఉంటుంది. అది దాటితే మళ్లీ మెదడు ట్యూనింగ్ ఉంటుంది. తన నిర్ణీతస్థానంలో కూచుంటూనే తినడం ఆరంభించాడు ఓపల్.

ఒకప్పుడు రుచులు చూసేవారట. రుచులకోసమని ఎక్కువగా వేసే పదార్థాలు ఆరోగ్యానికి హానికరం కాబట్టి ఆహారంలో చూడాల్సింది ఆరోగ్యం తప్ప రుచులు కాదని పాలనాధికారులు నిర్ణయించారు. మొదటి ముద్ద నోట్లో పెట్టుకోగానే అప్రియంగా అనిపించింది ఓపల్‌కు. కానీ వెంటనే ఆ ఆలోచనలను తరిమేసి ఆనందకరమైన అంశాన్ని ఊహిస్తూ గబగబా తినేయసాగాడు ఓపల్.

అసలు ఆహారం అప్రియం అన్న ఆలోచన రావడమే ఆశ్చర్యంగా ఉంది ఓపల్‌కు.

తన మెదడు ట్యూనింగ్ ప్రభావం తగ్గుతోందా? చుట్టూ చూశాడు.

సెకనులో వెయ్యవవంతు సేపు తన మెదడులో ప్రవేశించిన ఈ ఆలోచనను ఎవరైనా పసిగట్టారేమోనని భయం. ఎవరి తిండిలో వారున్నారు. గబగబా తిండి పూర్తిచేసి బయటపడ్డాడు ఓపల్.

దారిలో మధ్యాహ్నం తిండిలేకుండా పనిచేసేవాళ్లని చూశాడు. వీళ్ల మెదడు ట్యూనింగ్ అయిదుసార్లు దాటింది.

దాంతో వీళ్లతో కఠినమైన శారీరక శ్రమ చేయిస్తారు. తిండి తక్కువ పెడతారు. ఇక వాళ్లకు వేరే ఆలోచనలు ఉండవు. 'తిండి ఎక్కువైతే పిచ్చి ఆలోచనలు వస్తాయన్నది' గొప్ప సత్యం. తిండిలేనివాడి దృష్టి ఎంతసేపూ తిండి సంపాదనపైనే ఉంటుంది. మరో ఆలోచన వాడి దరిదాపులకు కూడా రాదు.

పని స్థలం చేరగానే 'కీక్... కీక్...కీక్...' అంది తెర.

'ఒక సెకను ఆలస్యం అయింది' చెప్పింది తెర.

వెంటనే పనిలో పడ్డాడు ఓపల్. చకచకా పనిచేయసాగాడు. అతడి మెదడులో పని తప్ప మరే ఆలోచన లేదు. చేతులు అలవాటైన పని నైపుణ్యంతో వేగంగా చేసేస్తున్నాయి.

'ఇవాళ చేయాల్సిన పని అయిపోయింది. రేపటి పని కూడా మిగిలిన అరగంటలో చేయవచ్చు. లేకపోతే వెళ్లిపోవచ్చు' మిలమిలలాడింది తెర.

వెళ్లిపోవాలనే నిర్ణయించుకున్నాడు ఓపల్. ఎందుకంటే ఆ రోజు అతనికి ప్రభుత్వం కేటాయించిన సహచరి ఎలోమినా కూడా సాయంత్రానికల్లా ఇల్లు చేరుకుంటుంది. చాలా రోజులయింది వాళ్లిద్దరూ ఇలా కలసి. వెంటనే అతని శరీరంలో ఉద్రేకం పరవళ్లు తొక్కింది. అంతే... అతని పక్కన ఉన్న నీలితెర రెపరెపలాడింది.

'సమయం కాని సమయంలో లైంగికోద్రేకం కలిగింది. సంవేదనల గదిలోకి వెళ్లు.'

క్షణంలో అతని ఉద్రేకం అదృశ్యమయింది.

ఆ గదిలో విద్యుత్ సంకేతాల వల్ల స్పందనలు కృత్రిమంగా కలిగించి అనవసరమైన ఎమోషన్స్‌ని చల్లార్చేస్తారు.

గమనించనట్టు వెళ్లిపోవాలనుకున్నాడు. కానీ ఒక్కసారి తెరపై కనిపించిందంటే అది తన పేరు మీద రికార్డుల్లో ఎక్కేస్తుంది. ఇప్పటికే చివరి మెదడు ట్యూనింగ్ స్థాయిలో ఉన్నాడు. ఎటువంటి ప్రమాదాల్లో పడదలచుకోలేదు. అయిష్టంగా సంవేదనల గదిలోకి వెళ్లాడు.

కుర్చీలో కూర్చున్నాడు. ఎలక్ట్రానిక్ పరికరాలను తగిలించుకున్నాడు.

* * * * *

నిస్సత్తువగా ఇల్లు చేరాడు ఓపల్. అప్పటికే ఇంట్లో ఎలోమీనా వినోదాన్ని పొందుతోంది.

వినోదాన్ని పొందడం అంటే వ్యక్తి మూడ్‌ని బట్టి ముందు ప్రోగ్రాం అయిపోయిన కార్యక్రమాలుంటాయి. అవి చూసే అర్హత మాత్రమే ఆ వ్యక్తికి ఉంటుంది.

ఆమె ఏం చూస్తోందో తొంగిచూశాడు ఓపల్. వెంటనే గుర్తుపట్టాడు. అవి ఎలోమినా ఎప్పుడూ చూసే కార్యక్రమాలే.

సముద్రంలో పెద్ద పెద్ద అలలు వస్తున్నాయి. ఆ అలలపై సర్ఫింగ్ చేస్తోంది ఎలోమినా.

భౌతికంగా ఆమె కుర్చీలో కూర్చునివున్నా మానసికంగా ఆమె అలలపై తేలుతూ భౌతికంగా ఆ భావనను అనుభవిస్తోంది.

సర్ఫింగ్‌లో మూడోస్థాయివరకే వెళ్లే అర్హత ఉంది ఎలోమినాకు.

సహచరులిద్దరూ కూడా అనవసరంగా మాట్లాడకూడదు. అనవసర మాటలు మనస్థాపానికి కారణం అవుతాయి. ఇంట్లోని మనస్థాపాలు పనిమీద ప్రభావం చూపిస్తాయి.

కాబట్టి పనిమీద శ్రద్ధ ఉండాలంటే వ్యక్తికి ఇంట్లో ఎటువంటి అసంతృప్తులు ఉండకూడదు. అందుకే ప్రభుత్వం సహచరులుగా ఎవరెవరు ఉండాలో ఎంతో జాగ్రత్తగా నిర్ణయిస్తుంది. సహచరులిద్దరి కదలికలను నిర్ణయిస్తుంది. ఇద్దరి మధ్య ఎటువంటి అనుబంధం ఏర్పడకుండా జాగ్రత్తగా వారిని నియంత్రిస్తుంది. ఎవరి మధ్య అయినా అనుబంధం ఏర్పడినట్లు తెలిస్తే వారికి శిక్ష విధించి వేరుచేస్తుంది.

వారి మెదడు స్థాయిని బట్టి మళ్లీ ట్యూనింగ్ చేస్తుంది. గదిలోకి చేరిన ఓపల్‌కి విసుగ్గా ఉంది.

కానీ మరోవంక ఈ విసుగు భయం కలిగిస్తోంది.

ఎందుకంటే విసుగు భావన తనలోకి వస్తోందంటే ఎక్కడో ఏదో లోపం జరిగి ఉండాలి.

తెరముందు కూర్చుని చదరంగం మీట నొక్కాడు.

"ఎవరితో ఆడతావు?" ప్రశ్న వినిపించింది.

"పోలన్‌స్కీతో" చెప్పాడు ఓవల్.

"నీ స్థాయికన్నా ఎన్నో రెట్లు ఎక్కువ పోలన్‌స్కీది. అతనితో ఆడాలనని కోరుకోవడం వల్ల నీ మొత్తం మార్కులనుండి ఒక మార్కు తగ్గించడం జరుగుతుంది" వినిపించింది.

ఓపల్‌కు చెమటలు పట్టాయి. ఓపల్ స్థాయి ప్రకారం అతను ఆడాల్సిన ఆటగాళ్ళు నిర్ణయం అయిపోతారు.

వారితో కాక వేరే వాళ్లతో ఆడాలన్న కోరిక కలగడం, మెదడు పరిమిత పరిధిని దాటి ఆలోచిస్తోందని అర్థం. అంటే తనకు మళ్లీ ఓ మార్కు తగ్గిపోతుంది. తనకేమవుతోంది?

మెదడు ఆలోచిస్తోందా? అందుకే జాగ్రత్తగా తనకు కేటాయించిన లిస్టుల్లోంచే

ఓ ఆటగాడిని ఎంచుకున్నాడు.

కానీ ఆట బోరుగా ఉంది. ఎందుకంటే వీళ్లతో బోలెడన్నిసార్లు ఆడాడు. వాళ్లు వేసే ప్రతి ఎత్తూ తనకు తెలుసు. తన మెదడు గుర్తుంచుకుంటోంది. క్షణంలో ఆ ఆలోచనల నుంచి దృష్టి మళ్లించాడు. కార్‌రేస్ ఆట మీట నొక్కాడు. జాగ్రత్తగా తన స్థాయి వేగాన్నే ఎంచుకున్నాడు.

అతనికి నిద్రపోవాలని ఉంది. కానీ నిద్రసమయం ముందే నిర్ణయమైపోతుంది. అంతవరకూ నిద్రపోవాలన్నా రాదు.

'డాన్స్ చూడాలి' మీట నొక్కాడు ఓపల్.

వెంటనే అతని కళ్లముందు నృత్యం ఆరంభమయింది. ఎందుకో ఆ నృత్యం చూస్తుంటే ఓపల్‌లో మళ్లీ ఉద్రేకం ఉరకలు వేయసాగింది. అతడి కళ్లముందు వేలవేల ఇంద్రధనస్సులు వివిధ భంగిమల్లో గిరగిర తిరగసాగాయి. ఆ అనేక ఇంద్రధనస్సుల వర్ణాల మిశ్రమాలు వింత వింత రంగులను సృష్టించసాగాయి. అతని శరీరం తేలికైపోయింది. ఎక్కడికో ఎగురుతున్నట్లు తోచింది. వెంటనే కుర్చీలోంచి లేచాడు. వడివడిగా లేచి ఎలోమినా గదివైపు వేగంగా అడుగులు వేయసాగాడు.

❄ ❄ ❄ ❄ ❄

'సమయం వేగంగా పరుగెడుతోంది' అనుకుంది ఎలోమినా.

ఆమెకు స్వర్గసుఖాలు అనుభవిస్తున్నంత ఆనందంగా ఉంది.

క్వీక్... క్వీక్... క్వీక్...

తెరపై అక్షరాలు మిలమిల మెరవసాగాయి.

'నిద్రపోయే సమయం అయింది'

ఆమె సంతోషంగా మంచం చేరింది.

కళ్లు మూసుకోబోతుంటే గదిలో శబ్దం అయింది.

ఆమెకేమీ అర్థం కాలేదు. ఎందుకంటే నిద్ర సమయంలో శబ్దాలుండవు. మనిషి ఎంత హాయిగా నిద్రపోతే అంత ఆరోగ్యంగా ఉంటాడు. మరుసటి రోజు అంత ఉత్సాహంగా పనులు చేస్తాడు. అందుకే నిద్రకి అంత ప్రాధాన్యం.

పైగా నిద్రపోయే సమయంలో శబ్దమయితే ఏం చేయాలో ఆమెకి తెలియదు.

అందుకే అయోమయంగా శబ్దం వచ్చినవైపు చూసింది ఎలోమినా.

గది తలుపు దగ్గర ఆమెవైపే విచిత్రంగా చూస్తున్నాడు ఓపల్.

అతడిని చూడగానే ఆమెకు అర్థమైంది. ఆమె మెదడులో ప్రమాదసంకేతం వెలిగింది.

"ఎలోమినా" అంటూ ఆమె దగ్గరకు వచ్చాడు ఓపల్.

"నిద్ర సమయం అయింది."

"ఎలోమినా ఐ లవ్‌యూ" అన్నాడు ఓపల్ ఉద్రేకంగా అడుగు ముందుకేస్తూ.

"అనవసరమైన మాట. ఇది సమయం కాదు. ఇంకో రెండు రోజుల తరువాత

రా” అంది ఎలోమినా.

ఆమె మాటలు విన్నట్టు లేదు. అలాగే అడుగు ముందుకు వేసి ఆమెను పట్టుకోబోయాడు.

ఆమె శరీరాన్ని తాకుతూనే అతనికి శరీరంలోకి కొన్ని వేల వోల్టులు విద్యుత్ ప్రవహించినట్లయింది.

పెద్దగా అరిచి వెనక్కు అడుగువేశాడు.

సమయాన్ని అతిక్రమించి లైంగిక భావనలకు లొంగినవాళ్లకు శిక్ష అది.

అతనివైపు అయోమయంగా చూసింది ఎలోమీనా.

అతని ఉద్రేకం, అతని ఆత్రం ఆమెకు అయోమయంగా ఉంది. ఆమెకు అర్థమయిందల్లా 'నిద్రసమయం అయింది. ఆ సమయాన్ని దాటి మేలుకుంటే మళ్లీ తెల్లారి సరిగ్గా పనిచేయడం కష్టమవుతుంది' అని.

అందుకే క్షణంలో ఆమె మంచంమీద పడి నిద్రలోకి జారుకుంది.

* * * * *

ఒళ్లంతా ఇంకా విద్యుత్ పాకుతున్నట్లే ఉంది ఓపల్‌కు.

ఒక్క నిముషం సేపు మంచంపై పడి గాఢనిద్రలోకి జారుకున్న ఎలోమినా వైపు చూశాడు.

ఈ మట్టిముద్ద కోసమా తనంత ఆవేశానికి లోనయింది? అసలేమయింది తనకు?

తన మెదడుకు ట్యూనింగ్ తప్పదని ఓపల్‌కు అర్థమైపోయింది. కానీ తప్పయినా... అందువల్ల తనింక క్రిందిస్థాయి కఠినమైన పనులు చేస్తూ బరువైన బతుకు బతకాల్సి వస్తుందని తెలిసినా ఆ ఉద్రేకం మాత్రం ఎంతో బాగున్నట్టుంది. ఆ క్షణకాలం తాను శక్తివంతమైన మనిషిలా తోచింది.

కానీ... కానీ...

నెమ్మదిగా తన గదిని చేరుకున్నాడు ఓపల్.

అప్పటికే తెరపై 'నిద్రసమయం దాటింది' అన్న అక్షరాలు రెపరెపలాడుతున్నాయి. అతని పెదవులపై చిరునవ్వు నిలిచింది. ఇప్పుడిక ఏం జరిగినా భయం లేదు. మంచంపై పడుకున్నాడు. ఇక రేపెలాగో అన్న ఆలోచన లేదు అతనికి.

ఎందుకంటే ఆ రేపు తప్పనిసరిగా అనుభవించక తప్పదని అతడికి తెలుసు.

* * * * *

నిశ్శబ్దంగా ఓ రోబో గదిలోకి వచ్చింది. నిద్రపోతున్న ఓపల్ తలను తెరిచి మెదడులోంచి ఓ చిప్‌లాంటి పదార్థాన్ని తీసింది. దాని స్థానే మరో చిప్‌ను ఉంచింది.

ఆ తరువాత ఎలోమినా గదిలోకి వెళ్లి ఆమె మెదడులోని చిప్‌ను శుభ్రపరచి మళ్లీ పెట్టేసింది రోబో.

ఎంత నిశ్శబ్దంగా వచ్చిందో అంత నిశ్శబ్దంగా వెళ్లిపోయింది.

* * * * *

"ఈ మనుష్యులు ఇంతే. వీళ్లు ఎన్నటికీ బాగుపడరు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఆలోచించకుండా ఉండలేకపోతున్నారు. భావనలకు, ఆవేశాలకు లొంగకుండా ఉండలేకపోతున్నారు" నిర్భావంగా అంది కంట్రోల్ గదిలోని తెరపై అన్నీ చూస్తున్న రోబో.

"వీళ్ల చరిత్రలో చూస్తే ఎన్నెన్నో విజయాలు సాధించారు గానీ తమ ఎమోషన్స్‌ను గెలవలేకపోయారు" చరిత్ర రోబో అది.

"అందుకేగా వీళ్లు ఇంత తెలివితేటలు ఉండి కూడా మనకు బానిసలయ్యారు" గర్వంగా అంది లైబ్రేరియన్ రోబో, 'జ్ఞాపకాల గ్రంథాలయం' నుండి ఓపల్ జ్ఞాపకాలను తొలగిస్తూ.

* * * * *

'క్వీక్... క్వీక్... క్వీక్...'

కళ్లు తెరిచాడు తూపల్.

"నిద్రలే... పనికి సమయమయింది" కీచుమంది తెర.

గబగబా తయారుకాసాగాడు ప్రస్తుతం తూపల్... ఒకప్పటి ఓపల్ అంతకు ముందరి... క్వీక్... క్వీక్... క్వీక్..!

* * *

# మాయా ప్రపంచం

('వర్చువల్ వరల్డ్' అంటే 'మాయాప్రపంచం'. మన సమాజానికి కొత్తగానీ, ఇప్పటికే పాశ్చాత్య సమాజంలో అత్యంత ప్రచారం అయి, సమస్యాత్మకంగా పరిణమిస్తున్న సమస్యను ప్రదర్శిస్తుంది ఈ కథ. పాశ్చాత్య దేశాల్లో ఇంటరాక్టివ్ వీడియో ఆటలు ప్రధాన సమస్యగా ఎదుగుతున్నాయి. వ్యాపారసంస్థలు పోటీలు పడి ఒక ఆటను మించి మరో ఆటను సృష్టిస్తున్నాయి. ఈ ఆటలు వర్చువల్ టెక్నాలజీ ఆధారంగా ఎదిగాయి. వర్చువల్ అంటే మాయ. అది ఉన్నట్టే అనిపిస్తుంది కానీ ఉండదన్నమాట. నిజం అనిపిస్తుంది కానీ భ్రమ అన్నమాట. ఉదాహరణకు హైదరాబాద్‌లో కంప్యూటర్ ముందు కూర్చున్న వ్యక్తి వర్చువల్ సైబర్‌స్పేస్ ద్వారా అమెరికాలోని లైబ్రరీలోకి స్వయంగా ప్రవేశించి నచ్చిన పుస్తకాలను ఎంచుకుని అక్కడే కూచుని చదవవచ్చు. ఇదే సాంకేతికమాయ 'వర్చువల్ టెక్నాలజీ'. ఈ టెక్నాలజీ ఆధారంగా మొదటిసారి ఆటలు తయారుచేసింది 1971లో ఆర్పానెట్ (ప్రస్తుతం ఇంటర్నెట్). 1995లో త్రీడీ ఆన్‌లైన్ చాటింగ్ ఆరంభమైంది. 1996లో ప్రేక్షకులు (యూజర్స్) పాత్రలయి ఆడే ఇంటరాక్టివ్ ఆటలు మొదలయ్యాయి. 1997లో ఎలక్ట్రానిక్ ఆర్ట్స్ అనే సంస్థఅల్టిమా ఆన్‌లైన్ అని బహు ఆటగాళ్లు ఆన్‌లైన్‌లో ఆడే ఆటను తయారుచేసింది. దీనికి పోటీగా సోనీవారు ఎవర్‌క్రెస్ట్, మైక్రోసాఫ్ట్‌వారు ఆషెరన్స్ కాల్ అనే ఆటలు తయారుచేశారు. అమెరికా ప్రజలు ఈ ఆటల్లో మునిగితేలేలోగా సిమ్స్ ఆన్‌లైన్ అనే ఆట వచ్చింది. అమెరికన్లు సర్వం మరిచి ఈ ఆటలో పాత్రలై వర్చువల్ జీవితాలు జీవిస్తున్నారు. ఇవి కొరియా ప్రజలను ఎంతగా ఆకర్షిస్తున్నాయంటే వయసుతో నిమిత్తం లేకుండా లీనియేజ్ అనే ఆట ఆడుతూ తమ తీరని కోరికలను తీర్చుకుంటున్నారు. ఈ ఆటను రెండు మిలియన్స్ పైగా కొరియన్ ప్రజలు ఆడుతున్నారు. ప్రతి సాయంత్రం లక్షమంది కొరియన్లు పనులు మానేసి ఈ ఆటలో పడి ప్రపంచం మరిచిపోతున్నారు.

ఈ ఆటల్లో ఎంతగా తాదాత్మ్యం చెందుతున్నారంటే ఆటలో తనని ఓడించినవారిని

జీవితంలో వెతికిపట్టుకుని చంపడం కొరియాలో సర్వసాధారణమైపోయింది. ఆఫ్‌లైన్ పి.కె. అన్న పదం కొరియాలో పుట్టింది. ఇక స్పిన్‌మాస్టర్ లిమిటెడ్ అనే సంస్థ క్యాచ్-ఎ అన్న రసాయనం ద్వారా బుడగజీవితాన్ని ఐదునిముషాలకు పెంచింది. కానెస్టా, వైకెచి అనే సంస్థలు సంయుక్తంగా వర్చువల్ కీబోర్డును తయారుచేశాయి. ఈ కథలో వర్ణించిన జూడీ కూడా ఈ అంశంపై ఆధారపడిందే. 1996లో జపాన్‌కు చెందిన విజువల్ సైన్స్‌లాబ్ (విఎస్‌ఎల్)వారు క్లోకోడేట్ అనే వర్చువల్ పర్సన్‌ను తయారుచేశారు. ఈ మాయలేడి మోహంలో పడి జపనీయులు సర్వం మరిచిపోయారు. ఆమె మాయ అని తెలిసి కూడా ప్రేమలో పడి డేట్ కోసం పోటీలు పడ్డారు. ఈనిజాల ఆధారంగా భవిష్యత్తులో పిల్లలపై ఉండే ప్రభావం, మారే సామాజిక పరిస్థితులను ఊహించి సృజించిన సైన్స్ ఫిక్షన్ కథ మాయాప్రపంచం.)

**ప**ధ్నాలుగేళ్ల ఏంజిమ్ బుర్ర పగిలిపోతోంది. ఎవరో తనకి బెదిరింపు సందేశాలు పంపుతున్నారు. చంపేస్తామని బెదిరిస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి ఎక్కడ్నించి వస్తున్నాయో తెలియడం లేదు. వర్చువల్ డిటెక్టివ్ ట్రీం సహాయం కోరాడు ఏంజిమ్.

కానీ అతని భయం తగ్గడం లేదు. ఇటువంటి బెదిరింపుల గురించి తన మిత్రుల ద్వారా విన్నాడు. ఇంటరాక్టివ్ వర్చువల్ ఆటలలో మనుషులు స్వయంగా పాత్రలై ఆడే వీలుంటుంది. వర్చువల్ అంటే మాయలాంటిది. వ్యక్తి తన గదిలో కంప్యూటర్ ముందు కూచుని ఉంటాడు భౌతికంగా. కానీ తెరపై జరిగే సంఘటనల్లో ఓ పాత్ర పరకాయ ప్రవేశం చేసి తానే ఓ పాత్ర అయిపోయే అవకాశం ఉంటుంది. ఈ వర్చువల్ గేమ్స్ ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజాదరణ పొందడం ప్రారంభించాయి. ఎందుకంటే మనుషుల మనస్సులలో అణగిఉన్న అనేక ఆవేశాలు, కోరికలు ఈ ఆటల ద్వారా తీరే అవకాశం ఉంది. గతంలో మనుషులు తమ భావావేశాన్ని ప్రదర్శించే ఇతరుల కళాప్రదర్శన చూసి సంతృప్తిపడేవారు. పాత్రలతో తాదాత్మ్యం చెందేవారు. నాటకాలు, సినిమాలు ఆ కాలంలో ప్రజలను కలల లోకానికి తీసుకువెళ్లే సాధనాలు అయ్యాయి. కానీ వర్చువల్ ఆటలు వచ్చాక అన్నీ వెనుకబడ్డాయి. వర్చువల్ ఆటలు పలురకాలు. కానీ అన్నిట్లో ప్రేక్షకులే పాత్రధారులు. నచ్చిన పాత్ర వేస్తూ ఆ పాత్ర జీవితాన్ని తాను జీవించవచ్చు.

ఇక సాహసక్రీడలకు కొదువే లేదు. ఓ భవంతిలో రహస్యంగా నిధి ఉంటుంది. ఆ నిధిని సాధించాలి. ఈ ఆటలో ప్రపంచం నలుమూలలనుంచీ ఉత్సాహంగా ఆడేవారు పాల్గొనేందుకు ఫీజు చెల్లిస్తే చాలు. తనకు నచ్చిన పాత్ర అయిపోవచ్చు. నిధి సాధించడం కోసం జట్లుగా ఏర్పడి వాళ్లు ప్రత్యర్థులతో పోరాడేవారు.

అంటే ఒకరినొకరు చూసుకోనివారు, పరిచయం లేనివారు ఏ ప్రాంతంలో ఉన్నారో తెలియనివారు ప్రాణాలను ఫణంగా పెట్టి ఆటలు ఆడుతున్నారన్నమాట. దీనివల్ల ప్రజల మధ్య సంఘీభావం పెరుగుతోందని సామాజిక శాస్త్రవేత్తలు

అభిప్రాయపడుతున్నా ఊహించని దుష్పరిణామాలు కలగసాగాయి. జట్లుగా కట్టినవాళ్లు మిత్రులవుతున్నారు. కానీ ప్రత్యర్థులు శత్రువులవుతున్నారు. ఆన్‌లైన్ ఓటమిని భరించలేనివారు ప్రత్యర్థులెవరో వెతికి మరీ పట్టుకుని చంపుతున్నారు. శాస్త్రవేత్తలు ఈ రకమైన హింసకు ఆన్‌లైన్ పికె (ప్లేయర్ కిల్లింగ్) అని నామకరణం చేశారు. దీంతో ఆటగాళ్లని రక్షించే వర్చువల్ డిటెక్టివ్‌లు అవసరమయ్యారు. ఆటగాళ్లు డబ్బులిస్తే ప్రత్యర్థిని వెతికి పట్టుకుని చంపే వర్చువల్ గూండాలు పుట్టుకొచ్చారు. ఇదంతా ఏంజిమ్‌కు తెలుసు. అందుకే అతనికి భయం ఎక్కువైంది. వర్చువల్ గేమ్ నిన్‌చాపై దృష్టిని కేంద్రీకరించలేకపోతున్నాడు.

అతడి మనస్సు గతంలో తాను ఆడిన ఆటల గురించి ఆలోచిస్తోంది. ఎవరినైనా తాను ఓడించాడా? చంపాడా? ఏమీ గుర్తుకురావడం లేదు.

అంతలో అతనికి గుర్తుకువచ్చింది. జూడీ తనని కలుస్తానంది. సమయం చూశాడు. ఇంకా ఐదునిముషాలుంది. అయితే అతని దృష్టి చెదరడంతో నిన్‌చా అతడిపై దూకి మెడకోసేసింది.

ఆట అయిపోయింది, వెంటనే జూడీ స్పేస్ తెరిచాడు. జూడీ ఒక వర్చువల్ పర్సన్, అంటే, మాయమనిషి, కానీ ఆమె అందం చూసిన తర్వాత ఆమె మాయ అని ఎవరూ నమ్మరు.

పైగా వర్చువల్ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం వల్ల ఆమె మాయ అయినా నిజంలాగే అనిపిస్తోంది. ఆమెతో సమయం గడిపేందుకు ప్రపంచవ్యాప్తంగా కొన్ని బిలియన్ల కొద్దీ మనుషులు పోటీలు పడడంతో ఆమెను సృష్టించిన కంపెనీ ఒక రకంగా ప్రపంచంపై అధికారం సాధించింది. ఆమెతో పరిచయం కోసం వెయిటింగ్ లిస్ట్ సంవత్సరాలు దాటింది. ఇంకా ఎంతోమంది వర్చువల్ వర్కర్లున్నా జూడీ డిమాండ్ పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. తెరపై జూడీ కనిపించింది.

ఏంజిమ్ సర్వం మరచిపోయాడు.

❄ ❄ ❄ ❄ ❄

"నీ సమయం అయిపోయింది. నన్ను మళ్లీ బుక్ చేసుకోవాలి" వగలు పోతూ చెప్పింది జూడీ. ఏంజిమ్ గుండె బాధతో నిండిపోయింది.

ప్రతిసారీ ఇంతే. జూడీతో గడిపిన సమయం క్షణాల్లో ఎగిరిపోతుంది. మనసు ఆనందంతో నిండిపోతుంది. తాను తాను కాదు. ఆనందప్రవాహం అనిపిస్తుంది. కానీ జూడీ నిర్దయురాలు. ఆమెకి ఎవరితో ఎటువంటి అనుబంధం లేదు. ఎటువంటి మానసిక సాంగత్యం లేదు. మాట్లాడినంతసేపు ప్రేమగా మాట్లాడుతుంది. మాటలైపోగానే మరచిపోతుంది. తరువాత వారితో ఇలాగే మాట్లాడుతుంది.

మళ్లీ తన సమయం వచ్చేవరకూ తాను ఆమెని మరచిపోలేదు. ఆమెకోసం తపిస్తాడు. ఆమెతో గడిపిన మధురానుభూతులను స్మరిస్తూ బ్రతుకుతాడు.

జూడీ మాయ అని తెలిసి కూడా బిలియన్ల కొద్దీ మనుషులు జూడీతో

అనుబంధం పెంచుకుంటున్నారు. వాళ్లలో తానూ ఒకడినని ఏంజిమ్‌కు తెలుసు.

కానీ... జూడీ వెళ్లిపోయింది. ఏంజిమ్ ప్రపంచం శూన్యమైపోయింది. మాయతెరపై అక్షరాలు మిణుకుమిణుకుమంటున్నాయి. 'జూడీని వ్యక్తిగతంగా కలిసేందుకు అభ్యర్థించారు. మీ సంఖ్య 14167, త్వరలో మీకు సమాచారం అందుతుంది.'

ఒక్కసారిగా ఏంజిమ్‌లో ఆశలు చిగురించాయి.

'వర్చువల్'గా జూడీని ఎంత కలిసినా సంతృప్తి కలగకపోవడంతో కంపెనీవారు జూడీనీ పర్సనల్‌గా కలిసే పథకం ఏర్పాటుచేశారు. కొన్ని డబ్బులు కట్టి రిజిష్టర్ చేసుకోవాలి. తమ వంతు వచ్చినప్పుడు ఎక్కడ కలవాలో చెప్తారు. వెళ్లి మాయ జూడీని నిజజీవితంలో కలవాలి. జూడీని నిజంగా ఎదురుగా చూడవచ్చు. జూడీ తన ఎదురుగా ఉంటుంది. ఆమె కళ్లల్లోకి తాను నిజంగా చూస్తాడు.

ఏంజిమ్‌కు అస్థిమితంగా ఉంది.

జూడీని తలచుకున్నప్పుడల్లా ఇలా ఉంటుంది. ఆమెని తలుచుకోని క్షణం లేదు. ఇంతలో ఏదో సమాచారం వస్తున్న సూచన వినిపించింది.

అప్పుడే జూడీని కలిసే అవకాశం వచ్చిందా? ఆశగా, ఆత్రంగా తెరవైపు చూశాడు. అక్కడ కనబడుతున్న అక్షరాలు చూడగానే భయంతో ఏంజిమ్ రక్తం గడ్డకట్టింది.

"జాగ్రత్త... జూడీ నాది... ఆమె వెంటపడ్డావో..." వెంటనే కీ బోర్డును మొబైల్‌లోకి నెట్టేశాడు ఏంజిమ్.

అతని శరీరం వణుకుతోంది.

వర్చువల్ టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందిందంటే కీ బోర్డులు ఇప్పుడు మొబైల్‌లో పట్టేంతగా కుంచించుకుపోయాయి. నిజానికి కీబోర్డు కూడా వర్చువల్ కీబోర్డే. మొబైల్‌లో ఉన్న ఇన్‌ఫ్రారెడ్ కాంతిలోని వేళ్ల కదలికలవల్ల మనం టైప్ చేయాలనుకున్నది కంప్యూటర్‌కు తెలిసిపోతుంది. పనయిపోగానే ఇన్‌ఫ్రారెడ్ కాంతిని ఆపేస్తే చాలు కీబోర్డు మొబైల్‌లో ఒదిగిపోతుంది. అయితే ఏంజిమ్, ఇప్పుడు సాంకేతిక అభివృద్ధిగురించి ఆలోచించే స్థితిలో లేడు. అతడి మనసంతా బెదిరింపుతో నిండిపోయింది. 'అయితే ఈ బెదిరింపులు ఆటవల్ల కాదు, జూడీ వల్లనన్నమాట' అనుకున్నాడు. ఈ బెదిరింపులు ఇంతటితో ఆగుతాయా... లేక ఆఫ్‌లైన్ పికె వరకూ వెళ్తాయా? ఏంజిమ్ తన గది వదలి బయటకు వచ్చాడు. తల్లిదండ్రుల గదిలోకి తొంగిచూశాడు. ఎప్పటిలాగే వాళ్లిద్దరూ ఆన్‌లైన్ ఇంటరాక్టివ్ ఆట 'ప్రేమ కుటుంబం' ఆడుతున్నారు.

ఏంజిమ్ తండ్రి ఓ కుటుంబంలోని ఇరవై ఏళ్ల కుర్రవాడి పాత్రలో లీనమైపోయాడు. తల్లి ప్రత్యర్థి కుటుంబంలో యువతి పాత్రలో మునిగిపోయింది.

ఇద్దరూ పక్కపక్కనే ఉన్నారు. కానీ కంప్యూటర్‌లో వాళ్లు వేర్వేరు మనుషులు.

వేర్వేరు ప్రపంచాలు. వేర్వేరు జీవితాలు.. వేర్వేరు అనుభవాలు.

వాళ్లు ఇప్పుడు పలకరని, పలకరించినా వాళ్లకి తన సమస్య అర్థం కాదని ఏంజిమ్‌కు తెలుసు. వర్చువల్ ఇంటరాక్టివ్ ఆటలు ప్రజలను ఆకర్షించినప్పటినుంచీ ప్రభుత్వం ప్రసక్తి లేకుండా పోయింది. వర్చువల్ కంపెనీలు ప్రజల జీవితాలను నిర్దేశిస్తున్నాయి. ఒకప్పుడు తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు గురించి రాత్రింబవళ్లు తెగ బెంగపడేవారు. ఇప్పుడు వారికి సంతానం గురించి బెంగలేదు. వారి భవిష్యత్తు గురించి ఆందోళన లేదు. వారి దృష్టి అంతా తామాడే వర్చువల్ గేమ్స్‌లో పాత్రలకి ఏమవుతుందోనన్నదే బెంగ.

తాతయ్య, అమ్మమ్మ గదిలోకి తొంగిచూశాడు.

వాళ్లిద్దరూ వర్చువల్ ఇంటరాక్టివ్ ఆట ఆడుతున్నారు. అమ్మమ్మ ప్రేమ విఫలమైనట్టు ఉంది. ఏడుస్తోంది. మరోగదిలో తాతయ్య, నాన్నమ్మలు అదే స్థితిలో ఉన్నారు. ఏంజిమ్‌కు పిచ్చిపట్టినట్టుంది.

ఎవరితోనైనా తన బాధ చెప్పుకోవాలన్పించింది. కానీ ఇక్కడెవరికీ తన బాధ పట్టలేదు. ఎవరి లోకం వాళ్లది. మళ్లీ తన గదిలోకి వచ్చాడు ఏంజిమ్. లాభం లేదు. ఎవరో ఒకరితో తన బాధ చెప్పుకోందే మనశ్శాంతి లేదు. వర్చువల్ కౌన్సిలర్ సైట్‌లోకి వెళ్లాడు. కానీ నచ్చలేదు. జూడీతో మాట్లాడాలని ఉంది. ప్రపంచంలో జూడీ తప్ప తన బాధను తొలగించేవారు ఎవరూ లేరు. కానీ జూడీని కలవడం అంత సులభం కాదు. జూడీకి సమయం దొరికి, తన వంతు వచ్చేవరకూ ఎదురుచూడాలి. ఇతర వర్చువల్ లేడీలతో బాధ చెప్పుకోవాలని ప్రయత్నించాడు.

కానీ జూడీని చూసిన తర్వాత మిగతా అంతా కృత్రిమంగా అనిపిస్తున్నారు.

“జూడీ... జూడీ” అనుకుంటూ వర్చువల్ చాటింగ్ గదిలోకి వెళ్లాడు. అక్కడ తనలాంటి వారు ఎవరైనా కలుస్తారని ఆశ.

ఇంతలో తెరపై మళ్లీ బెదిరింపు కనిపించింది.

“నా మాటలను ఖాతరు చేయడం లేదు. జూడీ నాది. ఆమెని తలిస్తే నీ పని ఖతం...” ఎందుకో అది చూడగానే ఏంజిమ్ వెన్నులోంచి చలి పుట్టుకొచ్చింది.

గబగబా చాటింగ్ గదిలోకి వెళ్లాడు.

అప్పటికే గది కిటకిటలాడుతోంది. అక్కడున్న వాళ్లంతా అయిదునుంచి పదిహేనేళ్లలోపువారే. అందరూ జూడీ గురించి చర్చించుకుంటున్నారు.

అక్కడ ఎవరితోనూ తన బాధ చెప్పుకోలేడని ఏంజిమ్‌కు తెలుసు. తనని బెదిరిస్తున్నవాళ్లు వీళ్లలోనూ ఉండవచ్చు. అందుకే బయటకు వచ్చేశాడు. తనని తాను మరచిపోవాలి. మరో వర్చువల్ ఆటను ఆరంభించాడు.

ఆ ఆటలో ఏంజిమ్ శక్తివంతుడు, ధైర్యశాలి అయి శత్రువులను చీల్చి చెండాడసాగాడు. ఆ ఆటలో అందరూ ఏంజిమ్ పాత్రను చూసి భయపడసాగారు.

ఏంజిమ్‌కు గర్వంగా అనిపించింది. ఏదో కసి తీరినట్టు అనిపించింది.

శత్రువులను కాల్చేస్తూంటే సంతృప్తిగా అనిపించింది.

ఇంతలో ఏంజిమ్‌కు ఆనందం కలిగించే సంకేతం వచ్చింది.

"జూడీ నిన్ను కలుస్తుంది. జూడీని కలిసేందుకు ముందే రిజర్వు చేసుకున్నవారు రాలేకపోవడం వల్ల నీకు ఈ అవకాశం లభిస్తోంది. వదులుకోకు. త్వరగా ఫీజు కట్టి జూడీని నీ స్వంతం చేసుకో" తెరపై ఆ సంకేతం చూడగానే ఒక్కసారిగా ఏంజిమ్‌కు గాల్లో ఎగురుతున్నంత ఆనందం కలిగింది.

జూడీ మాయమనిషి అని మరిచిపోయాడు. ఇప్పుడతని దృష్టి ఫీజు కట్టడంపై పడింది. కేవలం కొద్ది నిముషాలే ఉంది. గబగబా బబ్బుల్ గదివైపు పరిగెత్తాడు. ఇంట్లో డబ్బులు ఎక్కడుంటాయో ఏంజిమ్‌కు తెలుసు. ఒకప్పుడు జీవితాన్ని క్షణంలో పేలిపోయే బుడగలతో పోల్చేవారట. కానీ ఇప్పుడు శాస్త్రవేత్తలు బబుల్ సిమెంట్ తయారుచేశారు. దాంతో బుడగలు సంవత్సరాల తరబడి పేలిపోకుండా ఉంటాయి. బుడగల గదిలో బుడగల అడుగున రహస్యంగా డబ్బు దాచారు. ఏంజిమ్ వెళ్లి తనకు కావలసిన డబ్బు తీసుకున్నాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియాలంటే వాళ్లు ఆట వదిలి రావాలి. ఆట డబ్బులు కట్టాల్సినప్పుడు తప్ప వారు ఈ వైపునకు రారు. అప్పటి సంగతి అప్పుడు చూసుకోవచ్చు. జూడీని కలవాలి. డబ్బు పట్టుకువచ్చి కంప్యూటర్ ముందుంచాడు. క్షణాల్లో డబ్బు మాయం అయిపోయింది. కంపెనీ అకౌంట్‌లో జమ అయిపోయింది. వెంటనే తెరపై అక్షరాలు కనిపించాయి.

"కంగ్రాట్స్... సాయంత్రం అయిదు నుంచి అయిదు పదిహేను వరకూ వర్చువల్ ప్యాలెస్‌లో టేబుల్ నెంబర్ 15 దగ్గర జూడీ నిన్ను కలుస్తుంది. టైంకి రావాలి. టైంకి వెళ్లిపోవాలి. ఎందుకంటే జూడీకి ఇంకా బోలెడన్ని అప్పాయింట్‌మెంట్లు ఉన్నాయి. నీ సమయం అయిపోయిన తర్వాత ఇంకో పదినిముషాలు అని బ్రతిమిలాడవద్దు. బ్రతిమిలాడితే భవిష్యత్తులో జూడీతో అప్పాయింట్‌మెంట్ నీకు దొరకదు. జూడీ మిత్రుల జాబితాలోంచి నీ పేరు రద్దుచేయబడుతుంది."

గబగబా చదివేశాడు ఏంజిమ్. ఆనందంతో అతని మనస్సు ఆకాశాన్ని తాకుతోంది. జూడీతో పదిహేను నిముషాలు. తన జన్మ ధన్యం అయిపోయింది.

పదిహేను నిముషాలు దొరకడం కోసం ఇంతగా ఎదురుచూశాడు. జూడీని కలిసిన తర్వాత పదిహేను నిముషాల్లో సంతృప్తిపడడం కుదరని పని. కానీ బ్రతిమిలాడితే మొదటికే మోసం వస్తుంది. కాబట్టి బ్రతిమిలాడవద్దు.

తనకి తాను చెప్పుకున్నాడు ఏంజిమ్. అయితే ఇల్లు దాటి బయటకు అడుగుపెట్టాలంటే విసుగ్గా అనిపించింది ఏంజిమ్‌కు. ఎందుకంటే రోడ్లన్నీ మనుషుల ప్రవాహంతో క్రిక్కిరిసి ఉంటాయి. ఏ సమయంలోనైనా కనీసం యాభైవేలమంది రోడ్లమీద ఉంటారు. అప్పుడప్పుడు రోడ్లు మాన్‌లాక్ అవుతుంటాయి. అటువంటప్పుడు ఎక్కడివాళ్లక్కడ కదలకుండా నలభై ఎనిమిది గంటలు ఉండిపోవాల్సి వస్తుంది. అందుకే వాహనాలు ఇపుడు ఆకాశమార్గాన వెళ్తున్నాయి.

మనుషులు నడిచే రోడ్లకు వంద అడుగుల ఎత్తున ఫ్లైఓవర్లను ఆకాశమార్గం అంటారు. కొన్ని వందల మైళ్లుంటాయి ఫ్లైఓవర్లు.

కానీ వాహనంలో వెళ్లాలంటే ఎందుకు వెళ్లాలో, ఎక్కడికి వెళ్లాలో చెప్పి రిజిష్టర్ చేసుకోవాలి. తాను జూడీని కలిసేందుకు వెళ్తున్నట్టు ఎవరికీ తెలియడం ఇష్టం లేదు ఏంజిమ్‌కు. అందుకే నడక ఉత్తమం అని నిర్ణయించుకున్నాడు.

మొబైల్ తీసుకున్నాడు. అవసరమైతే వర్చువల్ గేమ్స్ ఆడుతూ ఎదురుచూడవచ్చు. గబగబా బయటకు వచ్చాడు. చెవిటివాడికి హఠాత్తుగా సముద్రపు తుపాను హోరు వినిపిస్తే ఎలా ఉందో అలా ఉంది ఏంజిమ్‌కు. రోడ్డుమీద జనప్రవాహం పెద్ద హోరుతో కదులుతోంది. వాళ్ల అడుగుల శబ్దం భూకంపశబ్దంలా ఉంది. మనుషులు వేగంగా నడుస్తున్నారు. నిజానికి వాళ్లు నడుస్తున్నారనే కన్నా జనప్రవాహంపై తేలుతున్నారు అనవచ్చు. ఆ ప్రవాహంలో తానూ భాగమయ్యాడు ఏంజిమ్. వారి వేగంతో తన వేగం కలిపాడు. ఎక్కడయినా కాస్త నెమ్మది అయితే వెనుకనుంచి వస్తున్న ప్రవాహం ముందుకు తోసేస్తుంది. అదుపు తప్పి క్రింద పడితే.. ఎవరూ ఆగరు... ఆగలేరు. ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఏంజిమ్‌కు ఎవరో తనని వెంబడిస్తున్నారనిపించింది. కానీ ఈ ప్రవాహంలో ఎవరు, ఎవరిని వెంబడిస్తారు? కానీ ఎందుకో అలా అనిపిస్తోంది.

ఇంతలో ఏంజిమ్ తిరగాల్సిన మలుపు వచ్చింది. అదే ప్రవాహవేగంతో తాను తిరగాల్సిన వైపు తిరిగి నుంచున్నాడు. వెంటనే ఆ వైపు కొట్టుకుపోసాగాడు. దూరంనుంచి మిలమిలలాడుతూ కనిపించాయి వర్చువల్ ప్యాలెస్ తళతళలు. ఏంజిమ్ గుండె వేగంగా కొట్టుకోసాగింది. జూడీని ఇంతకాలం వర్చువల్ స్పేస్‌లో మాయగా చూశాడు. ఇప్పుడునిజజీవితంలో మాయను చూస్తాడు.. ఎదురుగా ప్రత్యక్షంగా. వర్చువల్ ప్యాలెస్‌లో అడుగుపెట్టే ముందు అద్దంలో తన ప్రతిబింబం చూసుకున్నాడు. ఒకప్పుడు తన వయసు పిల్లలు బుద్ధిగా చదువుకుంటూండేవారట. అమ్మాయిల గురించి జోక్‌లు వేసుకునేవారట. కానీ ఇప్పుడుపుట్టిన రెండేళ్లకే పిల్లలకు లైంగిక పరిజ్ఞానం వస్తోంది. అయిదేళ్లకే లైంగిక చర్యల్లో పాల్గొంటున్నారు. ఆపై అమ్మాయిలపై ఆసక్తి తగ్గి వర్చువల్ ప్రపంచంలో మునిగితేలుతున్నారు. తనూ అంతే... అద్దంలో మరోసారి తనివితీరా చూసుకుని తనకు ఇచ్చిన టేబుల్ వద్దకు నడిచాడు. దారిలో అనేక టేబిళ్ల దగ్గర మనుషులు వర్చువల్ ప్రపంచంలో కూచుని వ్యవహారాలు నడుపుతున్నారు. ఏది నిజమైన ప్రపంచం, ఏది మాయా ప్రపంచమో గుర్తించడం కష్టంగా ఉంది. అక్కడ నిజానికీ, మాయకీ నడుమ ఎల్లలు చెరిగిపోతున్నాయి. ఆత్రంగా తన టేబుల్ చేరాడు ఏంజిమ్. కుర్చీలో కూచోబోతుంటే పక్కనుంచి అయిదుగురు వచ్చి చుట్టుముట్టారు.

“ఎవరు?” గొంతు తడారిపోతుంటే అడిగాడు ఏంజిమ్.

“జూడీని కలవాలా?” అడిగాడొకడు.

తల ఊపాడు ఏంజిమ్. అర్థమయింది.. వాళ్లు వర్చువల్ హంతకులు.

వెంటనే ఆయుధాలు తీశారు. ఏంజిమ్‌కు అర్థమైంది. ఎవరో జూడీని కలవాలనుకుంటున్నారు. ఆలస్యం భరించలేక తన అడ్డు తొలగించుకుంటున్నారు. తన అడ్డు తొలగితే తనవంతు, తన తరువాత వాడికి వస్తుంది. వాడి నిర్ణీత సమయం కన్నా ముందే జూడీని కలవగలుగుతాడు. వాళ్లు ఏంజిమ్‌ను లాక్కుపోసాగారు. వాళ్ల చాటునుంచి ఒక ఐదేళ్ల పిల్లవాడు ముందుకు వచ్చి ఏంజిమ్ కూర్చోవాల్సిన స్థలంలో కూర్చున్నాడు. ఏంజిమ్‌ని చూసి వ్యంగ్యంగా నవ్వాడు. ఏంజిమ్‌ని పశువును లాక్కెళ్లినట్టు వాళ్లు లాక్కుపోతుంటే ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏది మాయనో, ఏది నిజమో ఎవరికీ తెలియదు.

అంత భయంలో, బాధలో టేబుల్‌వైపు చూశాడు ఏంజిమ్. అతని కళ్లు మెరిశాయి. అక్కడ జూడీ ఉంది. చివరిక్షణంలో జూడీని చూసిన తన జన్మ ధన్యమైందనుకున్నాడు ఏంజిమ్. ఆమె రూపాన్ని కళ్ల నిండా నింపుకున్నాడు.

వర్చువల్ గూండాలు ఏంజిమ్ మీదకు లంఘించారు. ప్రపంచం అదృశ్యమయ్యేముందు ఏంజిమ్ మనసులో ఒకటే ఆలోచన... తనలాంటి వాడున్నట్టు జూడీకి ఎప్పుడైనా తెలుస్తుందా?

మాయకు నిజం గ్రహింపుకు వస్తుందా? నిజానికి మాయ లభిస్తుందా?

❄ ❄ ❄ ❄ ❄

"ఇదంతా ప్రత్యర్థి సంస్థ కుట్ర. ఈ మాయ గేమ్స్ ఆడేది రెండు నుంచి 18 ఏళ్లలోపువారు. వారందరినీ ఒక పద్ధతి ప్రకారం చంపుతున్నారు. ముందే యువతీయువకుల సంఖ్య తగ్గిపోతోంది. మిగిలినవారిని ఇలా చంపేస్తూ ఉంటే మన కష్టమర్ల సంఖ్య తగ్గిపోతుంది. మనం దివాళా తీయాల్సివస్తుంది." బాధగా చెప్పాడు భ్రమ సంస్థ ఎండి.

"పిల్లల్లో హింస పెరిగిపోతోంది. నిన్న ఓ పధ్నాలుగేళ్ల పిల్లవాడిని చంపేశారు. ఆ తరువాత అయిదేళ్ల పిల్లవాడిపై దాడిచేశారు. ఈ దాడులు చేసేవాళ్లంతా తొమ్మిదేళ్ల లోపువారేనని తేలింది. ఈ పరిస్థితిని ఎలా మార్చాలో తెలియడం లేదు. పిల్లల్లో హింస పెరిగిపోతోంది" చెప్పాడు సంస్థ మేనేజర్.

ఇంతలో క్రియేటివ్ డిపార్ట్‌మెంట్ అధికారి సమావేశం గదిలోకి దూసుకువచ్చాడు.

"జూడీని తలదన్నే మాయమనిషిని సృష్టించాను. చూడండి. చూసినవాళ్లంతా వెర్రెక్కిపోతారు. ఇక జూడీ రాజ్యం అంతమైపోతుంది" అంటూ తను కొత్తగా సృష్టించిన వర్చువల్ పర్సన్‌ని ప్రదర్శించాడు.

ఆమెను చూడగానే అందరి మతి చెదిరింది. అంత అందంగా ఉంది.

దాంతో అందరూ 'పిల్లల్లో పెరుగుతున్న హింస'ని పక్కన పెట్టి ఆ మాయపిల్లని ఎలా మార్కెట్‌లో ప్రవేశపెట్టాలా అన్న విషయంపై చర్చించడం ఆరంభించారు.

# వైరస్ యుద్ధం

**త**నకు వచ్చిన ఈమెయిళ్లను చెక్‌చేస్తున్న చాంగ్ కళ్లు ఆ మెయిల్‌మీద ఆగిపోయాయి. ఎవరూ తనని గమనించడం లేదని నిర్ధారించుకున్న తరువాత ఆ మెయిల్‌పై క్లిక్ చేశాడు. ఆ తరువాత జరిగినదాన్ని చూసి బిత్తరపోయాడు.

❄ ❄ ❄ ❄ ❄

ఖంబట్టా కళ్లు ఆశగా మెరిశాయి ఆ మెయిల్ చూడగానే. ఆత్రంగా మెయిల్‌ను తెరిచాడు. అంతే... ఆ తరువాత జరిగినది అతని ఊహకు అందలేదు.

❄ ❄ ❄ ❄ ❄

"ఏదో ఒక రోజు ఇటువంటిది జరుగుతుందని ఊహించినా ఇటువంటి పరిస్థితి ఎదుర్కొనేందుకు తయారీలు చేస్తూనే ఉన్నా నిజం ఇలా ఉంటుందనుకోలేదు" వరల్డ్ హోం మినిస్టర్ ప్రచండ తలపట్టుకున్నాడు. ప్రపంచ రక్షణమంత్రి, గూఢచార వ్యవహారాల మంత్రివైపు తిరిగాడు.

"ఈ ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నాలు ఎంతవరకు వచ్చాయి?" అడిగాడు.

"ఈ పనిని యాన్టీ వైరస్ నిపుణుడు కిరణ్‌కి అప్పగించాను. రాత్రింబవళ్లు నిద్రాహారాలు మూని అదేపనిలో ఉన్నారు మొత్తం యాన్టీ వైరస్ జట్టు సభ్యులు" సమాధానం ఇచ్చాడు గూఢచార వ్యవహారాల మంత్రి.

"ఏమన్నా సాధించారా?" చిరాగ్గా అడిగాడు ప్రపంచాధ్యక్షుడు.

"ఇంతవరకూ లేదు. కానీ ఈ వైరస్ అంతు చూడగల నిపుణులే రంగంలో ఉన్నారు" విశ్వాసంగా చెప్పాడు గూఢచార వ్యవహారాల మంత్రి.

❄ ❄ ❄ ❄ ❄

20వ శతాబ్దాంతంలో ఆవిర్భవించిన ఇంటర్నెట్ ప్రజల జీవనవిధానాన్ని సంపూర్ణంగా మార్చేసింది. 21వ శతాబ్దం సగమయ్యేసరికి జనజీవితంలోంచి విడదీయరాని భాగమయింది ఇంటర్నెట్. ప్రతి విషయానికీ ఇంటర్నెట్‌పై ఆధార పడడంతో అది ప్రపంచానికి ఊపిరి అయింది. ఇరవయ్యవ శతాబ్దంలో ఎలా పెట్రోలు ప్రపంచాన్ని నిర్దేశించిందో 21వ శతాబ్దంలో ఇంటర్నెట్ అలా ప్రపంచాన్ని నిర్దేశిస్తోంది. వ్యాపారం, లావాదేవీలు, ప్రయాణాలు, బుకింగ్‌లు, రైలు, విమానాలు ఇతర వాహనాల డ్రైవింగ్ సమస్తం ఇంటర్నెట్ మయం అయింది. 'తిండి లేకున్నా బ్రతకవచ్చుగానీ నెట్ లేకపోతే బ్రతకలేం' అన్నమాట సర్వసాధారణమై పోయింది.

ఇంటర్నెట్ ప్రాధాన్యం పెరుగుతున్నకొద్దీ నెట్ పనితీరు అస్తవ్యస్తం చేసే హ్యాకర్ల ప్రాధాన్యం పెరిగింది. ఆరంభంలో వీళ్లు నెట్‌లోని రహస్య సమాచారాన్ని సేకరించడంతో సంతృప్తిపడేవారు. వ్యక్తుల పాస్‌వర్డ్‌లు కనుక్కుని వారి పనులను దెబ్బతీయడాన్ని దాటేవారు కాదు. కానీ నెట్ ఎంత అభివృద్ధి చెందుతూ వచ్చిందో ఈ హ్యాకర్లు సృష్టించే వైరస్‌లు అంతగా సంక్లిష్టమవసాగాయి. ఎలాగయితే శరీరంలో ప్రవేశించిన వైరస్ కొన్నాళ్లు మౌనంగా ఉండి అనువైన సమయం రాగానే తామర తుంపరగా పెరిగి శరీరాన్ని దెబ్బతీస్తుందో, అలాగే కంప్యూటర్‌లో చేరిన తరువాత కొన్నాళ్లు ఎటువంటి ప్రమాదం కలిగించకుండా ఉండి నిర్ణీతసమయంలో కంప్యూటర్‌పై దాడి చేసి అస్తవ్యస్తం చేసే వైరస్ ప్రోగ్రాంలను సృష్టించడం ఆరంభించించారు హ్యాకర్లు. మరోవైపు తీవ్రవాదం తీవ్రమైన సమస్యలా ఎదగడంతో దాన్ని అణిచేందుకు ప్రపంచంలోని దేశాలన్నీ కలసికట్టుగా ఒకటై పోరాడాల్సివచ్చింది. దాంతో ప్రజలు సంకుచితత్వాన్ని వదిలారు. దేశాల మధ్య ఎల్లలు కరిగిపోయాయి. ప్రపంచ దేశాలు ఒకటయ్యాయి. దాంతో తీవ్రవాదులకు ఏ దేశంలోనూ నిలువ నీడ లేకుండాపోయింది. అయితే తీవ్రవాదులు సంపూర్ణంగా అదృశ్యం కాలేదు. అప్పుడప్పుడు చిన్న చిన్న దాడులు చేస్తూ తాము బ్రతికే ఉన్నామని నిరూపించుకుంటుండేవారు. ఇంతలో వారి దృష్టి నెట్‌పై పడింది. హ్యాకింగ్ హాబీలా చేసేవారి స్థానాన్ని తీవ్రవాదులు ఆక్రమించారు. దాంతో తీవ్రవాదులు సృష్టించే వైరస్‌లను ముందే పసిగట్టి అవి ప్రమాదం కలిగించేలోగా మట్టుపెట్టేందుకు యాంటీ వైరస్ సెల్ ఏర్పాటు తప్పనిసరి అయింది. ఆ యాంటీవైరస్ సెల్ సక్రమంగా పనిచేసేట్టు చూడడం కిరణ్ బాధ్యత.

* * * * *

"ఇంతవరకూ ఎన్నో చూశానుగానీ ఇంతటి క్లిష్టమైన వైరస్ ప్రోగ్రాంను చూడలేదు" అలసటగా వెనక్కి వాలాడు కిరణ్.

"ఈ వైరస్‌ను చైన్‌వైరస్‌గా వర్గీకరించాం. అంటే ఎలాగైతే సముద్రంలో ఒక అల తరువాత మరో అల వస్తుందో అలా ఈ వైరస్ ఒంటరిగా రాదు. అలల్లా వస్తూనే ఉంటుంది" వైరస్ ప్రోగ్రాం నుంచి దృష్టి తిప్పకుండా చెప్పాడు రాబర్ట్.

"ఈ వైరస్ ప్రోగ్రాం కూడా విచిత్రంగా ఉంది. వైరస్ మెయిల్‌ను సాధారణంగా

అటాచ్‌మెంట్లతో పంపుతారు. అటాచ్‌మెంట్‌ను చూస్తే వైరస్ జీవం పోసుకుంటుంది. కంప్యూటర్‌లో ఉన్న ఇతర అడ్రసులన్నింటికీ ఈ వైరస్‌ను పంపుతుంది. వాళ్లు అటాచ్‌మెంట్లు ఓపెన్ చేయగానే ఆ కంప్యూటర్‌లోని అడ్రసులకు వైరస్ వెళ్తుంది. ఇలా ఒక కంప్యూటర్ నుంచి అనేక కంప్యూటర్లను చేరుతుంది. సెక్స్ అనగానే ఎటువంటివాడైనా ఆకర్షితుడవుతాడు. మెయిల్ ఓపెన్ చేస్తాడు. వైరస్ బారిన పడడమే కాదు ఇతరులకు అంటిస్తాడు" చెప్పాడు కిరణ్. రాబర్ట్ మౌనంగా ఉన్నాడు. అంతలో ఆ ప్రోగ్రాంని పరిశీలిస్తున్న కిరణ్ కళ్లు చిన్నవయ్యాయి.

"రాబర్ట్ అటుచూడు" పిలిచి చూపించాడు.

అది చూస్తున్న రాబర్ట్ ముఖం గంభీరంగా మారింది.

"దశల వారీగా దాడి చేస్తోందీ వైరస్" అప్రయత్నంగా అన్నాడు రాబర్ట్.

"అవును. ఈ వైరస్ తాకిడికి గురైన కంప్యూటర్లు కొన్నాళ్ళకి మామూలుగా అవుతాయి. కానీ అంతలో మరో వైరస్‌ను కంప్యూటర్ సృజిస్తుంది. అది దీనికన్నా శక్తివంతమైనది."

"అంటే ఈ వైరస్‌ను నాశనం చేయాలంటే వైరస్ సోకిన కంప్యూటర్లను నాశనం చేయడం తప్ప వేరే మార్గం లేదా?" రాబర్ట్ స్వరంలో ఆందోళన స్పష్టంగా ధ్వనించింది.

"దీన్ని అరికట్టాలంటే రెండో దశ ఆరంభమయ్యేలోగా వైరస్‌ను పంపిన కంప్యూటర్ ఇపిసి (ఇంటర్నెట్ కంప్యూటర్ సర్వీసు ప్రొవైడర్)ను కనుక్కొని దాన్నుంచి వెలువడే ఆదేశాలను అడ్డుకోవాలి. ఆ వెబ్‌సైట్ దేనిలో ఉందో కనుక్కొని ఆ పేజీని మూసేయాలి" ఆలోచనగా అన్నాడు కిరణ్.

"కానీ నిర్ణీత సమయానికి ఏక్టివేట్ అవ్వాలన్న ఆదేశం ప్రోగ్రాంలోనే ఉంటే..." అనుమానంగా అన్నాడు రాబర్ట్.

"చూద్దాం" అంటూ దృష్టిని కంప్యూటర్‌వైపు మళ్ళించాడు కిరణ్.

❄ ❄ ❄ ❄ ❄

తీవ్రవాదుల వైరస్ దాడికి ప్రపంచం స్తంభించిపోయింది. స్టాక్‌మార్కెట్లు ఆగిపోయాయి. వ్యాపారలావాదేవీలు దెబ్బతిన్నాయి. ఇ-బిజినెస్ మూతబడింది. రైలు, విమానాల రిజర్వేషన్లు ఆగిపోయాయి. ప్రపంచంలో గగ్గోలు రేగసాగింది. అప్పటి వరకూ సర్వసాధారణంగా భావించిన విషయాలు ఇప్పుడు కఠినతరమై ప్రాణాంతకంగా పరిణమించాయి. ఇంటర్నెట్ సిగ్నల్‌తో వాహనాల డ్రైవింగ్ అలవాటు అయిన ప్రజలు స్వయంగా వాహనాలు నడపాల్సి రావడంతో రోడ్ల ప్రమాదాలు పెరిగిపోయాయి. బ్యాంకు అకౌంట్ల వివరాలు ఇంటర్నెట్‌లో ఉండిపోవడంతో ఎవరికెంత ఇవ్వాలో, ఏ అకౌంట్‌లో ఎంత వుందో తెలియక బ్యాంకింగ్ వ్యవస్థ అల్లల్లాడసాగింది. ప్రతి విషయంలో మళ్ళీ ఒకప్పటిలా మనుషులు రంగంలో దూకి మాన్యువల్‌గా పనులు చేయాల్సి వస్తోంది.

ఇంతలో ఎంత హఠాత్తుగా వైరస్ ఉద్భవించిందో అంత హఠాత్తుగా అది అదృశ్యమయింది.

* * * * *

"నువ్వనేదేమిటి? ఏన్టీవైరస్ ప్రోగ్రాంవల్ల కాదా ఆ వైరస్ అదృశ్యమయింది?" దాదాపుగా అరిచాడు కెరింగ్ ప్రపంచ గూఢచార వ్యవహారాల మంత్రి.

"కాదు" తల వంచుకుని చెప్పాడు కిరణ్. "మేము శాయశక్తులా ప్రయత్నించాం. కానీ వైరస్‌కోడ్‌ను కనుక్కోలేకపోయాం" మెల్లగా అన్నాడు.

"మరి?" ప్రశ్నించాడు కెరింగ్.

"అది తనంతట తానే అదృశ్యమయింది. దాని ప్రోగ్రాం అంతే"

"అంటే?"

"అంటే ఒక వారం తరువాత ఆ వైరస్ జీవితకాలం అయిపోతుంది. దాంతో అది అదృశ్యం అయిపోతుంది."

"దీనివల్ల తీవ్రవాదులకేం లాభం?"

"వైరస్ అదృశ్యమయింది కానీ దాని బీజం కంప్యూటర్లలో ఉంటుంది. కొన్నాళ్ళకు అది మళ్ళీ దాడి చేస్తుంది."

"అంటే"

"అంటే ప్రమాదం తొలగిపోలేదు. మరింత తీవ్రతరమయింది. ఇప్పుడు వచ్చే రెండవ వైరస్ తాకిడి మొదటి వైరస్ తాకిడికన్నా తీవ్రంగా, భయంకరంగా ఉంటుంది. ఇంతవరకూ మనం అనుభవించినది 'డ్రయ్‌రన్'. అంటే వైరస్ పని చేస్తుందో లేదో తీవ్రవాదులు చేసిన పరీక్ష మాత్రమే అన్నమాట."

కుర్చీలో కూలబడ్డాడు కెరింగ్.

"ఇప్పుడేం చేద్దాం?"

" ఆ వైరస్ తాకిడి ఎప్పుడు ఆరంభమవుతుందో తెలియదు. ఈలోగా ముందు జాగ్రత్తగా పనులన్నీ మాన్యువల్‌గా చేయాలి. రాబోయే తాకిడిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. ఈ లోగా మేం వైరస్ కోడ్‌ను అర్థం చేసుకుని నాశనం చేసేందుకు ప్రయత్నాలు చేస్తూనే వుంటాం."

"కానీ మాన్యువల్‌గా ఆరంభిస్తే మనం ఓడిపోయినట్టేగా?"

"యుద్ధంలో అవసరమైతే ఒక అడుగు వెనక్కు వేయక తప్పదు."

* * * * *

కానీ అనేక రాజకీయక కారణాలవల్ల మాన్యువల్ పనులు ప్రారంభం కాలేదు. ఇంతలో రెండవ వైరస్ దాడి ప్రారంభమయింది. ఈసారి దాడి శక్తి మొదటి దానికన్నా రెట్టింపు. అప్పుడప్పుడే మామూలు జీవితానికి అలవాటు పడుతున్న ప్రజలు మళ్ళీ ఇక్కట్లు పడసాగారు. జన జీవితం అస్తవ్యస్తమయింది.

* * * * *

"తనని తానే నాశనం చేసుకున్న వైరస్ ద్విగుణీకృత ఉత్సాహంతో, రెట్టించిన బలంతో కంప్యూటర్లపై దాడి చేస్తోంది. ఈ సారి ఒకే అడ్రస్ నుంచి కాక పలు అడ్రస్‌ల నుంచి రకరకాల కొత్త ప్రోగ్రాంలు తెరపై కనబడసాగాయి. అవి క్లిక్ చేస్తే కంప్యూటర్ పని ఖతం. ఇతర కంప్యూటర్లకు వైరస్ పంపడం తప్ప మరో పని చేయలేదు ఆ కంప్యూటర్" తనలో తాను అనుకుంటున్నట్లు పైకే అన్నాడు కిరణ్.

"ఈ వైరస్ కోడ్ గతంలో దానికన్నా కఠినంగా ఉంది" అన్నాడు రాబర్ట్ నిస్పృహగా.

" ఈ వైరస్‌లో కీబోర్డ్ స్నిఫర్‌లున్నాయి. అంటే కీబోర్డు ఒక అక్షరం టైప్ చేయగానే మిగతా అక్షరాలు అదే అర్థం చేసుకుంటుంది. దాంతో పాస్‌వర్డ్‌లు, క్రెడిట్‌కార్డులు, అకౌంట్ నెంబర్లు లాక్ అయిపోతాయి. ఈ వైరస్‌ను సృష్టించినవారికి అందుతాయి."

"అలా మనం తీవ్రవాదులను పట్టుకోవచ్చు కదా?" ఆత్రంగా అడిగాడు రాబర్ట్. నవ్వాడు కిరణ్.

"తీవ్రవాదులు వాడినవి అన్నీ అద్దె కంప్యూటర్లే. కాబట్టి ఎవరు వాడారో తెలుసుకోవడం కుదరలేదు. పైగా వాళ్ళు వాడినవి దొంగిలించిన క్రెడిట్ కార్డులు. నువ్వు సెలవులకు వెళ్ళివచ్చేసరికి ప్రపంచం మారిపోయిందోయ్" అన్నాడు కిరణ్. "ప్రపంచం మారిపోలేదు. మారిపోయిన ప్రపంచం మళ్ళీ వెనక్కి వెళ్తోంది" అంటూ కంప్యూటర్‌వైపు తిరిగిన రాబర్ట్ కెవ్వుమని కేక వేశాడు.

అటువైపు చూసిన కిరణ్ ముఖం గంభీరంగా మారింది.

❄ ❄ ❄ ❄ ❄

"ఇంపాజిబుల్. కంప్యూటర్లను మూసేయడం కుదరని పని" అరిచాడు అధ్యక్షుడు కోపంగా.

"ఈ వైరస్‌లో ప్రత్యేకమైన అంశాలను వెతికి వాటిపై దాడి చేసే ప్రోగ్రాంలు రాశాము. సెర్చ్‌టూల్‌ను కంప్యూటర్లలో పోస్టు చేశాం. ఏంటీవైరస్ అప్‌డేట్‌లను అందజేస్తున్నాం. కానీ ఫలితం కనబడలేదు. ఇంతలో తీవ్రవాదుల నుంచి ఈ మెసేజ్ అందింది. ప్రపంచ సమైక్యతా దినోత్సవం రోజు కొత్త వైరస్ ప్రపంచాన్ని తాకుతుంది. దాంతో ప్రపంచంలో కంప్యూటర్ పని అయిపోతుంది. అది జరగకూడదంటే తీవ్రవాదులకు ఓ దేశం అప్పగించాలి" లోగొంతుతో చెప్పాడు కిరణ్, ఆ బెదిరింపు ప్రింట్ అవుట్‌ను అధ్యక్షుడికి అందజేస్తూ.

అధ్యక్షుడు కిరణ్‌వైపు కోపంగా చూశాడు.

"రేపు పదిగంటలవరకూ డెడ్‌లైన్ వుంది. అంతలో వైరస్ కోడ్ కనుక్కోలేకపోతే కంప్యూటర్లను, సర్వీసు ప్రొవైడర్లను తాత్కాలికంగా మూసేయాల్సి వుంటుంది.

ఎందుకంటే సరిగ్గా పదిగంటలకు మరో వైరస్ ప్రపంచాన్ని తాకుతుంది.” అధ్యక్షుడు మాట్లాడలేదు.

* * * * *

కొన్ని వేలమంది ఏన్టీవైరస్ పరిశోధకులు వైరస్ ప్రోగ్రాం అణువణువునూ గాలిస్తున్నారు. వైరస్ కోడ్‌ను భగ్నం చేసే ఆధారంకోసం వెతుకుతున్నారు.

ప్రపంచం నలుమూలల నుండీ అందుతున్న రిపోర్టులను విశ్లేషిస్తున్నాడు కిరణ్. సమయం గడుస్తున్నకొద్దీ అతడిలో కంగారు పెరిగిపోతుంది. ఉదయం పదిగంటలలోగా వైరస్ పని పట్టకపోతే ఇక ప్రపంచం నుంచి కంప్యూటర్ అన్నపదం అదృశ్యమవుతుంది. కంప్యూటర్ సర్వీసులను కొద్దికాలం మూసేసేందుకు అధ్యక్షుడు ఇష్టపడలేదు.

“తీవ్రవాదుల నుంచి ఈ ప్రమాదం ఎప్పుడూ వుంటుంది. వాళ్ళకి భయపడి కంప్యూటర్లను బాగు చేసేకన్నా వాళ్ళ తాకిడికి అవి పేలిపోవడమే మంచిది. అప్పుడు ప్రజలకు జరుగుతున్నది తెలుస్తుంది” అన్నాడు అధ్యక్షుడు.

అధ్యక్షుడి అభిప్రాయాన్ని అర్థం చేసుకున్నాడు కిరణ్. ఎట్టి పరిస్థితుల్లోనూ తీవ్రవాదుల బెదిరింపులకు లొంగకూడదన్న పట్టుదల అది.

“రాబర్ట్” హఠాత్తుగా ఒక ఆలోచన తట్టింది. అందుకే రాబర్ట్‌ని పిలిచాడు.

“యస్” అన్నాడు రాబర్ట్.

“రేపు పదిగంటలకల్లా కొత్త వైరస్ తాకుతుందని కదా బెదిరింపు?”

“అవును.”

“కొత్త వైరస్ తాకాలంటే పది గంటలకు ఆ ఆర్డర్ అందాలి కదా?”

“అవసరం లేదు. ఇప్పుడున్న వైరస్‌లో కూడా ఉండవచ్చు.”

“లేదు. ఇప్పుడున్న వైరస్‌లో పదిగంటలకల్లా కొత్త వైరస్‌ను సృష్టించమన్న ఆర్డర్ లేదు.” కిరణ్‌వైపు ఆలోచనగా చూశాడు రాబర్ట్.

“రాబర్ట్... ఆలోచించు. పదిగంటలకు వేరే కంప్యూటర్లనుంచి ఈ ఆదేశం వైరస్ ప్రభావంలో ఉన్న కంప్యూటర్లకు అందుతుంది. కానీ ఇప్పటికే వైరస్ ఎంత శక్తివంతమైనదంటే ఇన్ని కంప్యూటర్లను ఒకే కంప్యూటర్ నుంచి మెసేజ్ ఇవ్వడం కష్టం. కొన్ని కంప్యూటర్ల నుంచి ఒకేసారి వెలువడాలి.”

“ఇంటర్నెట్ అంటే కంప్యూటర్ల గొలుసు. ఆ గొలుసును దెబ్బ తీసేందుకు మరో కంప్యూటర్ల గొలుసునుంచి ఆదేశం అందాలి” అన్నాడు రాబర్ట్.

“సరిగ్గా అంతే. కాబట్టి మనం వైరస్ కోడ్‌ను అర్థం చేసుకునే ప్రయత్నాలు మానేయాలి. ఎందుకంటే ఎలాగో రేపు పదిగంటలకు ఈ వైరస్ జీవితకాలం అయిపోతుంది. మనం వెతకాల్సింది ఏ కంప్యూటర్ నుండి ఆదేశం అందుకుని కొత్త వైరస్‌ను ఇది సృష్టిస్తుందో ఆ కంప్యూటర్‌కు సంబంధించిన సమాచారం కనుక్కోవాలి” గబగబా చెప్పాడు కిరణ్.

"కానీ..."

"ఇక్కడ వాదనలకు సమయం లేదు. ఎలానూ రిస్క్ తీసుకోక తప్పదు" ప్రపంచ వ్యాప్తంగా వైరస్ నాశనం కోసం పనిచేస్తున్నవారికి సమాచారం అందించసాగాడు కిరణ్.

* * * * *

ఒకోసారి కళ్ల ఎదుట ఉన్నదాన్నే చూడలేము. వెతికీ వెతికీ విసుగువచ్చి దృష్టికోణం మారుస్తాము. వెతుకుతున్నది ఎదురుగానే ఉంటుంది. వైరస్ విషయంలో అదే జరిగింది. వైరస్ కోడ్‌ను అర్థం చేసుకునే ప్రయత్నాలు మాని విభిన్న సర్వర్‌ల కోడ్ వెతకడం ఆరంభించడంతో ప్రపంచవ్యాప్తంగా సత్ఫలితాలు రావడం మొదలయింది. సమాచారం వేగంగా కిరణ్‌కు చేరసాగింది.

ఒకటి కాదు రెండు కాదు ప్రపంచం నలుమూలల, వివిధ దేశాలలో మొత్తం 20 కంప్యూటర్ల కోడ్‌లు వైరస్‌లో నుండి లభించాయి. వెంటనే అధ్యక్షుడికి ఫోన్ చేశాడు కిరణ్. "మనం మొత్తం కంప్యూటర్లను మూయనక్కర్లేదు. కొరియా, జర్మనీ, ఇంగ్లండ్, కెనడా, అమెరికా, భారత్, చైనాలలో ఉన్న ఇరవై కంప్యూటర్ల సర్వర్లను మూసేస్తే చాలు" గబా గబా చెప్పాడు కిరణ్ ప్రపంచ అధ్యక్షుడికి.

* * * * *

కంప్యూటర్ల సర్వర్లను మూసేస్తున్న వివరాలు అందుతున్నకొద్దీ హాలు చప్పట్లతో దద్దరిల్లుతోంది. "కొరియాలో కంప్యూటర్లను కనుగొని సర్వర్లను మూసేశారు" పెద్దగా చెప్పాడు కిరణ్.

"రెండయిపోయాయి. పద్ధెనిమిది ఉన్నాయి" అరిచాడు రాబర్ట్.

* * * * *

"అమెరికాలో అయిదు సర్వర్ల పని ఖతం" ప్రకటించాడు కిరణ్.

"హుర్రే" అరిచారంతా. "పది మిగిలివున్నాయి" అన్నాడు రాబర్ట్.

అందరి దృష్టి గడియారంవైపు మళ్లింది. 'ఇంకా పదిగంటలుంది' ఈ ఆలోచన అందరి మదిలో మెదిలింది.

* * * * *

మరో సర్వర్ మూసేసిన సమాచారం ఎంతకీ అందకపోవడంతో అందరిలో ఉత్కంఠ పెరిగింది. ఉదయం ఆరవుతోంది.

"ఇంకో నాలుగుగంటలే ఉన్నాయి. ఇంతలో మిగిలిన ఎనిమిది కంప్యూటర్లు మూతపడాలి" తనలో తాను అనుకుంటున్నట్లు పైకే అనేశాడు కిరణ్.

నిశ్శబ్దంగా ఉన్న ఆ గదిలో ఆ మాటలు భయంకరంగా ప్రతిధ్వనించాయి.

* * * * *

తొమ్మిదయింది. "భారత్‌లో ఒక కంప్యూటర్ పని ఖతం" అరిచాడు రాబర్ట్

సంతోషంగా. "ఇంకా నాలుగు ఉన్నాయి." తొమ్మిదిన్నర...

"చైనాలో రెండు సర్వర్లు సఫా" హాల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.

"ఇంకా రెండు దొరకాలి" కిరణ్‌లో ఉద్విగ్నత.

* * * * *

పది గంటలు అయ్యేందుకు రెండు నిముషాలే ఉంది.

ఇంకో రెండునిముషాల్లో రెండు కంప్యూటర్లు దొరక్కపోతే ఇంత శ్రమ వ్యర్థమవుతుంది. భగవంతుడిని ప్రార్థించసాగారు అందరూ.

* * * * *

పదయింది! రెండు సర్వర్లనుండి ఆదేశాలు అందుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా వైరస్ ప్రభావానికి గురైన కోట్లకొలది కంప్యూటర్లు సిద్ధమయ్యాయి.

పది దారుల గుండా ప్రయాణించాల్సిన నీరు రెండు దారులగుండా ప్రయాణించాల్సి వస్తే అది పొంగి పొర్లుతుంది. ఆ నీటి ఉధృతికి అన్ని అడ్డంకులు బద్దలవుతాయి. ఇరవై కంప్యూటర్ల నుంచి అందాల్సిన ఆదేశాలు రెండు కంప్యూటర్ల నుండే అందుకోవాల్సి రావడంతో కంప్యూటర్లు ఒకదానితో మరొకటి నేను ముందు అంటే నేను ముందు అని పోటీలు పడసాగాయి. దాంతో ఆ రెండు కంప్యూటర్లపై వత్తిడి ఎక్కువయింది. కంప్యూటర్ల తోపులాట విపరీతమైంది. దాంతో ఈ వత్తిడి భరించలేని రెండు కంప్యూటర్లు పేలిపోయాయి. వైరస్ భగ్నమంది. తీవ్రవాదులు చెల్లాచెదురయ్యారు. కంప్యూటర్లు ఏ వైరస్ నుంచి సమాచారం అందక మళ్లీ మామూలు స్థితికి వచ్చాయి. ప్రపంచం ఊపిరి పీల్చుకుంది.

* * * * *

"కిరణ్ నీకు అధ్యక్షుడినుంచి అభినందన వచ్చింది" అరిచాడు రాబర్ట్.

గాఢనిద్రలో ఉన్న కిరణ్ ఉలిక్కిపడ్డాడు. అభినందన పత్రం చూసి కిరణ్ ఆనందించలేదు. "ప్రమాదం తాత్కాలికంగా తొలగింది. ఆ ప్రోగ్రాం రాసిన తీవ్రవాదులు దొరకలేదు. అంటే మళ్లీ వాళ్లు ఏకమై ఇటువంటిదో ఇంతకన్నా భయంకరమైన వైరస్‌నో సృష్టించి వదిలే అవకాశం ఉంది. ప్రమాదం తప్పింది. పూర్తిగా తొలగిపోలేదు" మాట్లాడుతూనే నిద్రలోకి జారుకున్నాడు కిరణ్.

"అంటే.... ఈ వైరస్‌ల బెడద నుంచి విముక్తి లేదా?" నిస్పృహగా అడిగాడు రాబర్ట్.

"జననం వెంటనే మరణం ఉంటుంది. అవకాశం ఉన్నప్పుడే నిద్రపోవాలి. కొత్త వైరస్ వస్తే నిద్ర ఉండదు. అది వచ్చేలోగా పడుకో" అంటూనే గుర్రుపెట్టసాగాడు కిరణ్.

* * *

# కాలం చూసిన సత్యం

**చి**క్కటి చీకటి. కళ్ళు పొడుచుకున్నా ఏదీ కనబడదు. చీకటి ఒక పెద్ద నల్లటి సముద్రమై జగతి సర్వం ఆ దట్టమైన సముద్రంలో మునిగిపోయినట్టుంది. ఆకాశం నిండా మాత్రం తెల్లటి వెలుగులు, మల్లెల్లా మెరుస్తున్నాయి. అతడికేమీ అర్థం కావడంలేదు.

'ఉదయం' అనే సమయంలో అన్నీ కనబడుతుంటాయి. కాస్సేపు కాగానే చీకటి నిండిపోతుంది. కనబడినప్పుడు శత్రువుల నుండి తప్పించుకోవచ్చు. మృగాలను వేటాడి తినవచ్చు. రాత్రిళ్ళే ప్రమాదకరం. ఏ వైపు నుంచి ఏ జంతువు వచ్చి మీద పడుతుందో తెలియదు. అర్థంలేని రకరకాల శబ్దాలతో గుండెలదిరిపోతుంటాయి.

వీటికి తోడు కొన్ని రెండుకాళ్ళ విచిత్రమైన జంతువులు ఈ మధ్య కనిపిస్తున్నాయి. తిండికోసం వాటితో పోటీ పడాల్సి వస్తోంది.

జీవితం దుర్భరం అనిపిస్తోంది, కఠినం అనిపిస్తోంది. ఆలోచిస్తూ ఆకాశంలోని నక్షత్రాలవైపు చూస్తున్నాడతడు. రాత్రి అయితే బోలెడన్ని కళ్ళు కిందకు చూస్తుంటాయి. కానీ తెల్లారి కనబడకుండాపోతాయి. ఎటుపోతాయి అవి?

అంతలో అతని కళ్ళు పెద్దవయ్యాయి. గుండె దడదడలాడసాగింది. ఆకాశంలో దూరంగా చిన్నగా కనిపించిన వెలుతురు రానురాను పెద్దగా అవసాగింది. అంతలో మొత్తం ఆ ప్రాంతమంతా తెల్లారినట్టుగా వెలుతురుతో నిండిపోయింది. అతను నోరు తెరుచుకుని చూస్తుండిపోయాడు.

❄ ❄ ❄ ❄ ❄

"టైమ్ ట్రావెల్ కేవలం నేర పరిశోధన కోసమే కాదు, వైజ్ఞానిక పరిశోధనల కోసం కూడా వాడవచ్చుకదా?" ప్రశ్నించాడు ఉజ్వల్.

ప్రొఫెసర్ దిగంత్ నవ్వాడు.

"కాలంలో ముందుకీ వెనక్కూ ప్రయాణించడం ఇంకా సంపూర్ణంగా అభివృద్ధి చెందలేదు. అనేక వైజ్ఞానిక సిద్ధాంతాలు ఇక్కడికి వచ్చేసరికి తల్లక్రిందులవుతున్నాయి"

"చూడు దిగంత్. అందరూ ఒకే దారిలో ప్రయాణిస్తే కొత్త దారులు ఎలా కనుక్కుంటాం? ఇప్పుడు మనం కనీసం మూడేళ్ళు వెనక్కి వెళ్ళగలుగుతున్నాం. అలాగే మరింత వెనక్కి వెళ్ళి ఆదిమానవుడి కాలానికి వెళ్ళే అనేక సత్యాలు తెలుసుకునే వీలుంటుందికదా?"

"ఉజ్వల్! యవ్వనంలో ఆవేశం ఎక్కువుంటుంది. ఎదుగుతున్నకొద్దీ ఆలోచన వస్తుంది. నేను నీ వయసులో ఇలాగే ఆలోచించాను. ఇదిగో ఈ టైమ్‌మెషిన్‌ను రూపొదించాను. కానీ...."

"కానీ?"

"నీకు తెలుసుగా. కాలంలో ముందుకూ వెనుకకు ప్రయాణం చేయడం వైజ్ఞానికంగానే కాదు, తాత్వికంగా కూడా అనేక చిక్కు సమస్యల్ని తెస్తుంది"

"ట్విన్ పారడాక్స్ గురించేగా మీరంటున్నది?" ప్రశ్నించాడు ఉజ్వల్. ఉజ్వల్ ప్రస్తుతం టైమ్ ట్రావెల్‌పై పరిశోధనలు విస్తృతంగా చేస్తున్నాడు.

"నీకు తెలుసా?" అడిగాడు ప్రొఫెసర్ దిగంత్.

"తెలుసు. ఇద్దరు కవలలు ఒకే సమయంలో జన్మించడంతో వారి వయసు ఒకే రకంగా పెరుగుతుంది. కానీ ఒకరు భూమి మీద ఉండి మరొకరు కాలంలో ముందుకో, వెనక్కో ప్రయాణం చేస్తే సాపేక్ష సిద్ధాంతం ప్రకారం ఇద్దరి వయస్సుల్లో తేడా వస్తుంది. ఇదెలా సాధ్యం? ఒకేసారి పుట్టిన కవలల వయస్సుల్లో తేడాలు రావడం భౌతిక సూత్రాలకు విరుద్ధం కదా?"

"కరెక్ట్.అలాగే నీకు ఫూల్‌పారడాల్స్ గురించి తెలుసా?"

తల అడ్డంగా ఊపాడు. ఉజ్వల్.

"వర్తమానంలో మనిషి గతంలోకి వెళ్ళి తాను ఇంకా పుట్టని సమయంలో తనను కనబోయే తండ్రిని హత్య చేసాడనుకుందాం. అప్పుడు ఈ వ్యక్తి పుట్టే అవకాశంలేదు. వీడు పుట్టకపోతే మరి వెనక్కు ఎలా వెడతాడు? భవిష్యత్తులో వాడు కనబోయే సంతానం సంగతి ఏమిటి?"

ఉజ్వల్ బుర్ర గోక్కున్నాడు. అది చూసి ప్రొఫెసర్ దిగంత్ నవ్వాడు.

"ఇంకో గొడవ ఉంది. ఒకవేళ గతంలోకి వెళ్ళి నువ్వేమైనా మారిస్తే భవిష్యత్తు దెబ్బతింటుంది. కాబట్టి గతంలోకి వెళ్ళి నువ్వేమి మార్చకూడదు. అంటే మన భవిష్యత్తు మన ప్రమేయం లేకుండానే నిర్ణయం అయిపోయినట్టు కదా. మరి మానవుడి ఇచ్ఛాశక్తి, అదే ఫ్రీవిల్ అర్థంలేని పదం అయిపోతుంది కదా. ఇది మన కర్మసిద్ధాంతంలా లేదూ?"

చేతులెత్తి దండం పెట్టాడు ఉజ్వల్. నవ్వాడు ప్రొఫెసర్ దిగంత్.

"సైన్స్, ఫిలాసఫీ రెండూ ఒకే నాణానికి రెండు వైపుల వంటివి. కాబట్టి నువ్వు

టైమ్ ట్రావెల్ ద్వారా మానవుడి పుట్టుక రహస్యాలను షార్ట్‌కట్‌లో తెలుసుకోవాలని ప్రయత్నించకు. పరిశోధనలు చేయి. ఎందుకంటే నువ్వు గతంలోకి వెళ్ళి దేన్నయినా పొరపాటున మారిస్తే మొత్తం మానవ పరిణామ చరిత్రే తల్లక్రిందవుతుంది" అంటూ నవ్వాడు ప్రొఫెసర్ దిగంత్.

* * * * *

ఎంత ప్రయత్నించినా, ప్రొఫెసర్ మాటలను ఎంత గుర్తు చేసుకున్నా, టైమ్ ట్రావెల్ ఆలోచన ఉజ్వల్‌ను వదలడంలేదు.

మనిషి 2,00,000 ఏళ్ళ క్రితం ఆఫ్రికాలో జన్మించాడని అంటారు. ఇథియోఫియాలోని ఓమోకిబిష్ ప్రాంతంలో ఆదిమానవుల ఆనవాళ్ళు దొరకడంతో ఈ సిద్ధాంతం ఊపందుకుంది. ఇజ్రాయిల్‌లో కూడా ఆదిమానవుడి ఆనవాళ్ళు దొరకడంతో మనిషి ఆఫ్రికాలో జన్మించి నలుదిశలా ప్రయాణమయ్యాడన్న సిద్ధాంతం వెలిసింది. 70000 నుండి 50000 ఏళ్ళ క్రితం మనిషి ఆఫ్రికా వదిలి ఇతర ఖండాలకు చేరుకున్నాడని, ఇప్పుడు ఉన్న ప్రజలంతా వీరి నుండి జన్మించిన వారేనని జెనెటిక్స్ పరిశోధనలు నిరూపించాయి. కానీ అనేకులు ఈ సిద్ధాంతాన్ని ప్రశ్నిస్తున్నారు.

'అసలు మనిషి ఎలా ఆవిర్భవించాడన్నది తేలడంలేదు. కేవలం జన్యుసంబంధాల మార్పులవల్ల కోతి మానవుడిలా ఎదగడం సాధ్యమా? ఇన్నిరకాల జీవులు ఒకదాని నుండి ఒకటి రావడం యాదృచ్ఛికమా? లేక దీని వెనుక ఏదైనా పథకం ఉందా?'

ఇటువంటి అనేక ప్రశ్నలకు సమాధానం టైమ్ ట్రావెల్ ద్వారా లభించే అవకాశం ఉండగా దాన్ని వదిలి పరిశోధనలు చేస్తుండడం మూర్ఖత్వం అనిపిస్తోంది ఉజ్వల్‌కు. ఎందుకంటే ఎన్ని ప్రయోగాలు చేసినా ఎన్ని పరిశోధనలు చేసినా సందేహాలు వస్తూనే వుంటాయి. సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదు. అందుకే ప్రొఫెసర్ మాటలు పెడచెవిన పెట్టి కాలంలో వెనక్కు వెళ్ళలని నిశ్చయించుకున్నాడు ఉజ్వల్.

టైమ్ మిషన్ తయారైన తరువాత దాన్ని కేవలం కొన్నేళ్ళు వెనక్కు వెళ్ళేందుకు వాడుతూ వస్తున్నారు. అదీ హత్య కేసుల్లో నేరం జరిగిన విధానం కనుగొనేందుకు. కాలంలో సరిగ్గా ఆ సమయానికి వెళ్ళి జరిగినది చూసి వెనక్కు వచ్చేస్తున్నారు.

కానీ ఇప్పుడు టైమ్ మెషిన్‌ను వెనక్కు, ఎంత వెనక్కి అంటే దాదాపుగా ఆదిమానవుడు ఉద్భవించిన కాలంవరకూ వెనక్కు వెళ్ళాలని ఉజ్వల్ నిశ్చయించాడు. అనుమతి అడిగితే ఇవ్వరని ఉజ్వల్‌కు తెలుసు. అందుకే అనుమతి అడగదలచుకోలేదు. తాను గతంలోని దేన్నీ మార్చడు. కేవలం గతంలోకి వెళ్తాడు. మానవుడి ఆవిర్భావం చూస్తాడు. వచ్చేస్తాడు. అంతే.

* * * * *

తమ చుట్టూ కాలం పొర సరిగ్గా ఉందోలేదో ఓసారి సరిచూసుకున్నాడు ఉజ్వల్. ఈ పొరవల్ల ఒకవేళ ఎవరైనా తనని చూసినాతను వెలుతురులో వున్నట్లు కనిపిస్తాడు.

అదీగాక ఈ పొరవల్ల తనవల్ల ప్రాచీన వాతావరణంలో ఎటువంటి మార్పులు కలగవు. తన కాలనౌకను వదిలి బయటకు వచ్చేముందు ఓసారి తాను ఎన్నేళ్ళు వెనక్కు వచ్చాడో చూసాడు. దాదాపుగా 200,000 ఏళ్ళు వెనక్కు వచ్చాడు. ఇప్పుడిప్పుడే మనిషి ఎదుగుతుంటాడు. మనిషి ఆవిర్భావం హఠాత్తుగా జరగలేదు. ఆరంభంలో అనేక రకాల ఆదిమానవులు ఉద్భవించారని, వారిలో వారు కలహించుకోవడం వల్ల జంతువుల బారిన పడి, వాతావరణ పరిస్థితులను తట్టుకోలేక అనేకులు అంతరించిపోగా వారిలో అన్నిటినీ తట్టుకుని నిలబడగలిగిన మానవుడు అభివృద్ధి చెందాడని సిద్ధాంతం. ఆదిమానవుల రకాల్లో మరీ పొడుగ్గా ఉండే జాతి ఉంది. మరీ పొట్టిగా మరుగుజ్జులకన్నా చిన్నగా ఉండే జాతి ఉంది. వీరిలో ఎవరు మానవుడిగా ఎలా అభివృద్ధి చెందారో కళ్ళారా చూడాలని ఉజ్వల్ ఆరాటం.

నెమ్మదిగా చుట్టూ చూసుకుంటూ గతంలోకి అడుగాపెట్టాడు ఉజ్వల్.

* * * * *

వెలుతురులోంచి ఏదో బయటకు వస్తుండడం చూసాడు అతడు.

భయంతో రోమాలు నిక్కబొడుచుకున్నాయి.

పారిపోవాలనుకున్నాడు. అనుక్షణం ప్రమాదాన్ని శంకిస్తూ తప్పించుకునేందుకు సిద్ధంగా ఉండే అతడి కాళ్ళు కదలడంలేదు.

ఎందుకో ఒళ్ళంతా భయంతో వణుకుతున్న అతడి మనసులో ఏదో ఓ మూల కుతూహలం అతడిని కదలనివ్వడంలేదు. ఓ చెట్టుచాటు నుంచి ఆ అద్భుత జీవిని గమనించసాగాడు. దట్టమైన అడవి. రకరకాల జీవులు చరచరా పాకుతున్నాయి. ఎన్నోరకాల క్రిమికీటకాలు బిరబిర పరుగెడుతున్నాయి. వాటిలో అనేక రకమైన ప్రాణులున్నట్లు కూడా ఆధునిక మానవుడికి తెలియదు. ఎందుకంటే వాటి ఆనవాళ్ళు ఏమీ మిగలలేదు కాబట్టి. నెమ్మదిగా ఎటో పరుగెడుతున్న కీటకాన్ని గమనించాడు ఉజ్వల్. అది బొద్దింక శరీరంతో, కప్ప, ముంగిసల కలయికలా విచిత్రంగా ఉంది. ఉజ్వల్ వొంగుతుంటే ప్రమాదం శంకించిన అది వెంటనే నోరు తెరచి ఏదో విష పదార్థాన్ని ఉజ్వల్ వైపు చిమ్మింది. ఉజ్వల్ వెనక్కు తగ్గాడు. ఆ విష పదార్థం కాలం పొరను తాకి కరిగిపోయింది. అంతలోనే ఆ పదార్థాన్ని విశ్లేషించింది ఉజ్వల్ వద్దనున్న కెమికల్ మోనిటర్. విశ్లేషణ ఫలితం చూసి ఆశ్చర్యపోయాడు ఉజ్వల్. అది వెదజల్లిన విష పదార్థం, మనుషులు శక్తికోసం తాగే పాలలాంటిది.

'సృష్టి ఎంత చిత్రమైనది' అనుకుంటూ అడవిలోకి నడిచాడు.

పూర్వకాలం శాస్త్రవేత్తలు, జంతువుల జీవన విధానాలు గమనించేందుకు అడవుల్లో కొన్నేళ్ళు కాపు కాసేవారట. ఇప్పుడు ఆదిమానవుడి కోసం తాను వెదుకుతున్నాడు. ఆదిమానవుడు ఎలా కనిపిస్తాడు? కనిపిస్తే ఎలా వుంటాడు? ఎంతకాలానికి కనిపిస్తాడు? తన దగ్గర ఎక్కువ సమయంలేదు.

ఆలోచిస్తూ నడుస్తున్న ఉజ్వల్ ఆగిపోయాడు.

సూర్యోదయం అవుతోంది.

ప్రాచీనకాలంలో ఇంకా సూర్యోదయ సౌందర్యాన్ని అనుభవించి ఆనందించగలిగే జీవి భూమిపై అవతరించని కాలంలో సూర్యోదయాన్ని తాను చూస్తున్నాడు. ఇంతలో అడవిలో కలకలం వినిపించింది.

వింత వింత శబ్దాలతో పక్షులు గాల్లోకి ఎగిరి సూర్యుడికి స్వాగతం పలుకుతూ నృత్యం చేయడం ఆరంభించాయి. వివిధ రకాల జంతువులు అరుస్తూ తమ గుహల్లోంచి, గూళ్ళల్లోంచి బయటకు వచ్చి సూర్యోదయం తిలకించసాగాయి.

ఇంతలో ఉజ్వల్ గుండె గొంతుకలో కొట్టుమిట్టాడే దృశ్యం కనిపించింది.

భారంగా అడుగులు వేసుకుంటూ ఆదిమానవుల గుంపు జలజలా ప్రవహిస్తున్న నదివైపు వస్తోంది. ఉజ్వల్ కళ్ళు పెద్దవి చేసుకొని ఆవైపే చూడసాగాడు. వాళ్ళందరూ నగ్నంగా ఉన్నారు. ఒళ్ళంతా నల్లటి దట్టమైన వెంట్రుకులున్నాయి. దాదాపుగా పదిమంది ఉంటారు. వాళ్ళు ఏడుగురు మగవాళ్ళు, ముగురు ఆడవాళ్ళు. ఆడవాళ్ళ చంకల్లో పిల్లలున్నారు. ఆపదిమంది నడుమ ఇంకో నలుగురు పిల్లలు నడుస్తున్నారు. పిల్లలు గుంపు మధ్య ఉండడం ఏవైనా జంతువులు దాడి చేస్తే వారికి రక్షణగా అన్నమాట.

ఆవైపే చూస్తున్నాడు ఉజ్వల్.

ఆ గుంపు నది దగ్గరకు వచ్చి ఆగింది. ఒకరొకరుగా నీళ్ళు తాగసాగారు. ఒకరు తాగుతుంటే మిగతావారు ప్రమాదం కోసం చుట్టూ చూస్తున్నారు. వాళ్ళు మంచినీళ్ళు త్రాగడం విచిత్రంగా ఉంది. జంతువుల్లా నోరు నీళ్ళల్లో పెట్టి తాగేస్తున్నారు. అయినా వాళ్ళు మనుషులు కాదు, జంతువులే.

ఇంతలో హఠాత్తుగా పరిస్థితి మారింది.

సూర్యోదయం చూస్తున్న సింహాలగుంపు ఆదిమానవుల గుంపుపైకి లంఘించింది.ప్రశాంతంగా పక్షుల కిలకిలరావాలతో, జంతువుల గర్జనలతో అందంగా వున్న ప్రకృతి అరుపులతో, కేకలతో, భీకర గర్జనలతో, హృదయవిదారక రోదనలతో, దుమ్ముధూళితో నిండిపోయింది. అదంతా చూస్తున్న ఉజ్వల్‌కి ఏం చేయాలో తోచడం లేదు. అతడి కళ్ళముందే మారణహోమం జరుగుతోంది. అడుగుముందుకేసి ఆపగలిగే శక్తి ఉండి కూడా ఏమీ చేయలేడు. తాను జోక్యం చేసుకుంటే గతాన్ని మార్చినట్టవుతుంది. అది భవిష్యత్తుపై ఎటువంటి ప్రభావం చూపిస్తుందో తెలియదు. అందుకే సింహాలు వాళ్ళని చీల్చి చెండాడుతుంటే నిస్సహాయంగా చూస్తూ నిలబడి పోయాడు. కాస్సేపటికి సద్దుమణిగింది. మనుషుల గుంపు మాంసం ముక్కలుగా, విరిగిన అంగాలుగా మిగిలింది. నక్కలు, గ్రద్దలు బిరబిర ఆ ప్రదేశాన్ని ఆక్రమించాయి. ఉజ్వల్ అక్కడినుంచి ముందుకు కదిలాడు.

❄ ❄ ❄ ❄ ❄

వెలుతురు జీవిని భక్తిభావంతో, భయంతో గమనిస్తున్న అతడు రహస్యంగా, నిశ్శబ్దంగా ఆ జీవిని అనుసరించసాగాడు. ఆకలి అనిపించినప్పుడు చెట్ల ఆకులు నములుతూ అందిన పళ్ళు తింటూ జాగ్రత్తగా అనుసరించసాగాడు. అతడు కూడా ఆ గుండెలదిరే దృశ్యం చూసాడు. కానీ నిత్యం అటువంటి ప్రమాదాలు చూస్తుండడం అలవాటయింది అతడికి.

* * * * *

నలుగురైదుగురు ఆదిమానవులు ఆ జంతువును చుట్టుముట్టారు. వీరు పొడుగ్గా, బలిష్టంగా ఉన్నారు. ఆ జంతువు ప్రాణభయంతో తప్పించుకోబోయింది. కోపంతో కోరలు చూపి బెదిరించింది. కానీ వాళ్ళు బెదరలేదు.

ఒడుపుగా ఒకడు వెనుక నుండి దాన్ని పట్టుకున్నాడు. వెంటనే మిగిలిన వాళ్ళు దానిపై దూకారు. అటువంటి జంతువును ఉజ్వల్ ఇంతవరకూ చూడలేదు. అది నక్క, తాబేలు, ఉడతల కలయికలా ఉంది.

దాన్ని చంపి అక్కడే పీక్కుని తినసాగారు వాళ్ళు ఆత్రంగా.

అది చూస్తున్న ఉజ్వల్ కడుపులో తిప్పింది.

ఇంతలో ఏవో జంతువులు పరుగెత్తుకు వస్తున్న శబ్దం వినిపించింది.

ఆ జంతువును పీక్కుతింటున్న మనుషుల కళ్ళల్లో బెదురు కనిపించింది. తినడం పూర్తి చేయాలా, లేక కాళ్ళకు బుద్ధిచెప్పాలా అన్న భావన వాళ్ళల్లో కలిగింది. హఠాత్తుగా చెట్ల చాటునుంచి మరోరకమైన ఆదిమానవులు దూసుకువచ్చారు. వీళ్ళు జంతువును పీక్కుతినే వాళ్ళకన్నా పొట్టిగా, బలహీనంగా ఉన్నారు. కానీ వాళ్ళ చేతుల్లో కర్రల్లాంటివి ఉన్నాయి. వాళ్ళని చూస్తూనే జంతువులు కోపంతో గుర్రుమన్నట్లు ఆదిమానవులు గుర్రుమన్నారు. బలహీనులైన వాళ్ళ దగ్గర ఆయుధాలున్నాయి. సంఖ్యాబలం ఉంది. వెంటనే సమరం ప్రారంభమైంది. పక్షులు గలగలమంటూ పైకెగిరాయి. చిన్న చిన్న జీవులు పారిపోసాగాయి. ఆదిమానవ జాతులు వెర్రి అరుపులతో యుద్ధం ఆరంభించారు. శారీరక బలంపైన ఆయుధ బలం గెలిచింది.

పొట్టివాళ్ళు పొడుగువాళ్ళని పీక్కు తినసాగారు. కడుపునిండా తిని మిగిలిన మాంసంముద్దలను చేతులనిండా పట్టుకుని నడవడం ఆరంభించారు. వారిని అనుసరించాడు ఉజ్వల్.

* * * * *

అతడు నక్కి నక్కి ఉజ్వల్‌నే అనుసరించసాగాడు. ఇంతలో పక్కన అలికిడి అయితే చూసాడు. అతనిలాంటి యవతి అతని దగ్గరకు వచ్చింది.

అతడు  ఆ వెలుతురు జీవివైపు చూసాడు. ఆ యువతి భయంభయంగా చూసింది. 'భయంలేదు, తనని అనుసరించమని' సౌంజ్ఞ చేసాడు అతడు.

తన చేతిలోని దుంపను అతనికిచ్చింది ఆమె. ఆమెవైపు, దుంపవైపు మార్చిమార్చి

చూసాడు అతడు. తనకు కలిగిన ఆనందాన్ని కృతజ్ఞతను ఎలా తెలియజేయాలో అర్థంకాలేదు. కాస్సేపు అటు ఇటూ చూసాడు అయోమయంగా. తరువాత అనుకోకుండా నవ్వాడు. అది చూసి అప్రయత్నంగా ఆమె కూడా నవ్వింది. ఇద్దరూ తమకు అర్థంకాని భావనతో ఆ వెలుతురు జీవి వెన్నంటి నడిచారు.

* * * * *

వాళ్ళు అరుస్తూ, కేకలు పెడుతూ గుహలోకి నడిచారు. తాము మోసుకొచ్చిన తిండిని గుహలో నుంచుని మళ్ళీ తిన్నారు. కాస్సేపు గుర్రుపెట్టి నిద్రపోయారు. వాళ్ళని చూస్తుంటే ఏ కోశానా భవిష్యత్తులో ఎదిగి నాగరీకుల్లా మారతారన్న లక్షణాలు కనబడడంలేదు ఉజ్వల్‌కి. కానీ తాను ఆమోదించిన సిద్ధాంతాల ప్రకారం వీళ్ళే ఆధునిక మానవుడికి మూలం. అంతలో ఉజ్వల్‌కు ఒక ఆలోచన వచ్చింది. తమ విజ్ఞానశాస్త్ర పరిజ్ఞానం, సత్యం, సంపూర్ణం అని అనుకుంటున్నాడు. కానీ అదే సత్యము కాదు, అదే సంపూర్ణమూకాదు.

ఎందుకంటే తమకు లభించిన ఆధారాల ఆధారంగా తాము విజ్ఞాన భవనం నిర్మించుకున్నారు. కానీ అసలు సత్యం తమ ఆధారాల ప్రకారంగానే ఎదగాలని లేదుకదా. ఆధారాలు దొరికితే తమ సత్యం స్వరూపమే మారిపోతుంది కదా. ఎందుకో ఉజ్వల్‌కి నిరాశగా అనిపించింది. ఉజ్వల్ ఆలోచనలకు వెనుక వినిపించిన చప్పుడు భంగం కలిగించింది.

వెనక్కు తిరిగి చూసాడు. చెట్టు చాటునుంచి రెండు జీవాలు బయటకు వచ్చాయి. తనవైపు అద్భుతంగా చూస్తున్నట్లు చూస్తున్నాయి. అవి.

ఉజ్వల్ పలకరింపుగా నవ్వాడు.

ఎందుకో వాటిని చూస్తే ఆప్యాయంగా అనిపించింది. ఉజ్వల్‌కు.

కానీ ఏ కోశానా అవి ఆది మానవులని కూడా అనేట్టు లేవు. పిల్లి కళ్ళు, ఏనుగు తల, చేపల్లాంటి పొలుసులు చర్మంమీద. వామనాకారం. ముఖం సింహంలా ఉంది. కానీ రెండు కాళ్ళపై నిలబడి వుంది. రెండు చేతులున్నాయి. ఇంకా తోక పూర్తిగా అదృశ్యంకాలేదు. సగం జంతువుల మిశ్రమం, సగం మనిషిలాగా ఉన్నాయి. ఆ రెండూ. చూసేందుకు చిన్నపిల్లల్లా ముద్దుగా ఉన్నాయి. మోకాళ్ళమీద కూర్చుని రెండు చేతులూ సాచాడు ఉజ్వల్. వాటిల్లో మగజీవి ఒక అడుగు ముందుకు వచ్చి చేతిలోని దుంపను ఉజ్వల్‌కు అర్పిస్తునట్లు అందించింది. ఆడజీవి అంజలి ఘటిస్తున్నట్లు నిలబడింది.

ఎందుకో ఉజ్వల్‌లో ఒక తెలియని అనురాగ తరంగం ఎగిసిపడింది. సమయమైపోయిందని కాలనౌక నుంచి సంకేతం అందింది.

ఇంతలో పెద్ద శబ్దంతో గుహలోని ఆదిమానవులు ఆ రెండు జీవులపై విరుచుకు పడ్డారు. క్షణంలో పరిస్థితి మారిపోయింది. ఆ ప్రదేశం రణరంగంలా మారిపోయింది. ఆ రెండు జీవులూ భయంతో కేకలు పెడుతున్నాయి. అయితే మగజీవి ఇందాక

చూసినట్టుంది, ఒక కర్రను పట్టుకుని అటూఇటూ ఊపసాగింది. ఆ ఊపుకు ఆదిమానవులు దూరంగా చుట్టూ తిరుగుతున్నారు. దగ్గరకు రాలేకపోతున్నారు. కానీ ఎక్కువసేపు వారిని ఆ జీవి దూరంగా ఉంచలేదని ఉజ్వల్‌కు అర్ధమయింది. ఆడజీవి భయంతో ఏడుస్తోంది.

అది చూసిన ఉజ్వల్ గుండె కరిగిపోయింది. వాళ్ళ మానాన వాళ్ళని వదలి వెళ్ళలేకపోయాడు. కానీ వెళ్ళక తప్పదు. తానీ ప్రపంచానికి చెందినవాడు కాదు, తన ప్రతి చర్య భవిష్యత్తుపై కాదు, మొత్తం మానవ జాతి పరిణామ క్రమంపై ప్రభావం చూపిస్తుంది. కాబట్టి తను జోక్యం చేసుకోకూడదు. కానీ నిర్దాక్షిణ్యంగా ఆ రెండు జీవులను వదిలి వెళ్ళలేకపోయాడు. అప్పటికే ఆదిమానవులు కూడా కర్రలు పట్టుకుని ఊపడం ఆరంభించారు. ఇంక ఎంతోసేపు పట్టదు వాళ్ళకి ఆ రెండు జీవాలను చీల్చిచెండాడేందుకు. తనకు ఆదరంగా, గౌరవంగా దుంపను అందిస్తున్న ఆ జీవి ముఖం ఉజ్వల్ కళ్ళముందు కదలాడింది. ఇక ఆగలేకపోయాడు. వెంటనే లేజర్ తుపాకీ తీసి ఆదిమానవులవైపు గురిపెట్టాడు. క్షణంలో వారు ఆవిరైపోయారు. తమకు ప్రమాదం తప్పిందన్న ఆనందంకన్నా ఈ అద్భుతం చూసిన ఆశ్చర్యంతో ఆ రెండు జీవాలు స్థాణువులైపోయాయి. అంతలోనే తేరుకుని పెద్దగా అరుస్తూ నేలమీద పడి పొర్లసాగాయి. అయితే ఇదంతా గమనించే స్థితిలోలేడు ఉజ్వల్. కాలనౌకను పిలిచాడు. క్షణంలో వచ్చిందది. వెంటనే నౌకలోకి దూరాడు. అప్పటికే ఆలస్యం అయింది. ఇంకో క్షణం అయితే శాశ్వతంగా ఈ అనాగరికుల మధ్య ఉండిపోవాల్సి వస్తుంది. లోపలకు దూకగానే మీట నొక్కాడు.

క్షణాల్లో వింత వెలుగుతో కాలనౌక ఆకాశంలోకి అదృశ్యమయింది. ఆ రెండు జీవులు నోరు తెరుచుకుని ఆకాశంవైపు చూస్తుండిపోయాయి.

* * * * *

"గతాన్ని మార్చే పనులేమీ చేయలేదుకదా?" అడిగాడు ప్రొఫెసర్.

"ఏమీ చేయలేదు" హామీ ఇచ్చాడు. కానీ అతడి కళ్ళముందు ఆ రెండు జీవాలు మెదలుతున్నాయి. తాను చేసింది సరైనదేనా? భవిష్యత్తుపై ఎటువంటి ప్రభావం చూపిస్తుంది?

"ప్రొఫెసర్! మనం విజ్ఞానమనుకుంటున్నది విజ్ఞానం కాదు. మన సిద్ధాంతాలన్నీ పునఃసమీక్షించుకోవాలి" గంభీరంగా అన్నాడు ఉజ్వల్.

నవ్వాడు దిగంత్.

"అచ్చు తత్వవేత్తలా మాట్లాడావు" అన్నాడు.

* * * * *

ఆ విచిత్ర జీవుల సమూహమంతా అతడి ముందు మోకరిల్లింది. రాక్షసుల్లాంటి ఆదిమానవులను అదృశ్యంచేసిన ధీరుడతడు.

అతడు ఆకాశంవైపు వేలు చూపాడు. ఏదో ఎగిరినట్లు శబ్దం చేశాడు.

తాను ఆకాశం నుంచి దిగినట్లు చూసిన స్థలంలో పెద్ద బండరాయి ఉంచాడు. దాని చుట్టూ తిరిగాడు. మోకారిల్లాడు. దుంపను తెచ్చి దాని ముందు ఉంచాడు. మిగతా అందరూ అదే చేశారు. ఆ తరువాత ఏదో తెలియని ఆత్మవిశ్వాసంతో, ధైర్యంతో వేటకు బయలుదేరారు.

అలా ఆరంభమయింది, ఇంకా మానవుడు పూర్తిగా ఎదగకముందే నాగరీకుడు కాకముందే మానవుడిలో దైవ భావన. ఎవరికైనా నమ్మకం కుదరకపోతే టైమ్ మెషిన్‌లో గతంలోకి సరిగ్గా ఈ సంఘటన జరిగిన సమయానికి వెళ్ళి చూడవచ్చు. నిజమో అబద్ధమో తేల్చుకోవచ్చు.

* * *

# బెంటెల్గీస్‌లో బాలుడు

**రా**డార్‌పై చిన్న చుక్కల్లా కనిపించింది అది ఆరంభంలో. దాన్ని ముందుగా గమనించింది బ్లిక్స్! నిజానికి బ్లిక్స్ కూడా దాన్ని గమనించకపోయేవాడు. ఎందుకో ఆ రోజు పని ఆరంభించినప్పటి నుంచీ అతడికి చిరాకుగా ఉంది. మేనీ అతడిని కలుస్తానని మాట ఇచ్చింది. కానీ చివరి క్షణంలో కలవడం కుదరదని చెప్పింది. దాంతో బ్లిక్స్ మూడ్ పాడైపోయింది.

తన మనసుని మేనీ నుంచి మళ్ళించేందుకు అంతవరకూ పట్టించుకోకుండా పడేసిన పాత రికార్డులన్నిటినీ పరిశీలించడం ప్రారంభించాడు బ్లిక్స్. అలా పరిశీలిస్తుంటే అతని దృష్టి హఠాత్తుగా ఆ తేడాపై  పడింది.

అంతరిక్షంలో హైవే మీదుగా ప్రయాణించే వ్యోమనౌకల కదలికలను పసిగట్టే నియంత్రణ కేంద్రంలో పనిచేస్తున్నాడు బ్లిక్స్. అంతరిక్షంలో ప్రయాణించే ప్రతి నౌక వివరాలు ముందుగా బెంటెల్గీస్‌లో ఉన్న ఈ నియంత్రణ కేంద్రానికి తెలుస్తాయి.

ఈ కేంద్రంలో ఉన్న ట్రాకర్ సహాయంతో ఏ నౌక ఏ వైపు ప్రయాణించిందో, ఎప్పుడు ఎక్కడ ఉందో కనుక్కోవచ్చు. నౌక తాను వెళ్ళాల్సిన గమ్యం వైపు కాక దారి మళ్ళితే కూడా వెంటనే పసిగట్టి దానిని సరైన దారిలో పెట్టవచ్చు. రికార్డులను పరిశీలించకుండానే పక్కన పెట్టేయడం బ్లిక్స్‌కు అతని సహచరులకు అలవాటయిపోయింది. ఆ రోజు మనసును మళ్ళించేందుకు పాత రికార్డులను పరిశీలిస్తుంటే బ్లిక్స్ దృష్టి ఆ వివరాలపై స్థిరపడింది.

సాధారణంగా ఎం ఆర్‌పి – 2340 త్రోవలో వ్యోమనౌకలు ప్రయాణం చేయవు. కాబట్టి ఆ త్రోవను పరిశీలించకుండానే పక్కన పడేస్తారు. కానీ గత నెలరోజులుగా ఆ మార్గంలో ఏదో ప్రయాణిస్తున్నది.

అది చూడగానే బ్లిక్స్‌కు చెమటలు పట్టేశాయి. నెలరోజులుగా గుర్తు తెలియని నౌక తమ అంతరిక్షంలో ప్రయాణిస్తోంది. ముందుగా అటువంటి నౌక ఆ మార్గంలో ప్రయాణిస్తున్నదో లేదోనని వెతికాడు.

ఆ నౌక వివరాలు లేవు. సమాచారం లేదు. ఆ తరువాత దాని మార్గాన్ని పరిశీలించాడు. అది తిన్నగా తమ బెంటెల్గీస్ గ్రహం చేరే దారిలోనే వస్తోంది.

లెక్కించాడు. ఇంతలో మూడునెలల్లోగా ఈ మధ్యలో దారి మళ్ళకపోతే అది తిన్నగా బెంటెల్గీస్ గ్రహం చేరుకుంటుంది. బెంటెల్గీస్ గ్రహంలో ఈ పరిశోధన కేంద్రం ఏర్పడడం, అంతరిక్ష సంఘంలో కొన్ని గ్రహవాసులకు ఇష్టంలేదు. వారేమైనా దాడి నౌకను పంపారేమో! సకాలంలో దాన్ని అడ్డుకోకపోతే మొత్తం గ్రహానికే ప్రమాదం సంభవిస్తుంది.

వెంటనే వణుకుతున్న చేతులతో పై అధికారికి సమాచారాన్ని అందజేసే మీట నొక్కాడు బ్లిక్స్. అలా ఆరంభమయింది బెంటెల్గీస్‌లో కనీవినీ ఎరుగని సంక్షోభం.

* * * * *

బెంటెల్గీస్ గ్రహ రక్షణ వ్యవస్థ అధికారి డిన్సెన్ తన ప్రకృతి వీక్షణ గదిలో కూర్చుని అనంత ప్రకృతి విరాట్ స్వరూపాన్ని తిలకిస్తూ ఆనందిస్తున్నాడు.

అంతరిక్షంలో మరే గ్రహానికీ లేనటువంటి ప్రకృతి దృశ్య సంపద బెంటెల్గీస్ గ్రహానికి ఉంది. ఇక్కడ సెకనుకు రెండువందల చొప్పున అగ్నిపర్వతాలు బద్దలవుతుంటాయి. అవి ఆకాశంలోకి వెదజల్లే లావాలోని నిప్పురవ్వలు గాలిలో నృత్యమాడుతూ విన్యాసాలు చేస్తుంటే ఓహ్... ఎంతో అద్భుతంగా ఉంటుంది. ప్రస్తుతం ఆ దృశ్యం చూస్తున్నాడు డిన్సెన్. అతనికి నిప్పు అంటే చాలా ఇష్టం. నిప్పురంగు అంటే మరింత ఇష్టం. నిప్పు రూపు అతనికి ప్రియం.

నిప్పురవ్వల విన్యాసాలను చూస్తున్న డిన్సెన్ ఉలిక్కిపడ్డాడు.

అత్యవసర సమాచార యంత్రం వెలిగింది. గుర్తుతెలియని నౌక బెంటెల్గీస్ వైపు దూసుకువస్తోంది. వెంటనే రక్షణ దళాలకు అప్రమత్తంగా ఉండమని హెచ్చరిక పంపాడు. గ్రహ వ్యవహారాల అధికారి అర్గిల్‌కు సమాచారం పంపాడు.

ఆపై నియంత్రణ కేంద్రం అధికారి నిమ్రాడ్‌తో సంభాషణ ఆరంభించాడు.

* * * * *

బెంటెల్గీస్ అధికారులు అత్యవసరంగా సమావేశమయ్యారు. అందరి ముఖాలు గంభీరంగా ఉన్నాయి. ఇంతకాలం బెంటెల్గీస్‌పై శత్రువుల దాడి అన్నది ఒక ఆలోచన మాత్రమే. ఒక ఊహ మత్రమే. కానీ ఇప్పుడది చేదు నిజం. భయంకరమైన సత్యం.

ఆ మాటలతోటే సమావేశం ఆరంభించాడు డిన్సెన్.

"ఇంతకాలం మన ఊహల్లోనే వున్న విషయం ఇప్పుడు సత్యమయింది. గుర్తుతెలియని వ్యోమనౌక బెంటెల్గీస్ వైపు దూసుకువస్తోంది. ఆ నౌక వివరాలు

మన దగ్గర లేవు. తన గురించి సమాచారం తెలుపమని పంపిన సందేశాలకు సమాధానం రాలేదు. కానీ నౌక వేగంగా మన వైపే దూసుకువస్తోంది" గంభీరంగా చెప్పాడు డిన్సెన్.

"అది ఎక్కడినుంచి వస్తోందో ఏమైనా తెలిసిందా?" అడిగాడు బెంటెల్గీస్ సర్వాధికారి నికెల్.

"అది కనుక్కోవడానికి నాలుగు పరిశోధన నౌకలను పంపాము. అవి ఈ నౌకను చేరి పరిశీలించి సమాచారం సేకరిస్తాయి" చెప్పాడు డిన్సెన్.

"కానీ ఆ వచ్చేది శత్రునౌక అయితే మన పరిశోధన నౌకలపై దాడి చేస్తుందికదా" సందేహం వ్యక్తపరిచాడు బెంటెల్గీస్ వ్యవహారాల అధికారి షాక్.

"అప్పుడు ఆ వచ్చేది శత్రు నౌక అని నిర్ధారణగా తెలుస్తుంది. మన రక్షణ వ్యవస్థ ఎటువంటి శత్రువుల దాడినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంది" చెప్పాడు డిన్సెన్.

"ఆ విషయంలో ఎలాంటి సందేహంలేదు. నేను ఈ గుర్తు తెలియని నౌక సమాచారాన్ని అంతరిక్ష, రక్షణ కేంద్రానికి తెలిపాను. వారి దగ్గర నుంచి ఇంకా ఎటువంటి స్పందన రాలేదు. ఇంతవరకూ మనం తీసుకోవాల్సిన చర్యలన్నిటినీ సక్రమంగా తీసుకున్నాం. త్వరలో మనకు ఈ నౌక సమాచారం తెలుస్తుంది. అప్పుడు మనం ఒక నిర్ణయం తీసుకోవచ్చు. అంతవరకూ అప్రమత్తంగా ఉండాలి అందరూ" అంటూ కదిలాడు నికెల్. క్షణాల్లో వారంతా తమ తమ గమ్యాలకు ఆవిరైపోయారు.

❄ ❄ ❄ ❄ ❄

"ఈ గుర్తుతెలియని నౌక కొన్ని మిలియన్ సంవత్సరాలుగా అంతరిక్షంలో ప్రయాణిస్తోంది"

నికెల్ మాటలు ఆ అత్యవసర సమావేశంలో గంభీరంగా ప్రతిధ్వనించాయి.

పరిశోధన నౌకలు ఈ గుర్తుతెలియని నౌకను పరిశీలించి సమాచారం సేకరించాయి. అంతరిక్ష సమాచార కేంద్రం నుంచి ఆ నౌక గురించిన వివరాలు అందాయి. దాంతో అందిన సమాచారాన్ని విశ్లేషించి నిర్ణయాలు తీసుకునేందుకు బెంటెల్గీస్ అధికారులు అత్యవసరంగా మళ్ళీ సమావేశమయ్యారు.

"ఒక శుభవార్త ఏమిటంటే అది శత్రునౌక కాదు. మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే ఈ నౌక మన గెలాక్సీలోనే కాదు మనకు లక్ష కాంతి సంవత్సరాల దూరంలో వున్న ఏ గెలాక్సీకి కూడా చెందినది కాదు"

గదిలో వున్నవారంతా ఒక్కసారిగా నిట్టూర్పులు విడిచారు.

"ఇంతకాలం అంతరిక్షంలో ప్రయాణించగల అద్భుత నౌకను సృష్టించిన ఆ నాగరికత ఎంత గొప్పదో" అప్రయత్నంగా అనేసాడు డిన్సెన్.

"ఇంత దూరం నుంచి ప్రయాణం చేస్తూ బెంటెల్గీస్ వైపుకే రావడంలో ఏదైనా పరమార్థం ఉందా?" ఆలోచిస్తూ అన్నాడు షాక్.

“ఇంకో ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే ఆ నౌకను ఎవరూ నడపడంలేదు. అసలు దానిలో జీవాలున్న జాడ కూడా లేదు” చెప్పాడు నికెల్.

చాలా సేపటివరకూ గదిలో ఎవరూ మాట్లాడలేదు.

“అది ఎటువంటి పిచ్చి నాగరికత అయి వుంటుంది. ఇంత అద్భుతమైన నౌకను తయారుచేసి శూన్యంలోకి శూన్యంగా పంపడం ఎంత మూర్ఖత్వం?” అన్నాడు షాక్ నిరసనగా.

“అసలుఈ నౌక ఎక్కడనుంచి వస్తుందో తెలుసుకోవడం కోసం అంతరిక్ష కేంద్రానికి కబురు వెళ్ళింది. త్వరలో సమాధానం వస్తుంది. ఇప్పుడు మనం తీసుకోవాల్సిన నిర్ణయం ఏమిటంటే ఈ నౌకను మన బెంటెల్గీన్‌లోకి ప్రవేశించనివ్వడమా వద్దా అన్నది” అందరివైపు చూసాడు నికెల్.

“అది అనవసరమైన ప్రశ్న. నౌకలో ఎవరూలేరు. ప్రవేశానికి అనుమతిస్తే నష్టం ఏమిటి?” చిరాగ్గా అన్నాడు రిమోట్.

“నౌకలో మనకు తెలియకుండా శత్రువులు దాక్కుని వుంటే?” సందేహం వ్యక్తపరిచాడు డిన్సెన్.

“అందుకే ఆ గుర్తు తెలియని నౌకను తిన్నగా మన పరిశోధనాలయంలోకి తీసుకువెళ్ళాలని, వెంటనే దాన్ని ముక్కలుముక్కలుగా చేసి క్షుణ్ణంగా అణువణువూ పరిశీలించాలని నేను ప్రతిపాదిస్తున్నాను” చెప్పాడు నికెల్.

“అంత అద్భుతమైన నౌకను ఇన్ని కాంతి సంవత్సరాలుగా ప్రయాణం చేయగల శక్తిగల నౌకను ముక్కలు ముక్కలుగా విడగొట్టడం సమంజసంగా అనిపించడంలేదు. దాన్ని పరిశోధిస్తే మనమూ అటువంటి నౌకను తయారు చేయవచ్చుకదా” మెల్లగా అన్నాడు. డిన్సెన్.

ఆ విషయంపై వాదోపవాదాలు జరిగాయి. వేడిగా చర్చలు జరిగాయి. చివరికి ఆ గుర్తు తెలియని నౌకను, దాన్ని తయారు చేసిన విధానం, ఇంధనం వాడకం వంటి విషయాలను పరిశీలించి తెలుసుకున్న తరువాతే ముక్కలుగా విడగొట్టాలని నిర్ణయించారు.

* * * * *

బెంటెల్గీస్ ప్రజలంతా ఆ గుర్తుతెలియని నౌక కోసం ఆత్రంగా ఎదురుచూడ సాగారు. గ్రహం నలుమూలలా గుర్తుతెలియని నౌక గురించిన చర్చలు జరుగు తున్నాయి.

వీధివీధినా ఉన్న సమాచార పలకలపై రకరకాల అభిప్రాయాలు వెల్లడవు తున్నాయి. ప్రస్తుతం అధికారంలో వున్న వారిని పడగొట్టాలని ప్రయత్నిస్తున్న వారు ప్రజలలో రకరకాల భయాలను కలిగిస్తున్నారు.

ఆ నౌకలో రహస్య జీవులున్నాయని, నౌక బెంటెల్గీస్ నేలపై దిగగానే అవి తమపై దాడి చేసి ఆక్రమిస్తాయని కథలు కథలుగా ప్రచారం చేస్తున్నారు. మరి

కొందరు ఆ నౌకలో ఓ అంతరిక్ష ప్రేమికుడు అనంతకాలంగా ప్రయాణం చేస్తూ తన అనంత ప్రేయసి కోసం అన్వేషిస్తున్నాడని కవితలు అల్లసాగారు.

ఈ రకంగా ప్రశాంతంగా ఎలాంటి సంచనాలు అలవాటులేని బెంటెల్గీస్ గ్రహం మొత్తం ఆ గుర్తుతెలియని నౌక రాక గురించి అట్టుడికి పోసాగింది. అందరూ ఆతృతగా ఆ నౌక తమ గ్రహంలో దిగడంకోసం ఎదురు చూడసాగారు. అందరూ ఎదురు చూస్తున్న ఆ ఘడియ వచ్చేసింది.

* * * * *

‘‘ఇప్పుడే సమాచారం అందింది. ఆ నౌకను మన వాతావరణంలోకి రానివ్వకూడదని అంతరిక్ష హెచ్చరిక కేంద్రం ఆజ్ఞలు జారీ చేసింది. కారణాలు తరువాత చెబుతారట” సమాచారం చదువుతూనే డిన్సెన్, నికెల్‌ను కలిపాడు.

“మరో అత్యవసర సమవేశానికి సమయంలేదు. ఏం చేద్దాం?” అడిగాడు నికెల్.

“అంతరిక్ష కేంద్రం చెప్పినట్లు చేయాల్సిందే. వెంటనే ఆజ్ఞలు జారీ చేయడం తప్ప మరో గత్యంతరం లేదు” నిరాశగా చెప్పాడు డిన్సెన్.

* * * * *

లక్ష కాంతి సంవత్సరాల దూరం నుంచి ప్రయాణం చేసి వచ్చిన అంతరిక్ష నౌక తమ గ్రహంపై దిగడం వారికి అనూహ్యమైన అద్భుతం.

నెమ్మదిగా నౌక బెంటెల్గీస్ భూమిపై దిగింది” సమాచారం అందగానే మనసులో సంతోషించాడు డిన్సెన్. ఒకరకంగా అతడు కోరుకుంటున్నదీ అదే. ఆ నౌకలోని వింతలు చూడాలని, రహస్యాలు గ్రహించాలని అతడికి కోరికగా ఉంది. వెంటనే ఈ సమాచారాన్ని నికెల్‌కు పంపి నౌకను చూసేందుకు బయలుదేరాడు.

* * * * *

అంతరిక్ష రక్షకులు నౌక చుట్టూ రక్షణగా నిలబడ్డారు.

ప్రజలు దూరం నుంచే వింతగా చూడసాగారు. ఎంతసేపైనా ఏమీ కాకపోవడంతో వారికి విసుగు రాసాగింది.

అయితే ఏం జరుగుతుందని ఎదురు చూస్తున్నారో, ఏం జరగాలని కోరుకుంటున్నారో వారికే తెలెయదు.

ఇంతలో డిన్సెన్ అక్కడికి వచ్చాడు.

అతడు రాగానే విశ్లేషణాధికారి చెప్పాడు.

“నౌకలో ప్రత్యేకత ఏమీలేదు. ప్రాచీన నాగరికతలో వాడే అపరిపక్వ పదార్థాలతో తయారుచేసారు నౌకను. లోపల కొన్ని గదులున్నాయి. కానీ వాటిల్లో ఏమీలేదు. ఇది ఎల్లప్పటికీ తనంతట తాను ఇంధనం తయారు చేసుకుంటూ పనిచేసే సూత్రంతో తయారైన వ్యోమనౌక” గబగబా వివరాలు అందించాడు.

“లోపలకు వెళ్ళవచ్చు కదా” అడిగాడు డిన్సెన్.

"ఎటువంటి ప్రమాదంలేదు" చెప్పాడు విశ్లేణాధికారి.

డిన్సెన్ అడుగు ముందుకేసాడు.

❄ ❄ ❄ ❄ ❄

"ఈ గుర్తు తెలియని నౌక విశ్వం అంచులో వున్న సౌర కుటుంబం నుంచి వచ్చిందని సమాచారం అందింది. తమ భూగ్రహం నాశనం అయిపోతూ ఉండడంతో తమకు సంబంధించిన సమాచారాన్నంతా ఈ నౌకలో నిక్షిప్తంచేసి విశ్వంలోకి వదిలారని తెలిసింది. అయితే ఈ నౌకలో తమను సృజించే జీవాన్ని కూడా వారు పొందుపరిచారని తెలిసింది. అందుకే చాలా ప్రమాదకమైనది ఈ నౌక. వెంటనే శూన్యంలోకి వదిలేయండి. లేకపోతే నాశనం చేసేయండి"

అత్యవసరంగా అంతరిక్ష అధ్యక్షుడి నుంచి అందిన సమాచారం చూసి నౌక దగ్గరకు వెళ్ళబోతున్న నికెల్ ఆగిపోయాడు.

"నౌక ఇప్పటికే దిగిపోయింది. డిన్సెన్ లోపలకు వెళ్ళబోతున్నాడు. ఇంతకీ నౌకవల్ల మనకు ప్రమాదం ఏమిటి?" అడిగాడు నికెల్.

"డిన్సెన్‌ని ఆగిపొమ్మను. ప్రమాదం" గట్టిగా అరిచాడు అంతరిక్ష అధ్యక్షుడు.

"అంత ప్రమాదం ఏమిటి?" అర్ధంకాక అడిగాడు నికెల్.

"ఆ నౌకలో ఉన్నవి మానవజాతి బీజాలు. విశ్వంలో ఉన్న అత్యంత ప్రమాదకర జీవి మానవుడు. ఇతర జీవులు ప్రకృతిపై ఆధారపడి బ్రతుకుతాయి. ప్రకృతి నుంచి ఎంత తీసుకుంటే అంత ప్రకృతికి తిరిగి అందిస్తాయి. కానీ మానవుడు స్వార్ధపరుడు. ప్రకృతిని నిర్దేశించడం గొప్ప అనుకుని సర్వనాశనం చేసుకునే మూర్ఖుడు. విశ్వంలోని జీవులు ఆహారం కోసమే చంపుతాయి. కానీ భయంకరమైన మారణాయుధాలు తయారు చేసుకుని తమని తాము నాశనం చేసుకున్న నీచులు మానవులు. పైగా వీళ్ళకి ఉన్న రోగం ఎదుటి వాడిపై అధికారం చలాయించడం. వాళ్ళిక్కడ ఎదిగారంటే కొన్నాళ్ళకి మన జీవితాలు భగ్నమైపోతాయి. అందుకే అంతరిక్షంలోని ఏ గ్రహం కూడా ఈ నౌకను స్వీకరించడంలేదు. అందరూ మరింత ముందుకు తోస్తున్నారు. అయినా మన దగ్గరకు వచ్చి పడింది. మీరూ దాన్ని శూన్యంలోకి వదిలేయండి" కంగారుగా చెప్పాడు అధ్యక్షుడు.

"ఇంత సాంకేతిక ప్రగతి సాధించిన మానవజాతిలో ఒక్క సుగుణం కూడా లేదా?" అడిగాడు నికెల్.

"ఉంది. అదేమిటంటే ఎటువంటి పరిస్థితిలోనయినా బ్రతకగలగడం. విశ్వంలో అనేక సందర్భాలలో రకరకాల జీవాలు నాశనమైపోయాయి. కానీ అన్ని ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ కూడా మానవుడు బ్రతకగలడు. ఇప్పుడు చూడు లక్షమిలియన్ కాంతి సంవత్సరాలు దాటి వచ్చి కూడా బ్రతకాలని ప్రయత్నిస్తున్నాడు" అన్నాడు అధ్యక్షుడు.

ఈ సమాచారాన్ని డిన్సెన్‌కు వెంటనే పంపేసాడు నికెల్.

కానీ అప్పటికే ఆలస్యం అయింది.

డిన్సెన్ ఆ గుర్తుతెలియని నౌకలో అడుగు పెట్టేసరికి అప్పటివరకూ నిద్రాణస్థితిలోవున్న మానవ లక్షణాల సర్వస్వం డిఎన్ఎ జాగృతమయింది. తనలో నిక్షిప్తమై ఉన్న సమాచారాన్ని అనుసరిస్తూ మానవ శిశువును తయారుచేసింది.

డిన్సెన్ నౌక రహస్యాల కోసం వెతికే సమయానికి వటపత్రంలాంటి వ్యోమనౌకలో చిరునవ్వులు చిందిస్తూ ముద్దులొలికే మానవ శిశువు కనిపించాడు. కాలిబొటనవేలు నోట్లో వుంచుకుని అమాయకంగా నవ్వుతున్నాడు.

డిన్సెన్‌కు ఆ దృశ్యం అద్భుతంగా అనిపించింది. అప్పుడే అతడికి నికెల్ నుంచి సమాచారం అందింది. కానీ డిన్సెన్ ఆ సమాచారాన్ని పట్టించుకోలేదు.


ముద్దులొలికే అమాయకమైన శిశువే కొన్నాళ్ళకు మోసగాడు, క్రూరుడు, మూర్ఖుడు అవుతాడు అంటే ఎవరు నమ్ముతారు?

తన అరచేతులను సాచి ఆ మానవ శిశువును ఎత్తుకుని గుండెకు హత్తుకున్నాడు డిన్సెన్.

* * *

వైజ్ఞానికశాస్త్రాంశాలఆధారంగా సృజించిన హార్డ్‌కోర్ సైన్స్ ఫిక్షన్ కథలు ఇవి. నిజానికి దగ్గరగా ఉంటూ భవిష్యత్తులో ఇలా నిజంగా జరగవచ్చనన్నట్టనిపించే కథలివి. ఇందులోని కొన్ని కథలు ఇప్పటికే నిజమవుతున్నాయి.

కస్తూరి మురళీకృష్ణ బహుగ్రంథకర్త. సాహిత్యక్షేత్రంలో 'ఆలౌరౌండర్'గా పరిగణించవచ్చు. ఆంధ్రభూమి వారపత్రికలో 'పవర్ పాలిటిక్స్' శీర్షికను గత దశాబ్దంగా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. కల్హణ కశ్మీర రాజతరంగిణి కథలు, సౌశీల్యద్రౌపది, అసిధార, పాప్ ప్రపంచానికి రారాజు మైకెల్ జాక్సన్, రియల్ స్టోరీస్, భారతీయ వ్యక్తిత్వవికాసం వంటి రచనలు బహు పాఠకాదరణ పొందుతున్నాయి. అలా ఆదరణ పొందిన పుస్తకాలజాబితాలోకి ఈ పుస్తకం కూడా చేరుతుందన్నది మా విశ్వాసం.




**కస్తూరి మురళీకృష్ణ ఇతర రచనలు**

| నవలలు | కథలు | కాల్పనికేతర రచనలు | |
|---|---|---|---|
| • అసిధార | • 4×5 | • భారతీయ వ్యక్తిత్వవికాసం | • మన ప్రధానమంత్రులు |
| • అంతర్మథనం | • జీవితం జాతకం | • భారతీయ తత్వచింతన | • మన ముఖ్యమంత్రులు |
| • మర్మయోగం | • కశ్మీర రాజతరంగిణి కథలు | • పాప్ ప్రపంచానికి రారాజు మైకెల్ జాక్సన్ | • తీవ్రవాదం |
| • సౌశీల్యద్రౌపది | • రియల్ స్టోరీస్ | | • అక్షరాంజలి |